

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఇక 60 రోజులే

రైల్వే అడ్వాన్స్ బుకింగ్ గడువు కుదింపు

ఇప్పటి వరకు 120 రోజుల సమయం

1 నుంచి కొత్త నిబంధన అమలులోకి

టికెట్ల రద్దు శాతాన్ని తగ్గించేందుకే.. కొత్త విధానంపై రైల్వే శాఖ వివరణ

2

శుక్రవారం | 18-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 201 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి ఉ. 1.16 తదుపరి విదియ; నక్షత్రం: అశ్విని ఉ. 1.26 తదుపరి భరణి, వర్జ్యం: ఉ. 9.55-11.19, రా. 9.58-10.23, దుర్ముహూర్తం: ఉ. 8.31-9.17, మ. 12.23-1.09, అమృతఘడియలు: ఉ. 7.06-8.30, రాహుకాలం: ఉ. 10.30 నుంచి 12.00 వరకు, సూర్యోదయం: 6.12, సూర్యాస్తమయం: 5.47 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మూసీకి పునరుజ్జీవం

సుందరీకరణ కాదు.. పూర్తి ప్రక్షాళనే

ఇందుకు పనికొచ్చే సలహా సూచనలు ఎవరిచ్చినా తీసుకుంటాం

అందరికీ నచ్చేరీతిలో ప్యాకేజీ.. అన్ని విధాలా నిర్వాసితుల్ని ఆదుకుంటాం

మూసీపై అఖిలపక్షం.. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలూ ఏర్పాటు చేస్తాం

హైదరాబాద్‌ను ప్రపంచంలో గొప్ప నగరంగా తీర్చిదిద్దడానికిదే అవకాశం

స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, సమతామూర్తి, బుర్జ్ ఖలీఫా వంటి నిర్మాణాల్లో భాగస్వాములైన గ్లోబల్ కంపెనీలతో కలిసి కన్సార్షియం ఏర్పాటు చేశాం

ఎవరికీ ఇష్టం లేదంటే ప్రాజెక్టు ఆపేస్తా.. టెండర్లు రద్దు చేస్తా: సీఎం

బందిపోటు దొంగల్లా పదేళ్లు దోచుకున్న వాళ్లే అడ్డుకుంటున్నారు

బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై రేవంత్‌రెడ్డి మండిపాటు



మూసీ ప్రక్షాళనపై గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, చిన్నారెడ్డి

మూసీ నది నీళ్లు ఉండాల్సిన ప్రాంతం. నీళ్లు ఉండాల్సిన చోటకు మనం వెళితే.. మనం ఉండే చోటకు నీళ్లు వస్తాయి. చెరువులు, నాలాలు, కుంటలను ఆక్రమిస్తే.. ప్రకృతి ప్రకోపించి అది ఉప్పెనగా మారి కప్పేస్తుంది. ఆ తర్వాత ఎవరూ మిగలరు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉండే నివాసితులు, నిర్వాసితులకు కష్టం, నష్టాన్ని ప్రభుత్వం కల్పించదు. తగిన పరిహారం అందించే తరలిస్తాం. మూసీ లాంటి మురికిలో ఉండాలని ఎవరూ కోరుకోరు.

- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): "బందిపోటు దొంగల్లా తెలంగాణను పదేళ్ల దోచుకున్న వాళ్ల మూసీ పునరుజ్జీవాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. సుందరీకరణ అంటూ కాస్మెటిక్ కలర్ అద్దాలని చూస్తున్నారు. వాళ్ల మెదడులో మూసీ మురికి కంటే ఎక్కువ విషాన్ని నింపుకొన్నారు. తమ ప్రయత్నం మూసీ సుందరీకరణ కోసం కాదు. పునరుజ్జీవం కోసం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవానికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ విషయంలో పనికొచ్చే సలహా సూచనలు ఎవరు ఇచ్చినా స్వీకరిస్తామని అన్నారు. మూసీ నిర్వాసితులకు తాము ఇవ్వాలనుకుంటున్న దానికన్నా మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలంటే అందుకూ తాము సిద్ధమన్నారు. ప్రజల్ని మెప్పించి, వాళ్ల మనసుల్ని గెలిచేలా ఏం చేద్దామో చెప్పాలని ప్రతిపక్షాల్ని కోరారు. సచివాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. మూసీ నది ఇప్పుడు ఎలా ఉంది!? పునరుజ్జీవం తర్వాత ఎలా ఉండబోతోందన్న అంశాన్ని

మిగతా 13వ పేజీలో...

గెలవలేమనే అడ్డగోలు హామీలిచ్చారు

ఈ విషయం ఓ కాంగ్రెస్ మంత్రి చెప్పారు.. 15 మందిని మార్చి ఉంటే మీరే గెలుస్తుండే అన్నారు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏమీ తెల్వదు.. తెల్వదన్న విషయమూ తెల్వదు

లోపభూయిష్ట విధానాలతో గ్రూప్-1 మెయిన్స్ మళ్లీ రద్దయ్యే పరిస్థితి

పైన జుమ్లా పీఎం.. ఇక్కడ హౌలా సీఎం.. 25 సార్లు ఢిల్లీకెళ్లి రేవంత్ చేసిందేమీ లేదు.. మూసీ బాధితులకు అండగా ఉంటాం: కేటీఆర్

12



'నేవీ రేడార్' కోసం కేటీఆర్ 130 కోట్లు తీసుకున్నడు

ఇప్పుడేమో రేడార్ స్టేషన్‌తో నష్టమని అంటుండు

హైడ్రాతో పాటు మూసీ ప్రక్షాళన గత సర్కారు నిర్ణయాలే

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

13

ఈ నెల 23న క్యాబినెట్

కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం


తెగుళ్ల బారిన పడిన పత్తి పంట

పత్తి మీద సాము

- 45 రోజుల వానలతో దూది రైతుకు దిగులు
- ఎకరానికి 4-5 క్వింటాళ్ల దిగుబడీ గగనమే
- రాష్ట్రంలో 43 లక్షల ఎకరాల్లో పంట సాగు
- 33 శాతానికిపైగా నష్టం.. పరిహారం ఊసే లేదు
- రూ.475 బోనస్ మాటెత్తని రాష్ట్ర ప్రభుత్వం
- సీసీఐ కొనుగోళ్లు లేక మద్దతు ధర కరువు
- రూ.7 వేల వరకే చెల్లిస్తున్న వ్యాపారులు

వరంగల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎంతో శ్రమకోర్చి సాగు చేసిన పంట భారీ వర్షాలు, వాతావరణ మార్పులతో తెగుళ్ల బారిన పడుతోంది.! మార్కెట్‌కు తీసుకెళ్తే కనీస మద్దతు ధర దక్కడం లేదు.! దీంతో రాష్ట్రంలో పత్తి రైతులు డీలా పడుతున్నారు.! అధికారంలోకి వస్తే పత్తికి రూ.475 బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆ ఊసెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం వాటిల్లినా పరిహారం వచ్చే పరిస్థితి లేకపోవడంతో దిగులు పెట్టుకున్నారు. రాష్ట్రంలో 43,76,043 ఎకరాల్లో పత్తి పండిస్తున్నారు. దేశంలో ఈ పంటను అత్యధికంగా సాగు చేసే రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ, నిజామాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పత్తి అత్యధికంగా పండిస్తున్నారు. పరిస్థితుల నేపథ్యంలో నిరుటి కంటే సాగు విస్తీర్ణం తగ్గింది. ఇక నెలన్నర నుంచి కురుస్తున్న వర్షాలు, వాతావరణ పరిస్థితులు రైతును తీవ్రంగా ముంచాయి. ఏటా దసరా, దీపావళి మధ్య తొలి కాత వస్తుంది. ఈ సమయంలోనే వర్షాలు కురవడంతో

మిగతా 12వ పేజీలో...

మొక్కజొన్నకు దిక్కేది?

మార్కెట్‌కు పంట.. కొనుగోలు కేంద్రాలు తెరవని మార్క్‌ఫెడ్

తరుగు పేరిట రూ.150 వరకు దళారుల కోత.. తూకంలో దగా

ఎన్డీయే వ్యతిరేక శక్తులను ఓడిద్దాం!

పేదలకు సాధికారతే కర్తవ్యం.. ఎన్డీయే భేటీలో మోదీ

వచ్చే ఏడాది 'రాజ్యాంగ అమృత మహోత్సవం'

హరియాణాలో ప్రత్యేకంగా సమావేశమైన ఎన్డీయే కూటమి

చంద్రబాబుకు కీలక ప్రాధాన్యం.. ఆయన సూచన మేరకే భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించే దిశగా కలిసికట్టుగా కృషి చేయాలని, కూటమి వ్యతిరేక శక్తులను ఓడించాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే తీర్మానించింది. రాజ్యాంగాన్ని ఆమోదించి వచ్చే ఏడాది 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 'సంవిధాన్ కీ అమృత మహోత్సవ్'ను జరుపుకోవాలని నిర్ణయించింది. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నాడు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిని ప్రజలకు వివరించాలని, వాజపేయి శతజయంతితో పాటు సర్దార్ పటేల్, బిర్సా ముండా 150వ జయంతిని కూడా జరుపుకోవాలని నిర్ణయించింది. గురువారం చండీగఢ్‌లో హరియాణా నూతన ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం తర్వాత జరిగిన ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సుపరిపాలనతో పాటు ప్రజల జీవితాలను మెరుగుపరచడంపై తాము విస్తృతంగా

మిగతా 2వ పేజీలో...


ఎన్డీయే భేటీలో ప్రధాని మోదీతో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంపవన్ కల్యాణ్

2

హరియాణా సీఎంగా సైనీ ప్రమాణం

మొత్తం 13 మంది మంత్రులుగా ప్రమాణం

హాజరైన ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్

బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరు


మిర్యాలగూడ మండలంలో రైస్‌మిల్లుల వద్ద ధాన్యం లోడు ట్రాక్టర్లు

ఇచ్చింది తీసుకో.. లేదంటే పో!

సన్న ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడి


12

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో ఇష్టారాజ్యం

రైతులకు కనీస మద్దతు ధర కూడా ఇవ్వని వైనం

క్వింటాల్‌కు రూ.2,100-2,300 మాత్రమే చెల్లింపు

భారీగా నష్టపోతున్న అన్నదాతలు.. పట్టించుకోని అధికారులు



నటి తమన్నాను ప్రశ్నించిన ఈడీ

గువాహటి ఈడీ కార్యాలయంలో వాంగ్మూలం నమోదు

మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్ కేసులో పలువురు సెలబ్రిటీలు

2

హమాస్ చీఫ్ యాహ్యా హతం

అక్టోబరు 7 మారణకాండ సూత్రధారిని చంపేశాం

ప్రకటించిన ఇజ్రాయెల్.. ధ్రువీకరించని హమాస్

లెక్క సరిచేశాం.. యుద్ధం ముగియలేదు: నెతన్యాహు



జెరూసలెం, అక్టోబరు 17: ఉగ్ర సంస్థ హమాస్ అధిపతి యాహ్యా సిన్వర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. నిరుడు అక్టోబరు 7న తమ దేశంపై జరిపిన మారణకాండకు సూత్రధారిని మట్టుపెట్టినట్లు పేర్కొంది. సామూహిక హత్యాకాండకు మూల కారకుడిని గురువారం ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) తుదముట్టించిందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తెలిపారు. తమ ప్రజలపై హోలోకాస్ట్ తర్వాత చరిత్రలో అతిపెద్ద మారణకాండకు పాల్పడిన వ్యక్తిని హతమార్చామని, మొత్తానికి లెక్క సరిచేశామని.. యుద్ధం మాత్రం ముగియలేదని పేర్కొన్నారు. హమాస్ వద్దనున్న బందీలను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఇదో కీలక ఘట్టంగా చెప్పారు. కాగా, సిన్వర్ మృతిపై విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఈ మేరకు పలు దేశాల విదేశాంగ మంత్రులకు సందేశం పంపారు. హమాస్, ఇరాన్ నియంత్రణ నుంచి గాజా విముక్తం అవుతుందని తెలిపారు. కాగా, ఏడాది నుంచి సాగుతున్న వేట ముగిసిందని.. అక్టోబరు 16న రాత్రి తమ దక్షిణ కమాండ్ దళాలు సిన్వర్‌ను చంపేశాయని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. దీనిని గొప్ప సైనిక, నైతిక విజయంగా అభివర్ణించారు. ఇరాన్

మిగతా 2వ పేజీలో...





ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ

హరియాణా సీఎంగా సైనీ ప్రమాణం

- మొత్తం 13 మంది మంత్రులుగా ప్రమాణం
- హాజరైన ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్

చండీగఢ్, అక్టోబరు 17: హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం చేశారు. పంచ్‌కులాలోని దసరా మైదానంలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో గవర్నర్ బండారు దత్తాత్రేయ.. సైనీతో పాటు మరో 13 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర కేంద్ర మంత్రులు, బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా, బీజేపీని వరుసగా మూడోసారి గెలిపించడంలో కీలకపాత్ర పోషించడంతో సైనీకి అధిష్ఠానం రెండోసారి సీఎంగా అవకాశమిచ్చింది. 54 ఏళ్ల సైనీ ఓబీసీ కావడం కూడా కలిసొచ్చింది. 90 స్థానాలున్న హరియాణా అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ 48 నియోజకవర్గాల్లో గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించింది. మరోవైపు.. సైనీ ప్రమాణ కార్యక్రమాన్ని అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఎన్నికైన ప్రభుత్వాన్ని ప్రమాణం చేయకుండా అడ్డుకోమనడమేంటని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది.

మహా వికాస్ అఘాడీలో సీట్ల సర్దుబాటు కొలిక్కి!

- ఇప్పటి వరకు 200 సీట్లపై అవగాహన: శరద్ పవార్

పుణె, అక్టోబరు 17: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ పార్టీలు దూకుడు పెంచాయి. నవంబరు 20 జరిగే ఎన్నికల దృష్ట్యా మహా వికాస్ అఘాడీ కూటమి(ఎంవీఏ)లో సీట్ల సర్దుబాటు ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చిందని ఎన్సీపీ(ఎస్పీ) సీనియర్ నేత శరద్ పవార్ తెలిపారు. 288 అసెంబ్లీ స్థానాలకు గాను 200 సీట్లపై కూటమి పార్టీల మధ్య అవగాహన కుదిరిందని గురువారం వెల్లడించారు. "సీట్ల పంపకంపై కూటమి నేతలతో మా పార్టీ తరుపున జయంత్ పాటిల్ చర్చిస్తున్నారు. నాకు అందిన సమాచారం మేరకు ఇప్పటి వరకు దాదాపు 200 సీట్లపై కూటమి నేతలు అవగాహనకు వచ్చారు. హరియాణా ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తున్నాం. హరియాణాలో కాంగ్రెస్ పరాజయ ప్రభావం మహారాష్ట్రపై ఏ మాత్రం ఉండదు" అని పవార్ పేర్కొన్నారు. అయితే శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీలిక అనంతరం జరిగే మొదటి అసెంబ్లీ ఎన్నికలు ఇవి.

యూజీసీ నెట్ ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 17: యూజీసీ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్ఈటీ-నెట్) ఫలితాలు గురువారం వెల్లడయ్యాయి. ఆగస్టు, సెప్టెంబరుల్లో 11 రోజుల పాటు 83 సబ్జెక్టుల్లో ఈ పరీక్షలు జరిగాయి. వీటిని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించింది. ఈ పరీక్షల కోసం మొత్తం 11,21,225 మంది పేర్లు రిజిస్టర్ చేసుకోగా అందులో 6,84,224 మంది మాత్రమే పరీక్షలు రాశారు. వారిలో 4970 మంది జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), 53,694 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవులకు, 1,12,070 మంది పీహెచ్‌డీకి అర్హత సాధించారు. ఫలితాలను యూజీసీనెట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వీటితో పాటుగా పరీక్షల కటాఫ్ మార్కులను కూడా వెబ్‌సైట్‌లో పెట్టింది.

హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్ హతం

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని ఉగ్ర మూకపై స్వేచ్ఛా ప్రపంచం సాధించిన విజయంగా పేర్కొన్నారు. రఫాలో బుధవారం చేపట్టిన లక్షిత భూతల దాడుల్లో సిన్వర్, మరో ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు. జైల్లో ఉన్నప్పుడు సేకరించిన డీఎన్ఏ ద్వారా సిన్వర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. సిన్వర్ మృతిని హమాస్ ధ్రువీకరించలేదు. శరణార్థి శిబిరంలో పుట్టిన సిన్వర్ 2017 నుంచి హమాస్ చీఫ్‌గా వ్యవహరిస్తున్నాడు. గాజాలో సాధారణ ప్రజలు, బందీలను రక్షణగా వాడుకుంటూ దాడులను తప్పించుకుంటున్నాడు. సైనిక వ్యూహాల్లో కీలకంగా నిలిచే.. సిన్వర్ మృతి నిజమే అయితే హమాస్‌కు పెద్ద దెబ్బ. ఇరాన్‌లో జూన్ 2న హమాస్ రాజకీయ విభాగం అధిపతి ఇస్మాయిల్ హనియేను ఇజ్రాయెల్ హతమార్చింది. ఇప్పుడు సిన్వర్‌నూ చంపేసింది. దీంతో నాయకత్వ శూన్యత ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

అసోం శరణార్థులకు పౌరసత్వం సరైనదే!

- సెక్షన్ 6ఏ రాజ్యాంగబద్ధమే స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- 4:1 మెజారిటీతో తీర్పు
- ఆ సెక్షన్ దుర్వినియోగమవుతోందని విడిగా జస్టిస్ పార్దీవాలా తీర్పు
- సుప్రీం తీర్పుపై 'ఆసు' హర్షం



న్యూఢిల్లీ, అక్టోబరు 17: అస్సాంకు శరణార్థులుగా తరలి వచ్చిన వారికి భారత పౌరసత్వాన్ని కల్పించేందుకు పౌరసత్వ చట్టంలో చేర్చిన 6ఏ నిబంధన రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాంలో అక్రమ వలసల సమస్యకు 'అస్సాం ఒప్పందం' ద్వారానే రాజకీయ పరిష్కారానికి కృషి జరిగిందని పేర్కొంది. సదరు ఒప్పందంలో భాగంగానే పౌరసత్వ చట్టంలో 6ఏ నిబంధన చేర్చారని గుర్తు చేసింది. సెక్షన్ 6ఏ రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. 1966 జనవరి 1-1971 మార్చి 25 మధ్య కాలంలో అసోంకు వలస వచ్చిన వారికి భారత పౌరసత్వాన్ని కల్పించేందుకు అనుమతించే సెక్షన్ 6ఏ సరైనదేనని, దీనిని తీసుకొచ్చే అధికారం పార్లమెంటుకు ఉందని ధర్మాసనం తెలిపింది. ఈ మేరకు పిటిషన్లను కొట్టివేస్తూ 4:1 మెజారిటీతో తీర్పును వెలువరించింది. ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ జేబీ పార్దీవాలా.. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఏ రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ విడిగా తీర్పును వెలువరించారు. నకిలీ పత్రాలు, సాక్ష్యాధారాలు సమర్పించి భారత పౌరసత్వం పొందటానికి ఈ సెక్షన్ అవకాశం కల్పిస్తుందన్నారు. కాగా, సీజేఐ చంద్రచూడ్ తీర్పును వినిపిస్తూ.. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే అస్సాంలో అక్రమ వలసలు ఎక్కువన్నారు. దీనికి కారణం, ఆ రాష్ట్రం భౌగోళికంగా చిన్నది కావటంతోపాటు, అక్రమ వలసదారుల్ని గుర్తించటం అక్కడ కష్టతరంగా మారటమేనని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును చరిత్రాత్మకమైనదిగా 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' (ఆసు) అభివర్ణించింది. సహేతుక కారణాలతో అస్సాం ఉద్యమం జరిగిందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పినట్లయ్యిందని పేర్కొంది. అయితే, సెక్షన్ 6ఏను వ్యతిరేకిస్తూ తొలిసారిగా పిటిషన్ దాఖలు చేసిన ఆసు మాజీ నేత మతియుర్ రెహమాన్.. సుప్రీంకోర్టు తీర్పు వల్ల స్థానిక మూలవాసుల ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. అక్రమ వలసదారుల కేంద్రంగా అస్సాం మారటం దురదృష్టకరమని చెప్పారు. 1985లో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కేంద్రప్రభుత్వానికి, ఆసుకు మధ్య ఒప్పందం కుదిరింది. దీంట్లో భాగంగానే, పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ సెక్షన్ 6ఏను ప్రవేశపెట్టారు. ప్రధానంగా బంగ్లాదేశ్ నుంచి అస్సాంకు అక్రమంగా వలస వచ్చిన వారికి ఈ చట్టం ప్రకారం పౌరసత్వం కల్పిస్తున్నారు.



'మిస్ ఇండియా - 2024'గా నిఖితా పోర్వాల్

- మధ్యప్రదేశ్‌కు చెందిన యువతికి కిరీటం
- రన్నరప్‌గా రేఖా పాండే

ముంబై, అక్టోబరు 17: 'ఫెమినా మిస్ ఇండియా-2024' కిరీటాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన నిఖితా పోర్వాల్ దక్కించుకున్నారు. బుధవారం ముంబైలోని ఫేమస్ స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో ఆమెను విజేతగా ప్రకటించారు. 60వ మిస్ ఇండియా విజేతగా నిలిచిన నిఖితా పోర్వాల్ స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని. ఈ ఏడాది జరిగే ప్రపంచ అందాల పోటీల్లో భారత్ తరుపున నిఖిత ప్రాతినిధ్యం వహించనున్నారు. దాద్రా నగర్ హవేలీకి చెందిన రేఖా పాండే మొదటి రన్నరప్‌గా, గుజరాత్‌కు చెందిన ఆయుషీ ధోలాకియా రెండో రన్నరప్‌గా నిలిచారు. గత ఏడాది విజేత నందిని గుప్తా నిఖితకు మిస్ ఇండియా కిరీటాన్ని అందించారు. ఈ సందర్భంగా నిఖితా పోర్వాల్ మాట్లాడుతూ "ఇప్పుడు నేను అనుభవిస్తున్న ఆనందాన్ని వర్ణించలేను. నా తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూసి గర్వంగా ఉంది. నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. సాధించవల్సిన విజయాలు చాలా ఉన్నాయి" అని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!

- సిఫారసు చేసిన సుప్రీం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తన వారసుడి పేరును ప్రకటించారు. తదుపరి చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన సిఫారసు చేశారు. వచ్చేనెల 10వ తేదీన జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం ముగియనుంది. దిగిపోయే ముందు సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయమూర్తి పేరును చీఫ్ జస్టిస్ పదవికి సిఫారసు చేయడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని అనుసరించి బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ప్రతిపాదిస్తూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ చంద్రచూడ్ లేఖ రాశారు. అనంతరం.. కేంద్ర న్యాయశాఖ ప్రధాన మంత్రి పరిశీలనకు పంపుతుంది. ప్రధాని ఆమోదం తర్వాత రాష్ట్రపతి సిఫారసుకు పంపుతారు. చివరిగా రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియ పూర్తవుతుంది. కేంద్ర ప్రభుత్వం స్థాయిలో లాంఛనాలు సజావుగా పూర్తయితే జస్టిస్ సంజీవ్ ఖన్నా సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబరు 11వ తేదీన బాధ్యతలు తీసుకుంటారు. ఆరు నెలలకు అటుఇటుగా, అంటే వచ్చే ఏడాది మే 13వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. జస్టిస్ చంద్రచూడ్ తర్వాత సీనియారిటీలో రెండోస్థానంలో ఉన్న ఆయన.. ప్రస్తుతం నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు తొమ్మిదిన సీజేఐగా జస్టిస్ ఎన్వీ రమణ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ఎవరీ ఖన్నా?

ఎమర్జెన్సీ కాలంలో గుర్తుండే అనేక తీర్పులు రాసిన సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా మేనల్లుడే జస్టిస్ సంజీవ్ ఖన్నా. రాజ్యాంగానికి ఎన్ని సవరణలు ప్రతిపాదించినా, దాని మౌలిక స్వరూపాన్ని మాత్రం మార్చడానికి వీల్లేదంటూ 1973లో కేశవానంద భారతీ కేసులో చరిత్రాత్మక తీర్పును ఇచ్చిన న్యాయమూర్తుల ధర్మాసనంలో ఆయన ఒకరు. ఎమర్జెన్సీ అమలులో ఉండగా, అన్ని హక్కులతోపాటు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ కూడా రద్దయి పోతాయంటూ.. ఏడీఎమ్ జబల్‌పూర్ కేసులో సుప్రీంకోర్టు 1976లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు రాసిన ధర్మాసనంలోని మెజారిటీ జడ్జీలతో విభేదించి, వేరుగా తీర్పు రాసిన ఒకే ఒక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా. దీంతో సీనియారిటీ రీత్యా చీఫ్‌జస్టిస్ కావాల్సిన ఆయనను, ఆ పదవి చేపట్టకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంది. దీనికి నిరసనగా ఆయన సర్వీసు ఉండగానే తన పదవికి రాజీనామా చేశారు. జస్టిస్ ఖన్నాకు అలా ఆనాడు చేజారిన ఆ పదవిని ఆయన బంధువు జస్టిస్ సంజీవ్ ఖన్నా త్వరలో చేపడుతుండటం విశేషం. ఆయన తండ్రి జస్టిస్ దేవ్‌రాజ్ ఖన్నా కూడా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించడం మరో విశేషం. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, తన మేనమామ జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా పనిచేసిన అదే కోర్టు గది నుంచి తన మొదటి రోజును జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రారంభించారు. ఆయన 1960 మే 14వ తేదీన జన్మించారు. ఢిల్లీలోని బరాఖంబా రోడ్‌లోని మోడరన్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తిచేశాడు. ఢిల్లీ యూనివర్సిటీలోని లా సెంటరు క్యాంపస్‌లో 1980లో చదువు పూర్తి చేసుకున్నారు. తన పేరును 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కాంప్లెక్స్ జిల్లా కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. అనంతరం ఢిల్లీ హైకోర్టు, ట్రైబ్యునల్స్‌లో రాజ్యాంగ, ప్రత్యక్ష పన్నులు, మధ్యవర్తిత్వం వంటి విభిన్న రంగాల్లో ప్రాక్టీస్ చేశారు. అలాగే.. కమర్షియల్ లా, కంపెనీ లా, ల్యాండ్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా వంటి రంగాల్లో ప్రాక్టీస్‌తో పాటు ఆదాయపు పన్ను శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. 2004లో ఢిల్లీ ప్రభుత్వంలో నేషనల్ కేపిటల్ టెర్రిటరీకి స్టాండింగ్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టులో అనేక క్రిమినల్ కేసుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, అమికస్ క్యూరీగా పనిచేశారు. 2005లో ఢిల్లీ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా నియమితులయి, ఏడాది తర్వాత శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2019 జనవరి 18న నియమితులయ్యారు.



ఈవీఎంలపై కీలక తీర్పు..

ఎన్నికల నిర్వహణకు వాడుతున్న ఈవీఎంలపై తలెత్తిన భయసందేహాలను తొలగిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా కీలక తీర్పును వెలువరించారు. 'ఈవీఎం యంత్రాలు చెల్లుతాయి. అవి భద్రమే'నని తేల్చి చెప్పారు. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించడం, బోగస్ ఓటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలు ఈవీఎంల రాకతో ఆగాయని అప్పట్లో ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల బాండ్ల అంశంపై తీర్పును ఇచ్చిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఒకరు. బాండ్ల జారీని రాజ్యాంగ విరుద్ధంగా అప్పట్లో బెంచ్ తేల్చేసింది. అలాగే, జమ్మూకశ్మీర్‌కు ఉద్దేశించిన అధికరణం 370ను రద్దు చేస్తూ 2019లో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు రాసిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ఉన్నారు. అయితే.. ధర్మాసనంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా మాత్రం తన తీర్పును సొంతంగా చెప్పారు. సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ కలిసి ఒక తీర్పు వెలువరించగా.. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా మరో రెండు తీర్పులను వెలువరించారు. జమ్మూకశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘనల అంశాన్ని జస్టిస్ సంజీవ్ ఖన్నా తన తీర్పులో ప్రస్తావించారు. ఢిల్లీ మద్యం పాలసీ వ్యవహారంలో అరెస్టు అయిన అప్పటి సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడానికి వీలుగా మధ్యంతర బెయిల్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా మంజూరు చేశారు.

లోకం తీరు



కాటేసిన కల్తీ మద్యం!

- బిహార్‌లో ఒక్కరోజే 20 మంది మృతి
- 4 రోజుల్లో మొత్తం 36 మరణాలు..
- మరో 40 మంది పరిస్థితి విషమం

పట్నా, అక్టోబరు 17: సంపూర్ణ మద్య నిషేధం అమల్లో ఉన్న బిహార్‌లో కల్తీ మద్యం రక్కసి మరోసారి కోరలు చాచింది.. గురువారం ఒక్కరోజే 20 మంది మరణించగా.. నాలుగు రోజుల్లో మొత్తం 36 మంది మృతి చెందారు. మరో 40 మంది పరిస్థితి విషమంగా ఉంది. వీరిలో కొందరు కంటి చూపు కూడా కోల్పోయారు. సివాన్, సారణ్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో కల్తీ మద్యం తాగిన కొందరు తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. వారిని కుటుంబ సభ్యులు సమీప ఆస్పత్రులకు తరలించగా.. పరిస్థితి విషమించి నాలుగు రోజుల్లో ఒక్కొక్కరుగా మొత్తం 36 మంది ప్రాణాలు విడిచారు. ఈ ఘటనపై డీజీపీ అలోక్ రాజ్ మాట్లాడుతూ.. కల్తీ మద్యం కారణంగా మొత్తం 25 మంది మరణించినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న 12 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు, కల్తీ మద్యం మరణాలపై సీఎం నీతీశ్ కుమార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందజేయడంతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సీఎంవో పేర్కొంది. కాగా, కల్తీ మద్యాన్ని అరికట్టడంలో బిహార్ సర్కారు విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. బిహార్ ప్రభుత్వాన్ని అవకాశవాద డబుల్ ఇంజన్ సర్కారుగా అభివర్ణించిన ఆయన.. మరణాలకు వారే బాధ్యులని ఆరోపించారు. 'కల్తీ మద్యం వల్ల 36 మంది మృతి చెందడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి.. దోషులను శిక్షించాలి' అని 'ఎక్స్'లో డిమాండ్ చేశారు.

ల్యాండింగ్‌కు గంట ముందు ముంబై- లండన్ ఫ్లైట్‌కు బాంబు బెదిరింపు

- రంగంలోకి ఇంగ్లండ్ వాయుసేన
- గురువారం తొమ్మిది విమానాలకు బెదిరింపులు
- తీవ్రంగా పరిగణిస్తున్నాం, కఠిన చర్యలు తీసుకుంటాం
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



ముంబై, అక్టోబరు 17: విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. బుధవారం ఏడు విమానాలకు బాంబు బెదిరింపులు రాగా గురువారం తొమ్మిది విమానాలకు బెదిరింపులు వచ్చాయి. ఇందులో ఐదు ఎయిరిండియా, రెండు విస్తారా, రెండు ఇండిగో విమానాలు ఉన్నాయి. ముఖ్యంగా ముంబై నుంచి లండన్ వెళ్లిన ఓ ఎయిరిండియా విమానం మరో గంటలో గమ్యస్థానాన్ని చేరుతుందనగా బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. లండన్ విమానాశ్రయాన్ని సమీపిస్తుండగా ఎయిరిండియా విమాన పైలట్.. ఏటీసీకి ఎమర్జెన్సీ సందేశం పంపారు. దీంతో విమానం కాసేపు గాల్లోనే చక్కర్లు కొట్టగా.. ఇంగ్లండ్ వాయుసేన రాయల్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన టైఫూన్ ఫైటర్ జెట్ రంగంలోకి దిగింది. సూపర్ సానిక్ వేగంతో ఎయిరిండియా విమానం దగ్గరకు చేరుకున్న ఆ ఫైటర్ జెట్ పరిస్థితిని సమీక్షించి ఎలాంటి ప్రమాదం లేదని గుర్తించింది. అనంతరం ఎయిరిండియా విమానానికి లండన్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు అనుమతినిచ్చారు. కాగా, విమానాలకు బాంబు బెదిరింపుల అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా నిబంధనల్లో మార్పులు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

ఎన్డీయే కూటమి వ్యతిరేక శక్తులను ఓడిద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

చర్చించినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. వాజపేయి హయాంలో కశ్మీర్‌లో జరిగిన ఎన్డీయే భేటీ తర్వాత మళ్లీ అలాంటి సమావేశం జరగడం ఇదే తొలిసారన్నారు. ఆర్థిక సంస్కరణల వల్ల పేదలకు లబ్ధి జరుగుతుందని, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఎన్డీయే ఆనాడే గుర్తించిందని, అదే అమలు అవుతోందని మోదీ పేర్కొన్నారు.

బాబు సూచన మేరకే...

హరియాణా ఎన్నికల్లో విజయం సాధించినందుకు మోదీని ఈ సమావేశంలో కూటమి నేతలు అభినందించారు. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎన్డీయే విజయానికి తోడ్పడాలని సమావేశం తీర్మానించింది. కాగా, హరియాణా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎన్డీయే సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు చేసిన సూచన మేరకే ఈ భేటీ జరిగినట్లు తెలిసింది. ఇందులో చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రధాని మోదీ పక్కనే ఆయనకు స్థానం కేటాయించారు. ఈ భేటీలో బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన 13 మంది ముఖ్యమంత్రులు, 16 మంది ఉప ముఖ్యమంత్రులతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బిహార్, సిక్కిం, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన ఎన్డీయే సీఎంలు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

ఇక 60 రోజులే .. రైలు టికెట్ బుకింగ్ గడువు కుదింపు

- 1 నుంచి కొత్త నిబంధన అమలులోకి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైలు టికెట్‌ను ముందుగానే బుక్ చేసుకునే గడువును 60 రోజులకు తగ్గిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. నవంబరు 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఈ బుకింగ్ సమయం 120 రోజుల వరకు ఉంది. రిజర్వేషన్ నాలుగు నెలల ముందు చేసుకునే కంటే రెండు నెలల ముందు చేసుకోవడం ప్రయాణికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. టికెట్ బుకింగ్‌కు 120 రోజుల వ్యవధి ఉండటం వల్ల ప్రయాణ ప్రణాళికలో మార్పులు జరిగి ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించామని రైల్వే అధికారులు తెలిపారు. వివిధ కారణాల వల్ల సగటున 21శాతం టికెట్లు రద్దవుతున్నాయని, మరో 4 నుంచి 5 శాతం ప్రయాణికులు రైలు ఎక్కేందుకు రావడం లేదని పేర్కొన్నారు. ఫలితంగా అక్రమ లావాదేవీలు, మోసపూరిత ఘటనలకు తావిచ్చినట్లు అవుతోందని తెలిపారు. 60 రోజుల రిజర్వేషన్ గడువు వల్ల ఈ తరహా సమస్యలను తగ్గించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. రిజర్వేషన్‌కు ఎక్కువ సమయం ఉండటం.. ప్రయాణించే ఉద్దేశం లేకున్నా వ్యక్తులు టికెట్ రిజర్వ్ చేసుకునేలా పురికొల్పుతోందని అన్నారు. తక్కువ వ్యవధి ఉండటం వల్ల టికెట్ల రద్దులు స్వల్పంగానే ఉంటాయని, దీంతో ప్రత్యేక రైళ్లను మరింత మెరుగ్గా ప్లాన్ చేసేందుకు వీలవుతుందని రైల్వే అధికారులు వెల్లడించారు.

తమన్నాను ప్రశ్నించిన ఈడీ

- గువాహటి ఈడీ కార్యాలయంలో వాంగ్మూలం నమోదు
- మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్ కేసులో సినీ తారలు
- బెట్టింగ్‌ల ద్వారా వచ్చిన డబ్బు హవాలా మార్గంలో విదేశాలకు..



గువాహటి, అక్టోబరు 17: మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం కేసులో నటి తమన్నా భాటియాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) అధికారులు ప్రశ్నించారు. తల్లితో కలిసి గువాహటి ఈడీ కార్యాలయానికి చేరుకున్న తమన్నాను ఈడీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.

17 మంది బాలీవుడ్ ముఖ్యులపై నిఘా

మహదేవ్ బెట్టింగ్ యాప్ ద్వారా వందల కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ యాప్ ద్వారా ఐపీఎల్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ మ్యాచ్‌లకు సంబంధించి బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వహించారు. సామాన్యులను ఆకర్షించేందుకు సినీతారలతో ప్రమోట్ చేయించారు. ఇందుకోసం నిర్వాహకులు భారీగా ఖర్చుపెట్టారు. నకిలీ పత్రాలతో వేల సిమ్‌లు, బ్యాంక్ ఖాతాలు తెరిచి బెట్టింగ్‌ల ద్వారా వచ్చిన డబ్బును హవాలా, క్రిప్టో మార్గాల్లో విదేశాలకు తరలించినట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 17 మంది బాలీవుడ్ ప్రముఖులపై 2023 సెప్టెంబర్ నుంచి అధికారుల నిఘా కొనసాగుతోంది. ఈ కేసులో నటుడు సాహిల్ ఖాన్‌ను అరెస్ట్ చేసింది.

కెనడాలో ఇదీ భారతీయం

అక్కడ ప్రవాసులది ప్రధాన పాత్ర
పలు రంగాల్లో బలమైన ప్రభావం

(సెంట్రల్ డెస్క్)

వైశాల్యం పరంగా ప్రపంచంలో రెండో అతిపెద్ద దేశం కెనడా.. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్..! ఖలిస్థానీ మద్దతుదారు నిజ్జర్ హత్య నేపథ్యంలో ప్రస్తుతం ఈ రెండింటి మధ్య తీవ్ర స్థాయి దౌత్య యుద్ధం జరుగుతోంది. అయితే, దీన్ని పక్కనపెడితే కెనడాలో భారతీయులది బలమైన సమాజం. పలు రంగాల్లో మనవారు స్థిరపడ్డారు. ఆ వివరాలు గణాంకాల్లో..

27% — కెనడాలోని శాశ్వత నివాసితుల్లో భారతీయులు. కెనడా పీఆర్ స్కీంలో మనవారే ప్రధాన లబ్ధిదారులు.

22% — గత ఏడాది కెనడా వెళ్లిన తాత్కాలిక విదేశీ కార్మికుల్లో భారతీయులు. రెండో అత్యధికం వీరే.

45% — విదేశీ విద్యార్థుల్లో భారతీయులు. మరే దేశం నుంచి ఈ స్థాయిలో విద్యార్థులు లేరు.

28 లక్షలు: కెనడాలోని భారతీయులు. వీరిలో ప్రవాసులు, భారత సంతతివారూ ఉన్నారు. ప్రపంచంలో భారతీయులు అధికంగా ఉన్న నాలుగో దేశం. ఇందులో 18 లక్షలు భారత సంతతివారు. 10 లక్షల మంది ప్రవాసులు.

8.30 లక్షలు: కెనడాలోని హిందువులు. 7.70 లక్షలు: సిక్కులు

6: వాంకోవర్, టొరంటో, మాంట్రియల్, విన్నీ పెగ్, ఒట్టావా (ఒంటారియో), కాల్గరి (అల్బెర్టా). ప్రవాసులు అధికంగా నివసించే ప్రాంతాలు.



- 20 ఏళ్లలో కెనడాలో భారతీయుల సంఖ్య రెట్టింపును మించింది.
- 1980 వరకు భారత్‌లో పుట్టి కెనడా వెళ్లినవారు 63,535. 1991-2000 మధ్యన ఈ సంఖ్య 1.45 లక్షలు. 2006-10 నడుమ 1.19 లక్షలు. 2016-21 మధ్య 2.46 లక్షలు.
- **ఐదేళ్లలో డబుల్:** 2019లో కెనడాలోని భారతీయ విద్యార్థుల సంఖ్య 2.18 లక్షలు కాగా, ప్రస్తుతం 4.27 లక్షలు.
- **పౌరసత్వంలో పైపైకి..:** కెనడా పౌరులుగా మారుతున్న భారతీయుల సంఖ్య ఏటా భారీగా పెరుగుతోంది. ఈ శాతం 2017లో 44.3 కాగా.. 2021లో 61.1 శాతం.
- అక్కడ మన వారి జాబ్ ప్రొఫైల్ కూడా బాగుంటోంది. మెరుగు పడుతోంది కూడా. ప్రవాసుల్లో 50 శాతం మంది డిగ్రీ హోదాతో కూడిన ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తమ్మీద కార్యనిర్వాహక (మేనేజీరియల్) పోస్టుల్లో 10 శాతం లోపే ఉన్నారు. అయితే, ఇటీవల వెళ్లినవారిలో 19శాతం మంది ఈ పోస్టులు పొందారు.
- భారత్‌కు పప్పు ధాన్యాలు అత్యధికంగా ఎగుమతి చేస్తున్న దేశం కెనడా.
- భారత్ నుంచి బంగారు ఆభరణాలు, విలువైన వజ్రాలు, ఫార్మా ఉత్పత్తులు, రెడీమేడ్ దుస్తులు అధికంగా కెనడాకు ఎగుమతి అవుతుంటాయి.
- **600 పైనే:** భారత్‌లో ఉన్న కెనడాకు చెందిన కంపెనీలు. వీటిలో టిమ్ హర్టన్స్ కాఫీ చైన్, శీతల ఆహార పదార్థాల సంస్థ మెక్ కెయిన్ కూడా ఉన్నాయి. 75 బిలియన్ అమెరికా డాలర్లకు పైగా కెనడియన్ పింఛను నిధులను భారత్‌లో పెట్టుబడులు పెట్టారు.

చేప పిల్లల పంపిణీ పేరిట నిధుల గోల్‌మాల్

- బీఆర్‌ఎస్ హయాంలో కోట్లు కొట్టేసిన హరీశ్, తలసాని
- ఫిషర్మన్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్ ఆరోపణ

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చేపపిల్లల పంపిణీ పేరిట బీఆర్ఎస్ పాలనలో మంత్రులుగా పనిచేసిన తలసాని, హరీశ్‌రావు మత్స్యశాఖలో కోట్లాది నిధులు కొట్టేశారని రాష్ట్ర ఫిషర్మన్ కార్పొరేషన్ చైర్మన్ మొట్టు సాయికుమార్ ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో సాయికుమార్ విలేకరులతో మాట్లాడుతూ, చేపల పంపిణీ వ్యవహారంలో ముదిరాజ్‌లు, బెస్తల మధ్య పంచాయతీ పెట్టి పబ్బం గడిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో జరిగిన దోపిడీపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని తెలిపారు. సిద్దిపేట, మల్లన్న సాగర్‌లో హరీశ్‌రావు ఎన్ని చేపలు వేశారో చెప్పాలని, ఈ విషయంలో తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. రొయ్యపిల్లల పంపిణీలోనూ తలసాని, హరీశ్‌రావు దోచుకున్నారని, విచారణ తర్వాత ఈ ఇద్దరూ జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ కార్యాలయాల్లా పోలీస్ స్టేషన్లు

- ఎమ్మెల్సీ మధుసూదనాచారి

పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ మండలి పక్ష నేత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తమ్ముడు శ్రీకాంత్ గౌడ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. జిల్లాలో ఒకరిద్దరి ప్రయోజనాల కోసం అక్రమ కేసులు బనాయించి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

సీఎస్ శాంతికుమారి.. 31,383 మంది అభ్యర్థులు.. 46 పరీక్షా కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. ఆమె గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీసు కమీషనర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాల యం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ ఎండీ ము ష్రాఫ్ అలీ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు పాల్గొన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరవుతుండగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరీక్షల్లో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ అంశంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించేది లేదని నికోలస్ స్పష్టం చేశారు. దివ్యాంగులకు గంట అదనంగా కేటాయిస్తామన్నారు.



గాంధీనగర్‌లో ఆందోళన చేస్తున్న గ్రూప్ 1 అభ్యర్థులు

వందలాది మంది అభ్యర్థుల ఆందోళన

గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసి, జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాదిమంది అభ్యర్థులు గాంధీనగర్ కెనరా బ్యాంక్ పార్కులో ఆందోళన చేపట్టారు. ప్రిలిమ్స్‌లో రిజర్వేషన్లు పాటించాలని సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ఉన్నా పాటించలేదని, వెంటనే రిజర్వేషన్లు పాటించాలని డిమాండ్ చేశారు. పోలీసులు 20 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ అశోక్‌నగర్ చౌరస్తాలో అభ్యర్థులు గురువారం రాత్రి మెరుపు ధర్నా నిర్వహించారు.

హైకోర్టులో అప్పీలు

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష తుది కీలో తప్పులు ఉన్నాయని, అందువల్ల ఆ పరీక్షను రద్దు చేసి మెయిన్స్ పరీక్ష నిర్వహించకుండా అడ్డుకోవాలని కోరుతూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో గురువారం అప్పీలు దాఖలైంది. ఫైనల్ కీలో తప్పులు ఉండటంతోపాటు వివిధ కారణాలతో ప్రాథమిక పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సింగిల్ జడ్జి ధర్మాసనం మంగళవారం కొట్టేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ వికారాబాద్ జిల్లా పరిగి మండలం నస్కల్‌కు చెందిన గంగుల దామోదర్ రెడ్డి సహా ఐదుగురు అభ్యర్థులు అప్పీలు దాఖలు చేశారు. ఈ అప్పీలు శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

- మహేష్‌కుమార్ గౌడ్ హామీ

గ్రూప్-1 అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. అభ్యర్థులు గాంధీభవన్‌లో ఆయనతో భేటీ అయ్యారు.


నిర్మానుష్యంగా మారిన శెట్టిపాలెం ప్రధాన వీధి

కీడుసోకిందని.. ఊరు విడిచి..

- వన భోజనాలకు వెళ్లిన నల్లగొండ జిల్లా శెట్టిపాలెం వాసులు
- వరుస మరణాలతో గ్రామపెద్దల నిర్ణయం

వేములపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి కీడు సోకిందని.. అది తొలగిపోయేందుకు నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామస్థులు గురువారం ఊరు విడిచి వనభోజనాలకు వెళ్లారు. ఊరిలో 1,250 కుటుంబాలు ఉండగా సుమారు 5,500 మంది నివాసముంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి పలు కారణాలతో 76 మంది మృతి చెందగా.. గత రెండు నెలల్లోనే 20 మందికి పైగా చనిపోయారు. శ్రావణమాసం సందర్భంగా ఊరిలో వనభోజనాలు నిర్వహించినప్పటికీ గ్రామస్థులంతా ఇందులో పూర్తిస్థాయిలో పాల్గొనలేదని.. దీంతో మరోసారి ఊరు వదిలి వన భోజనాలకు వెళ్లాలని గ్రామంలో చాటింపు వేయించారు. గ్రామపెద్దల నిర్ణయం మేరకు గ్రామస్థులు ఉదయం ఇంటి ముందు కల్లాపి చల్లలేదు. ఇళ్లలో పొయ్యి వెలిగించలేదు. ఇంట్లో పొయ్యి వెలిగిస్తే ఇంటికి కీడు జరుగుతుందని భావించిన గ్రామస్థులు... ఊరు పొలిమేరల్లో ఏర్పాటు చేసిన నిప్పును రూ.10 నుంచి రూ.50 వరకు చెల్లించి కొన్నారు. సూర్యోదయం అవుతుండగానే ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లపై ఊరు విడిచి కుటుంబసభ్యులతో కలిసి పొలం గట్ల వద్దకు వెళ్లారు. అక్కడే సామూహిక వన భోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో తమ గ్రామానికి పట్టిన కీడు తొలగిపోతుందని గ్రామస్థులు భావిస్తున్నారు. సూర్యాస్తమయానికి ఇంటికి చేరుకున్నారు. అందరూ ఊరిని విడిచి వెళ్లడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి.

అప్పులు తీర్చలేక కౌలు రైతు ఆత్మహత్య

- వరంగల్ జిల్లా కొత్తపెల్లిలో ఘటన


రాజబాబు గౌడ్

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడం, అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కొత్తపెల్లిలో బుధవారం రాత్రి జరిగింది. పోశాల రాజబాబు గౌడ్(45) తాటి కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, కుటుంబాన్ని పోషించేందుకు కుల వృత్తి సంపాదన సరిపోకపోవడంతో పదేళ్లుగా మూడెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని అప్పులు తెచ్చి సాగు చేస్తున్నాడు. ఈ తరుణంలో గత కొన్ని సంవత్సరాలుగా పంటలు చేతికందకపోవడం, పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఆర్థికంగా చితికిపోయి, అప్పులు కావడంతో వడ్డీలు చెల్లించలేక ఈ నెల 16న రాత్రి పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పోలీసులే లక్ష్యంగా
మందుపాతర పేల్చివేత

- చర్ల మండలం చెన్నాపురం వద్ద రహదారిపై మావోయిస్టుల దుశ్చర్య
- త్రుటిలో తప్పించుకున్న పోలీసు బృందం

చర్ల, అక్టోబరు17: పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చెన్నాపురం రహదారిపై గురువారం మందుపాతర పేల్చారు. ఈ పేలుడు నుంచి చర్ల సీఐ రాజువర్మ ఆధ్వర్యంలోని పది మంది పోలీసుల బృందం త్రుటిలో తప్పించుకోగా.. వారిలో ఓ కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సీఐ రాజు వర్మ బృందం గురువారం ఉదయం చెన్నాపురం అడవుల్లో కూంబింగ్ వెళ్లి తిరిగి వస్తుండగా గోరుకొండ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ముందస్తు పథకం ప్రకారం మందుపాతరలు అమర్చిన మావోయిస్టులు పోలీసుల రాక గమనించి వాటిని పేల్చినట్టు తెలుస్తోంది. పేలుడు ధాటికి పోలీసు బృందంలోని స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ సతీష్‌కు స్వల్పగాయమైంది. అప్రమత్తమైన పోలీసు బృందం ఘటనాస్థలి నుంచి వెనుదిరిగి చెన్నాపురం బేస్ క్యాంపునకు చేరుకుంది. గాయపడ్డ కానిస్టేబుల్ ఓ వాహనంపై చెలిమెల సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపునకు చేరుకుని బలగాలకు సమాచారం అందించాడు. పోలీసులు అప్రమత్తంగా లేకపోతే ఈపేలుడు వల్ల ఊహించని నష్టం జరిగేది. మందుపాతర పేలుడు సంగతి తెలిసి తేగ్గాడెం సీఆర్పీఎఫ్ 151బెటాలియన్ బేస్‌క్యాంపు బలగాలు అప్రమత్తమయ్యాయి. అడవిలోకి వెళ్లి ముమ్మర గాలింపు చేపట్టాయి. డ్రోన్ల సాయంతో మావోయిస్టుల కోసం అన్వేషించాయి. ఘటనా స్థలి నుంచి మావోయిస్టులు వెళ్లిపోయారని తెలుసుకున్న తర్వాత సీఐ బృందం కాలినడకన చర్ల చేరుకుంది. మరోపక్క, భారీ పేలుడుతో తిప్పాపురం, గోరుకొండ గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. కాగా, పోలీసుల రాకను గమనించి మావోయిస్టులు మందుపాతర పేల్చడం ఇదే తొలిసారి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పెద్దమడిసిలేరు రోడ్డుపై మావోయిస్టులు రెండు భారీ మందుపాతర్లు అమర్చి పోలీసుల వాహనాలు పేల్చేందుకు పథకం వేశారు. కానీ, గుర్తించిన పోలీసులు పోలింగ్ రోజే పేల్చివేశారు.

మావోయిస్టు అగ్రనేత
సుజాతక్క అరెస్టు?

- 43 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న వైనం
- వైద్యం కోసం బయటకు, అదుపులోకి తీసుకున్న ఎస్ఐబీ
- నోరు విప్పని పోలీసులు, ప్రకటన చెయ్యని మావోయిస్టులు



సుజాతక్క (ఫైల్), సుజాతక్కగా ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫొటో

గట్టు, చర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాతక్క ప్రస్తుతం ఎక్కడ ఉన్నారనే అంశం మిస్టరీగా మారింది. సుజాతక్కను రెండు రోజుల క్రితం తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. 43 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న సుజాతక్క అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారని అంటున్నారు. దీనిపై అటు పోలీసులు ఇటు మావోయిస్టుల నుంచి ఎలాంటి ప్రకటన లేదు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడుకు చెందిన పటేల్ తిమ్మారెడ్డి, వెంకమ్మల రెండో సంతానమైన పద్మ అలియాస్ కల్పన, సుజాత, మైనా.. చదువుకునే రోజుల్లోనే మావోయిస్టు భావజాలంతో పనిచేస్తున్న పటేల్ సుధాకర్‌రెడ్డి ప్రభావంతో అడవిబాట పట్టారు. తెల్కపల్లి దళంలో సభ్యురాలిగా చేరి.. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యురాలిగా సౌత్ బస్తర్ కేంద్రంగా పని చేస్తున్నారు. మావోయిస్టులు ఆమెను పెద్ద దిక్కుగా భావిస్తారు. నేటికీ ఆమె అడుగు జాడల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. సుజాత ఉద్యమంలో ఉన్నప్పుడే మావోయిస్టు అగ్రనేత మల్లోజుల కోటేశ్వర్‌రావును 1987లో వివాహం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ జార్‌గ్రామ్‌లోని బురిషోల్‌లో 2011లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కిషన్‌జీ మరణించారు. అప్పట్నించి పోలీసులు సుజాత కోసం గాలిస్తున్నారు. ఆమెపై ప్రభుత్వం రూ.కోటి రివార్డు కూడా ప్రకటించింది. సుజాత వయస్సు ప్రస్తుత 67 ఏళ్లు కాగా కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసింది. ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉండగా, ఆమెకు వైద్యం చేయించేందుకు దండకారణ్యం నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా భద్రాద్రి జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అనారోగ్యంతో ఆమే లొంగిపోయారని ప్రచారం కూడా జరుగుతోంది. ఆమె లొంగుబాటుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఐగా పని చేస్తున్న ఓ పోలీసు అధికారి కీలకపాత్ర పోషించారని అంటున్నారు. పోలీసులు లేదా మావోయిస్టులు స్పందిస్తే కానీ సుజాతక్క అంశంపై స్పష్టత రాదు.

జల విద్యుత్‌పై జెన్‌కో నిర్లక్ష్యం

- ఏడాదిగా టర్బైన్ మరమ్మతుల కోసం ఎదురుచూపు
- ఎట్టకేలకు నేడు సాగర్‌కు జపాన్ నిపుణుల రాక

నాగార్జునసాగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నా నాగార్జునసాగర్‌లో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయలేకపోతున్నారు. సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో 2వ నంబరు టర్బైన్ మరమ్మతులకు గురై ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు పట్టించుకోలేదు. 1వ టర్బైన్ సామర్థ్యం 110 మెగావాట్లు కాగా 100.8 మెగావాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన మరో 7 టర్బైన్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు 815.6 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. 1వ నంబరు టర్బైన్ బీహెచ్ఈఎల్ (ఇండియా) నుంచి, మిగిలిన ఏడూ జపాన్ నుంచి తెప్పించి ఏర్పాటు చేశారు. 2వ నంబర్ టర్బైన్ రోటర్ స్పైడర్ గత ఏడాది నవంబరు 10న పాడైంది. ఇప్పటివరకు జెన్‌కో అధికారులు మరమ్మతులు పూర్తి చేయలేదు. దీంతో ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం లేకుండా పోయిందని నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి సరిపడా వరద రాకపోవడంతో లక్ష్యం 1400 మిలియన్ యూనిట్లకు కేవలం 540 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది భారీ వరద వచ్చి సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయికి చేరుకుంది. ఆగస్టు 5 నుంచి క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కానీ విద్యుత్ ఉత్పత్తికి వాడుకునే అవకాశం లేకుండాపోయింది. దీంతో లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రం పాలవుతోంది. 2వ నంబర్ టర్బైన్ మరమ్మతులు చేయడానికి జపాన్ నుంచి నిపుణులు శుక్రవారం వస్తున్నారని జెన్‌కో ఎస్ఈ రఘురాం తెలిపారు. నిపుణుల రాక కోసమే మరమ్మతులు ఆలస్యమయ్యాయని, మరమ్మతులకు సుమారు రెండు నెలలు పడుతుందని తెలిపారు.


ఏడాదిగా మరమ్మతులకు నోచుకోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జల విద్యుత్ కేంద్రంలోని 2వ నెంబర్ టర్బైన్

ఒకే రోజు ఐఏఎఫ్, ఆర్మీ దంపతుల బలవన్మరణం

- ఆగ్రాలో భర్త, ఢిల్లీలో భార్య ఆత్మహత్య
- భర్త మృతదేహంతోపాటే నా దహనసంస్కారాలు చేయండి
- సూసైడ్ నోట్‌లో భార్య కోరిక



న్యూఢిల్లీ, అక్టోబరు 17: ఆ దంపతులిద్దరూ భారత సాయుధ దళాల్లో పని చేస్తున్నారు. భర్త ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్)లో ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా, భార్య ఆర్మీలో కెప్టెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కారణం ఏమై ఉంటోందోగానీ వీరిద్దరూ ఒకే రోజు వేర్వేరు చోట్ల ఆత్మహత్యకు పాల్పటంతో విషాదచాయలు అలుముకున్నాయి. ప్రేమ వివాహం చేసుకున్న వీరు మంగళవారం ఇలా తనువు చాలించడం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. దీన్ దయాళ్ దీప్ (32) ఆగ్రాలోని ఖేరియా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఐఏఎఫ్ ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా.. ఆయన భార్య కెప్టెన్ రేణు తన్వర్ అదే నగరంలో మిలటరీ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఆగ్రాలో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోని తన నివాస క్వార్టర్స్‌లో దీప్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా.. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో తన్వర్ బలవన్మరణం చెందారు. తన్వర్ తన తల్లి, సోదరుడితో కలిసి వైద్యం కోసం సోమవారం ఢిల్లీ వెళ్లారు. తన్వర్ ఆత్మహత్య గురించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం వద్ద సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే దీప్ నివాస క్వార్టర్స్‌లో మాత్రం ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు. తన భర్త మృతదేహంతోపాటే తన దహన సంస్కారాలు నిర్వహించాలని తన్వర్ తన సూసైడ్ నోట్‌లో కోరారు. తన్వర్ ఆత్మహత్య చేసుకున్నప్పుడు ఆమె తల్లి, సోదరుడు ఎయిమ్స్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. కాగా రాత్రి భోజనం చేసేటప్పుడు దీప్ తన సహోద్యోగులతో సరదాగానే కబుర్లు చెప్పారని, ఆయనలో ఎలాంటి ఒత్తిడి లేదా ఆందోళన కనిపించలేదని అధికారులు పోలీసులకు తెలిపారు. తర్వాత తన క్వార్టర్స్‌కు దీప్ వెళ్లాడని, ఉదయం ఆయన ఎంతకూ లేవకపోవడంతో అనుమానంతో తలుపులు పగలగొట్టి చూసే సరికి ఉరికి వేలాడుతున్నట్టు గుర్తించినట్టు చెప్పారు. ఆయన మృతి పట్ల పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆకలి.. అవమానం!

ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశం స్థానం కాస్తంత మెరుగుపడినందుకు సంతోషించాలో, పరిమాణంలోనూ, ఆర్థికంగానూ చిన్నవైన పొరుగుదేశాలతో పోల్చితే బాగా వెనుకబడి ఉన్నందుకు బాధపడాలో తెలియడం లేదు. శ్రీలంక, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్‌లు ఈ సూచీలో భారత్‌కంటే మెరుగ్గా ఉన్నాయి. 127దేశాల జాబితాలో భారత్ ప్రస్తుతం 105వ స్థానంలో ఉంది. గత ఏడాది 125దేశాల్లో 111వస్థానంలో, అంతకుముందు 107లోనూ ఉన్నందున ప్రస్తుతానికి స్థానం కాస్తంత మెరుగుపడినట్టే. కానీ, తీవ్రమైన ఆకలిబాధ చవిచూస్తున్న దేశంగా ముద్రపడటం అవమానకరం. పదేళ్ళలో దేశం అద్భుతంగా అభివృద్ధి చెందిందనీ, జీడీపీ హెచ్చిందనీ, అతిపెద్ద ఆర్థికవ్యవస్థ పరుగుపందెంలో ముందంజలో ఉన్నదని ప్రచారం చేసుకుంటున్న మన పాలకులను ఇటువంటి నివేదికలు కచ్చితంగా కలవరపెడతాయి. వాటిని విదేశీకుట్రగా ముద్రవేయడం, తప్పులతడక అంటూ తీసిపారేయడం వారికి ఎంతో సులువు.

ఆకలిబాధ ఆందోళనకర స్థాయిలో ఉన్న దేశాల్లో మనది కూడా ఒకటి. మరోలా చెప్పుకోవాలంటే, ఆ లెక్కన పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల సరసన భారత్ నిలిచింది. పోషకాహారలోపం, శిశుమరణాలు ఇత్యాది ప్రాతిపదికలమీద ఆకలిబాధను లెక్కగట్టే ఈ నివేదిక భారత్‌లో ఉన్న తీవ్రమైన పరిస్థితులను లోతుగా ప్రస్తావించింది. దాదాపు 14శాతం మంది పోషకాహారలోపాన్ని ఎదుర్కొంటున్నారు, ఐదేళ్ళలోపు పిల్లల్లో మూడోవంతుకంటే ఎక్కువమంది వయసుకు తగ్గ ఎత్తు ఎదగలేదు, సుమారు 19శాతం మంది ఎత్తుకు తగ్గబరువు లేరు. ఐదేళ్ళు నిండకుండానే కన్నుమూస్తున్న పిల్లల మూడుశాతం వరకూ ఉన్నారు. నాలుగు కీలకమైన అంశాలను తీసుకొని, పోషకాహారలోపం, శిశుమరణాలకు మూడోవంతు విలువ, మిగతా రెండింటికీ ఆరోవంతు విలువ ఇస్తూ మొత్తం స్కోరు లెక్కగట్టే ప్రక్రియలో భారత్ 27.3 పాయింట్లు దక్కించుకుంది. పోషకాహారం మాట పక్కనబెడితే, ఆహారం అందుబాటులో ఉండటమన్నది కూడా ఒక సమస్య అని ఈ నివేదిక తెలియచెబుతోంది. ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయి అప్పులకోసం వెంపర్లాడుతున్న శ్రీలంక, రాజకీయ సంక్షోభంలో మునిగిన బంగ్లాదేశ్, నలుదిక్కులా పోరాటాలతో, అంతర్యుద్ధంతో తీసుకుంటున్న మయన్మార్ వంటి దేశాలు మనకంటే ఎంతో మెరుగైన స్థానంలో ఎలా నిలవగలిగాయన్నది అసలు ప్రశ్న. పౌష్టికాహారలోపం ఎదుర్కొంటున్న ప్రజల సంఖ్య ప్రపంచస్థాయిలో కూడా పెరుగుతున్నదని, యుద్ధాలు, అంతర్యుద్ధాలు, వలసలు, వాతావరణ మార్పులు వంటివి ప్రపంచ ఆకలిసూచీ స్కోరును పెంచేస్తున్నాయని ఈ నివేదిక అంటోంది.

గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌ను భారతదేశ పాలకులు ఒప్పుకోకపోవడం కొత్తేమీ కాదు. లోపభూయిష్టమైన పద్ధతుల్లో, విధానాల్లో ఈ లెక్కలు కడుతున్నారని, కొద్దిమందిని నమూనాగా తీసుకొని, ఆకలిని దేశవ్యాప్తంగా వర్తింపచేస్తున్నారని మన ప్రభుత్వం వాదన. ఈ నివేదికలో దేశాలన్నింటికీ వర్తించిన కొలమానాలే తప్ప మనకు వేరు లెక్కలంటూ ఏమీ ఉండవు. పైగా, నివేదిక తయారీలో వాడిన వివరాలు, గణాంకాలన్నీ ప్రపంచ ఆరోగ్యసంస్థ, యునిసెఫ్ తదితర ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల నుంచి సేకరించినవో, అవి ప్రచురించిన నివేదికలనుంచి తీసుకున్నవో అవుతాయి. గత నివేదికలను ప్రభుత్వం తిరస్కరించినప్పుడు కూడా భారత ప్రభుత్వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల వంటివి ఈ చేదునిజాలను ముందే చెప్పిన విషయాన్ని విపక్షాలు, మీడియా గుర్తుచేశాయి కూడా.

గత కొన్ని దశాబ్దాలుగా భారత్ స్కోరు మెరుగుపడినప్పటికీ, దేశంలో ఇంకా ఆకలికేకలు తగ్గలేదని ఈ సూచీ చెబుతున్నది. అంతర్జాతీయ సమాజం ముందు తలవంపులు తెచ్చే ఇటువంటి నివేదికలను తిరస్కరించడానికే పాలకులు ఉత్సాహపడటం సహజం. ఒప్పుకోనంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగే సర్వేలు, వివిధ ప్రభుత్వశాఖలు సేకరించే గణాంకాలమీద ఇటీవలి కాలంలో పాలకులకు అయిష్టత పెరుగుతూ, వాటిని పూర్తిగా నిర్వహించకపోవడమో, వాయిదా వేయడమో, సర్వేలు చేపట్టినా వివరాలు బహిర్గతపరచకపోవడమో జరుగుతోంది. కానీ, ప్రజలకు ఆహారాన్ని అందించే విషయంలో ఎంతో శ్రద్ధపెడుతున్నామంటున్నవారు, ఆశించిన లక్ష్యం నెరవేరుతున్నదీ లేనిదీ తెలుసుకోక తప్పదు. జాతీయ ఆహారభద్రతాచట్టం, ప్రధానమంత్రి అన్న యోజన, మాతృవందన, పోషణ్ వంటి అనేకానేక పథకాలతో ఆకలిని ఉపశమింపచేసి, పలు కార్యక్రమాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నామన్న ప్రభుత్వం వాదనను ఆకలిసూచీలో మన స్థానం సవాలు చేస్తున్న మాట నిజం.

అవును, ఉద్యమాలు అంతరించిపోకూడదు!

ప్రభుత్వాలకు, నిర్బంధంతో ఉద్యమాలని నిర్మూలించడం సాధ్యం కాదనే విషయాన్ని, కె. శ్రీనివాస్ రాసిన 'సందర్భం', బలమైన తర్కంతో, ఉత్తమ సహృదయంతో, శక్తివంతమైన శైలిలో, అనేక కోణాల్లో, వుంది! (ఆంధ్రజ్యోతి, అక్టోబరు 10). మావోయిస్టులు కూడా 'వివేచన'తో, '(స్వయం) విమర్శ'తో సమీక్షించుకుంటే తప్ప, 'ఉనికి సాధ్యం కాదని' చేసిన సూచన కూడా సరైనదే. అయితే, ఒక చిన్న వివరణ అవసరం: 'సందర్భం'లో ప్రస్తావించిన ఇతర ఉద్యమాలు– కాశ్మీరు, శ్రీలంక, నాగాలాండ్, మణిపూర్, ఖలిస్తాన్ వంటివి– శ్రామిక వర్గపోరాట ఉద్యమాలు కావు. వారు కోరుకునే పాలనలో, లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ వంటి 'దోపిడీ ఆదాయాలు' సురక్షితంగా వుండేవే! అవి అలా ఉండాలనే! కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అనుసరించే ఉద్యమం అలాంటి తప్పుడు ఆదాయాలకి వ్యతిరేకం! మిగతా ఉద్యమాలు 'శ్రమ దోపిడీ'కి వ్యతిరేకం కానివి.

ఈ 'సందర్భం' చదవగానే, ఇదే సమస్య మీద కొన్ని విషయాలు రాయాలనిపించింది నాకు. నిజానికి ఇక్కడ రాయబోయే విషయాలు కొత్తవేమీ కాదు. 2000 సంవత్సరంలో, పీపుల్స్‌వార్ పార్టీ వారు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలన్నప్పుడూ, 2005లో 'మళ్ళీ చర్చ'లన్నప్పుడూ, ఆ తర్వాత ఎన్నో ఎన్‌కౌంటర్లు జరిగినప్పుడూ, నేను రాసిన కొన్ని వ్యాసాల్లో చెప్పినవే, ఇప్పుడు చెప్పబోయేవి! అసలు, అవి ఆనాడు నా స్వంతం కాదు సుమా! శ్రామిక ఉద్యమాల విషయాలలో, కమ్యూనిస్టులు ఏ రకపు అవగాహనతో వుండాలో, మార్క్సు-ఎంగెల్సులు చెప్పిన సూచనలనే, నేను తెలుసుకున్న వాటిని, గుర్తు చేశాను. ఇప్పుడు, దండకారణ్యంలోని మావోయిస్టులు గానీ, మైదాన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇతర కమ్యూనిస్టు గ్రూపుల వారు గానీ, ఆలోచించవలసిన సూచనలు కొన్ని వున్నాయి:



శ్రామిక వర్గ ఉద్యమకారుల్ని 'అస్త్ర సన్యాసం' చెయ్యమని కె. శ్రీనివాస్ చెప్పడం లేదు. ఉద్యమాలు నడపవలిసిందే! కార్మిక వర్గం, సంస్థాపరంగా పురోగమించి వుండకపోతే, పాలకవర్గాల రాజకీయ అధికారానికి వ్యతిరేకంగా కార్మికులలో నిరంతరం ప్రచారం చేస్తూ, వారికి శిక్షణ ఇచ్చితీరాలనీ, లేకపోతే, వారు పాలకవర్గాల చేతిలో ఆటవస్తువులుగా మారతారని, గతంలో, కార్మిక వర్గ నాయకులకు మార్క్సు చేసిన సూచనను ఏ క్షణమూ మరిచిపోకూడదు!

(1) 1871లో, 'పారిస్ కమ్యూన్' పోరాటాన్ని, అక్కడి పాలకవర్గాలు రక్తపుటేరుల్లో ముంచినప్పుడు, మార్క్సు ఒక విషయం చెపుతాడు. 'వర్గ పోరాటంలో, శ్రామికవర్గం వివిధ దశల గుండా నడవాలనీ', 'మరల మరల ఎదురు దెబ్బలూ, అడ్డంకులూ కలుగుతాయనీ'– అంటాడు. కాబట్టి, శ్రామిక వర్గపు ప్రతినిధులుగా కమ్యూనిస్టులు కూడా, ఎంతటి క్రూర నిర్బంధాలు వున్నా నిలబడ్డారు, నిలబడతారు! (2) 'సోషలిజం అనేది ఒక సైన్స్' అయిందనీ, దానిని సైన్స్‌గా అధ్యయనం చేసి, కార్మిక జనాలలో వ్యాపింపజేయడం నాయకుల కర్తవ్యం అనీ, ఎంగెల్సు తన కాలపు కమ్యూనిస్టులకు చేసిన సూచన నించీ ఇప్పటి కమ్యూనిస్టులు నేర్చుకోవాలి! వాళ్ళు నేర్చుకుంటేనే, దానిని, వర్గచైతన్యం లేని శ్రామిక జనాలకు నేర్పగలరు. మార్క్సు ఒక చోట చెప్పినట్టు, 'నేర్పేవాడు తప్పనిసరిగా నేర్చుకు తీరాలి'. ('ఎడ్యుకేటర్ మస్ట్ బి ఎడ్యుకేటెడ్'). 'కాపిటల్' వంటి శ్రామికవర్గ సిద్ధాంత రచనను, అన్ని భాషలలోకీ అనువదించి వ్యాప్తి చెయ్యాలని, ఆనాటి 'అంతర్జాతీయ కార్మిక సంస్థ' చేసిన తీర్మానాన్ని గుర్తు చేసుకోవాలి. ఎందుకంటే, సిద్ధాంతం అనేది, జనాలకు అర్థమైతే, అది ఒక భౌతిక శక్తిగా మారుతుందంటాడు మార్క్సు.

(3) వర్గ చైతన్యం లేని శ్రామిక జనాలకు, అతి కొద్దిమంది చైతన్యవంతులైన వారు మాత్రమే నాయకత్వం వహించి విప్లవ పోరాటాలు చేసే కాలం గతించిందనీ, శ్రామిక జనాలు తమంతట తాము వర్గపోరాటాలలో వుండితీరాలనీ, తన కాలపు 'అరాచకవాద' ఉద్యమకారులను ఉద్దేశించి, ఎంగెల్సు చెప్పిన మాటలు తమకు ఎంత వరకూ వర్తిస్తాయో ఉద్యమాలలో వున్న కమ్యూనిస్టులు స్వయం విమర్శ చేసుకోవాలి. (4) దళాలు చేసే ఆకస్మిక దాడుల్నే విప్లవ కార్యాచరణగా భ్రమించకూడదు. శత్రువు మీద కొన్ని దాడులు చేసి, విప్లవోద్యమం 'శరవేగం'తో పురోగమిస్తున్నదని భ్రమించకూడదు. (5) సిద్ధాంత జ్ఞానం లేకుండా, మిలిటెన్సీ పేరుతో, దూకుడుగా వుండేవారిని పార్టీలలో చేర్చుకుంటే, వాళ్ళు పార్టీకే హాని చేసిన సందర్భాలు వున్నాయి. అనుభవాల నించీ నేర్చుకోవాలి. నయీం, కత్తుల సమ్మయ్య, జడల నాగరాజు, వంటి వారి ఉదంతాలను ఎన్నో చదివాం, వార్తల్లో అప్పట్లో. (6) తగిన జాగ్రత్తలు తీసుకోవాలే గానీ, ఇన్ఫార్లనే అనుమానంతో, తోటివారినో, సాధారణ ప్రజలనో, చిత్రవధలు చేయడం, చంపడం జరగకూడదు. ఒంటరిగా కనిపించే పోలీసుల్నో, పాలకవర్గ ప్రతినిధుల్నో, వర్గ శత్రువు అనే పేరుతో కిడ్నాప్ చేయడం, 'ఖతం' చేయడం వంటి కార్యక్రమాలు ఉండకూడదు! 'నూతన సమాజం' కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే కమ్యూనిస్టులు చెయ్యాల్సిన పనులు కావు అవి. అనాదిగా, పాలకవర్గాలూ, వాటి ప్రభుత్వ బలగాలూ చేస్తున్న క్రూర చర్యల వంటివే అవి.

(7) దేశంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమలలో, రవాణా రంగంలో, కోట్లాది మంది శ్రామిక జనాలకు వర్గ సంఘాలు ('క్లాస్ ఆర్గనైజేషన్స్') లేవు. అలాగే, వేరు వేరు స్థితిగతుల నించీ వచ్చే స్త్రీలూ, విద్యార్థులూ, టీచర్లూ, ప్రభుత్వ ఉద్యోగులూ వంటి వారిని ప్రజా సంఘాలలోకి ('మాస్ ఆర్గనైజేషన్స్') సమీకరించడం చాలా అవసరం! అవేవీ సరిగా లేకపోవడం వల్ల, బూటకపు ఎన్‌కౌంటర్లు ఎన్ని జరిగినా, ప్రజలకి పట్టడం లేదు. (8) శ్రీనివాస్ గారు శ్రామిక వర్గ ఉద్యమకారుల్ని 'అస్త్ర సన్యాసం' చెయ్యమని చెప్పడం లేదు. ఉద్యమాలు నడపవలిసిందే! కొందరు చెపుతున్నట్టు, దోపిడీ రాజ్యాంగ ఎన్నికల నాటకాలు, వర్గ ఉద్యమకారులకు మార్గం కాదు. కానీ, 'సాయుధ పోరాటమే ఏకైక మార్గం' అనే యాంత్రిక అవగాహనతో, 'ఉన్నదొక్కటే దారి! చారూమజుందారీ' అన్నట్టు తక్షణ కార్యక్రమాలు ఉండకూడదు. కార్మిక వర్గం, సంస్థాపరంగా పురోగమించి వుండకపోతే, పాలకవర్గాల రాజకీయ అధికారానికి వ్యతిరేకంగా కార్మికులలో నిరంతరం ప్రచారం చేస్తూ, వారికి శిక్షణ ఇచ్చితీరాలనీ, లేకపోతే, వారు పాలకవర్గాల చేతిలో ఆటవస్తువులుగా మారతారని, గతంలో, కార్మిక వర్గ నాయకులకు మార్క్సు చేసిన సూచనను ఏ క్షణమూ మరిచిపోకూడదు!

• రంగనాయకమ్మ


మోదీజీ, హిమాలయాల ఘోష వినరా?

హిమాలయ ప్రాంతాల, ప్రజల అభివృద్ధి విషయమై మనకు ఒక సమగ్ర విధానం ఉన్నదా? స్వాతంత్ర్య తొలి దశాబ్దంలోనే సమగ్ర 'హిమాలయన్ విధానం' భారత్‌కు అవసరం అని డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా నొక్కి చెప్పారు. ఇంజినీర్, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ నేతృత్వంలో లేహ్ నుంచి న్యూఢిల్లీకి లద్దాఖ్ వాసుల చరిత్రాత్మక పాదయాత్ర ప్రస్తుత పాలకులకు లోహియా డిమాండ్‌ను గుర్తుచేసేందుకు తోడ్పడవచ్చు. భారత్, చైనా సరిహద్దుల్లోని భారత పౌరులు నెల రోజుల పాటు 1000 కిలోమీటర్లు నడిచి తమ జాతీయ రాజధానికి చేరుకున్నప్పుడు వారు చెప్పదలుచుకున్నది వినడం దేశ పాలకుల కనీస ధర్మం కాదూ? అయితే జరిగిందేమిటి? ఢిల్లీలో హఠాత్తుగా సెక్షన్ 144 విధించి, వందల మైళ్ల దూరం నడిచి వచ్చిన లద్దాఖ్ ప్రజలను చట్టబద్ధమైన కారణం లేకుండానే నిర్బంధించారు. గాంధేయ పద్ధతుల్లో నిరసన దీక్ష నిర్వహించేందుకు అనుమతి నిరాకరించారు. లద్దాఖ్ భవన్‌లో నిర్బంధితులు అయిన సోనమ్ వాంగ్ చుక్ అక్కడే నిరసన దీక్ష ప్రారంభించి కొనసాగిస్తున్నారు. తమకు సంఘీభావంగా దీక్షలో పాల్గొనాలని ఇతరులను వాంగ్ చుక్ ఆహ్వానిస్తే పోలీసులు ఆయన మద్దతుదారులపై విరుచుకుపడి పలువురిని నిర్బంధించారు. లద్దాఖ్ పౌర సమాజ సమూహాలు అయిన లేహ్ అపెక్స్ బాడీ (ఎల్‌ఏబి), కార్గిల్ డెమొక్రాటిక్ అలయెన్స్ (కెడిఏ) ఆధ్వర్యంలో లద్దాఖీలు ఎన్నో నెలలుగా ఆందోళన చేస్తున్నారు. అయినా వారి సమస్యలు, డిమాండ్లను విశాల భారతావని పట్టించుకోవడమే లేదు.

ఇటీవలి కాలంలో హిమాలయన్ ప్రాంతాలలో సంభవించిన వివిధ ఘటనలపై మనం సుసంగతమైన అవగాహన పెంపొందించుకోవల్సిన అవసరమున్నది. లద్దాఖ్‌లో పెల్లుబికిన ప్రజల నిరసన వాటిలో ఒకటి మాత్రమే. ఇతర ఘటనలు: అధికరణ 370 రద్దు అనంతరం కశ్మీర్‌లో సంభవిస్తున్న పరిణామాలు, ఉత్తరాఖండ్‌లో భారీ భూపాతాలు, నేపాల్‌లో ప్రభుత్వం మార్పు, సిక్కింలో వెల్లువెత్తిన ఆకస్మిక వరదలు, చైనాకు భూటాన్ సన్నిహితమవడం, అసోంలో ఎన్‌ఆర్‌సి కల్లోలం, మణిపూర్‌లో అంతర్యుద్ధం మొదలైనవి. ఈ ఉపద్రవాలు అన్నిటినీ మనం సమగ్ర, నిష్పాక్షిక దృక్పథంతో అర్థం చేసుకోవాలి. మరి మనం వాటిని భౌమ రాజకీయ, అంతర్గత భద్రత, ప్రాకృతిక విపత్తు, జాతుల వైరంకు సంబంధించిన ఘటనలుగా భావిస్తున్నాం. అయితే హిమాలయ ప్రాంతాలు, రాజ్యాల మధ్య పరస్పర సంబంధాలు, అవి ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక సమగ్ర దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఏడు దశాబ్దాల క్రితమే డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా విజ్ఞప్తి చేశారు. పశ్చిమాన ఉన్న పఖ్తూనిస్తాన్ నుంచి తూర్పున ఉన్న బర్మా దాకా విశాల హిమాలయ పర్వత సీమలలోని వివిధ ప్రాంతాల, ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక పరిపూర్ణ ప్రజాస్వామిక దృక్పథాన్ని అనుసరించాల్సిన అవసరమున్నదని లోహియా స్పష్టం చేశారు.

స్వతంత్ర భారతదేశానికి తొలినాళ్లలోనే చైనా విస్తరణ వాదం నుంచి ముప్పు వాటిల్లిన నేపథ్యంలో హిమాలయన్ విధాన రాజకీయ కోణాలకు లోహియా ప్రాధాన్యమిచ్చారు. భారత్‌కు ఎదురవుతున్న బాహ్య, అంతర్గత సవాళ్లు ఎలా ముడివడి ఉన్నదీ ఆయన విశ్లేషించారు. భారత్ లోపల, బయట హిమాలయన్ ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం ఆయన నిలబడ్డారు. టిబెట్, నేపాల్ పాలకులకు వ్యతిరేకంగా ఆయా దేశాల ప్రజలు చేస్తున్న పోరాటాలకు భారత్ మద్దతునివ్వాలని ఆయన ప్రతిపాదించారు. కశ్మీర్, నాగాలాండ్ తిరుగుబాటుదారులతో ప్రజాస్వామిక చర్చలు జరపాలని ఆయన వాదించారు. ఈశాన్య భారత రాష్ట్రాలలో ఆదివాసీలు, ఆదివాసీయేతరులను సామాజికంగా, భౌతికంగా వేర్వేరుగా ఉంచాలన్న వెర్రియర్ ఎల్విన్ ప్రతిపాదిత గిరిజన విధానాన్ని లోహియా తీవ్రంగా వ్యతిరేకించారు.

హిమాలయన్ విధానంపై లోహియా దార్శనికత ఆ ప్రాంత ప్రజల మధ్య బహుళ సమైక్యతలను ఆకాంక్షించింది.



హిమాలయ ప్రాంతాల పట్ల మరింత శ్రద్ధాసక్తులు చూపవలసిన అవసరం ఉన్నదనే వాస్తవాన్ని సోనమ్ వాంగ్ చుక్, ఆయన సహచరులు మనకు గుర్తుచేశారు. అంతేకాకుండా మన కాలంలో హిమాలయన్ విధానం ఎలా ఉండాలి, దాని ఉపయుక్తత ఏమిటి అనే విషయమై మన అవగాహనను మెరుగుపరిచారు. వికేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని లద్దాఖ్ ప్రజలు కోరుకుంటున్నారు. రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ హోదా లద్దాఖ్‌కు కూడా కల్పించాలన్నదే లేహ్ నుంచి ఢిల్లీ పాదయాత్ర తక్షణ, ప్రధాన డిమాండ్.

అవి: హిమాలయన్ ప్రాంతంలోని వివిధ దేశాలలో నివసిస్తున్న ప్రజల మధ్య ఐకమత్యం, భారతదేశ పౌరులతో ఇరుగు పొరుగు దేశాల ప్రజల ఏకత్వం; హిమాలయ ప్రాంతాల సంస్కృతులు, సమాజాలు, విశాల భారతావనిలోని వివిధ సమాజాల, సంస్కృతుల మధ్య సమైక్యతను ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించారు. హిమాలయ ప్రాంతం పట్ల లోహియా వలే శ్రద్ధాసక్తులు, సహానుభూతిని చూపిన విజ్ఞులు ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు మహా పండితుడు, మహోన్నత రచయిత, నిత్య సంచారజీవి అయిన రాహుల్ సాంకృత్యాయన్ కాగా రెండవ వ్యక్తి తాత్త్విక యాత్రికుడు కృష్ణనాథ్.

హిమాలయ ప్రాంతాల పట్ల మరింత శ్రద్ధాసక్తులు చూపవలసిన అవసరం ఉన్నదనే వాస్తవాన్ని సోనమ్ వాంగ్ చుక్, ఆయన సహచరులు మనకు గుర్తుచేశారు. అంతేకాకుండా మన కాలంలో హిమాలయన్ విధానం ఎలా ఉండాలి, దాని ఉపయుక్తత ఏమిటి అనే విషయమై మన అవగాహనను విశేషంగా మెరుగుపరిచారు. ఢిల్లీ లేదా పుదుచ్చేరిలో వలే ప్రజలు ఎన్నుకున్న శాసనసభతో లద్దాఖ్‌ను కూడా ఒక పూర్తి స్థాయి రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేసి లద్దాఖ్ ప్రజలకు ప్రజాస్వామిక పాలన సమకూర్చాలని వాంగ్ చుక్ డిమాండ్ చేశారు. జమ్మూ–కశ్మీర్‌లో తమ ఉనికి దశాబ్దాల పాటు పూర్తిగా ఉపేక్షింపబడినందున తాము ఎన్నుకున్న, తమకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వ పాలనను లద్దాఖ్ ప్రజలు కోరుకుంటున్నారు. ఇది పూర్తిగా సహేతుకమైన, సానుభూతి చూపవలసిన డిమాండ్ అనడంలో సందేహం లేదు. లద్దాఖ్ జనాభా ఇంచుమించు మూడు లక్షలు మాత్రమే. అయోధ్య, హిసార్ లాంటి చిన్న పట్టణాల జనాభా కంటే ఇది ఏ మాత్రం ఎక్కువ కాదు. అయితే లద్దాఖ్ విస్తీర్ణం 59,000 చదరపు కిలోమీటర్లు. జమ్మూ కశ్మీర్ కంటే చాలా పెద్ద ప్రాంతం. మణిపూర్, మిజోరం, నాగాలాండ్‌ల మొత్తం విస్తీర్ణం కంటే లద్దాఖ్ విస్తీర్ణమే ఎక్కువ. అరుణాచల్ ప్రదేశ్‌కు ఉన్నట్లుగానే ఈ సువిశాల లద్దాఖ్‌కు కూడా లోక్‌సభలో ఇద్దరు ప్రతినిధులు, రాజ్యసభలో ఒక ప్రతినిధి ఎందుకు ఉండకూడదు? ఈ విషయంలో లద్దాఖ్ ప్రజల న్యాయబద్ధమైన ఆరాటాన్ని న్యూఢిల్లీ అర్థం చేసుకోవాలి.

వికేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని లద్దాఖ్ ప్రజలు కోరుకుంటున్నారు. ఆదివాసీ ప్రజల పరిపాలనకు సంబంధించిన రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ హోదా లద్దాఖ్‌కు కూడా కల్పించాలన్నదే లేహ్ నుంచి ఢిల్లీ పాదయాత్ర తక్షణ, ప్రధాన డిమాండ్. 6వ షెడ్యూల్‌లో చేర్చడం లేహ్, కార్గిల్‌తో సహా లద్దాఖ్‌లోని ఎమిమిది జిల్లాల్లోనూ నివసిస్తున్న విభిన్న గిరిజన తెగలు తమ సొంత అటానమస్ జిల్లా కౌన్సిల్‌ను కలిగి ఉండే సౌలభ్యం లభిస్తుంది. ఆయా గిరిజన తెగల అంతర్గత పాలనా వ్యవహారాలకు అటానమస్ జిల్లా కౌన్సిల్ బాధ్యత వహిస్తుంది. దీనివల్ల ప్రతి గిరిజన సముదాయానికీ తమ సొంత సంస్కృతి, అస్తిత్వాన్ని సంరక్షించుకునే సాధికారత సమకూరుతుంది. భారతీయ జనతా పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఈ విషయమై లద్దాఖ్ వాసులకు హామీ ఇవ్వడం గమనార్హం.

సోనమ్ వాంగ్ చుక్ నేతృత్వంలో నడుస్తున్న ఉద్యమం కేవల రాజకీయ డిమాండ్లకే పరిమితమైనది కాదు. స్థానిక ప్రజలకు భూములు, ఉద్యోగాలు, సాంస్కృతిక హక్కులు కల్పిస్తూ పర్యావరణ ప్రజాస్వామ్యంగా అభివర్ధించదగిన వ్యవస్థ ఒకదాన్ని నిర్మించాలని వారు కోరుతున్నారు. విచక్షణారహితంగా జల విద్యుదుత్పాదన ప్రాజెక్టుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. అయితే 'అభివృద్ధి'ని వారు వ్యతిరేకించడం లేదు. వాంగ్ చుక్ వృత్తిరీత్యా ఒక ఇంజనీర్, నవకల్పన నిపుణుడు. బోధనా పద్ధతులు స్థానిక సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల్లో వేళ్లూనుకుని ఉండే ఒక కొత్త విద్యా ఉద్యమానికి ఆయన ఆద్యుడు. ఈ విద్యా కృషి ఫలితంగానే ఆయనకు 2018లో రామన్ మెగాసెసే అవార్డు లభించింది. వాంగ్ చుక్, ఆయన సహచరులు అభివృద్ధిలో తమకు వాటా మాత్రమే కోరడం లేదు, ఒక కొత్త అభివృద్ధి నమూనాను వారు డిమాండ్ చేస్తున్నారు.



■ యోగేంద్ర యాదవ్

కొత్త అభివృద్ధి నమూనాకు పట్టుదలే సోనమ్ వాంగ్ చుక్ నిరసన దీక్షకు, ఇతర నిరసనలు, ఆందోళనలు, ఉద్యమాలకు భిన్నంగా ఒక ప్రత్యేకతను సమకూరుస్తుంది. అయితే మన ప్రజాస్వామ్య సమాజంలో ఆ ఉద్యమాలన్నీ విలువైనవే, సందేహం లేదు. భారత రాజ్య వ్యవస్థతో ఒక నైతిక సమానతను ప్రారంభించారు. ఇది మనకు బ్రిటిష్ సామ్రాజ్యంతో గాంధీజీ ఎలా తలపడేవారో గుర్తుకు తెస్తుంది. వాంగ్ చుక్ తన ప్రజల తరఫున న్యాయబద్ధమైన రాజకీయ డిమాండ్లు చేస్తున్నారు. అయితే ఆ డిమాండ్లను నెరవేర్చాలని న్యూఢిల్లీ పాలకులను వేడుకొనేందుకు ఆయన తిరస్కరిస్తున్నారు. బతిమలాడడమనేది ఆయన స్వభావం కానేకాదు. ఆయన దృఢసంకల్పుడు. కయ్యానికి కాలు దువ్వడం ఆయన నైజం కాదు. గాంధేయ పద్ధతుల్లో ఆయన పోరాడుతున్నారు.

లోహియా రోజుల్లో హిమాలయన్ విధానం అనేది ఒక కొత్త వినూత్న విషయం. ఇప్పుడది ఒక వ్యవస్థాపిత వివేకం. హిమాలయాలు (విదేశీ దాడుల నుంచి) మన సంరక్షకులు అన్న కవితాత్మక భావన స్థానంలో, అపరిమిత రహదారులు, వంతెనలు, భవనాలకు ఆ యువ, దుర్బల పర్వత శ్రేణులు ఇంకెంత మాత్రం ఆధారభూతం కాలేవన్న అవగాహన పెరుగుతోంది. సైనిక దళాల, భౌమ రాజకీయ కేంద్రిత జాతీయ భద్రతా దృక్పథం స్థానంలో హిమాలయాలలో నివసించే ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు ప్రాధాన్యమిచ్చే మానవ శ్రేయోభావన మొగ్గ తొడుగుతోంది ప్రాకృతిక అందాలకు అసాధారణ నెలవులు అన్న పర్యాటక వాద దృక్పథం స్థానంలో జలవనరులు, ఔషధ తరువులు, జీవ వైవిధ్యం, సుస్థిర జీవనాధార ఆచరణలకు హిమాలయాలే ప్రాతిపదికలు అన్న వివేకం వృద్ధి పొందుతోంది. హిమాలయాలు అంటే ప్రదేశాలు మాత్రమే కాదు, ప్రజలు కూడా అన్న సత్యాన్ని భారత రాజ్య వ్యవస్థ ఇంకా పూర్తిగా గుర్తించలేదు.

న్యూఢిల్లీలో సోనమ్ వాంగ్ చుక్ నిరసన దీక్ష కొనసాగుతోంది. లద్దాఖ్ ప్రజల విజ్ఞప్తులను నివేదించేందుకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రితో సమావేశమయ్యేందుకు అవకాశమివ్వాలని మాత్రమే ఆయన కోరుకుంటున్నారు. హిమాలయాల వివేకాన్ని ఆయన న్యూఢిల్లీకి తీసుకువచ్చారు. మరి మన రాజకీయ నాయకత్వం హిమాలయాల సమస్యలు, ఆకాంక్షలను వింటుందా? లేక హిమాలయన్ ఆగ్రహం ఢిల్లీపై విరుచుకుపడేదాకా వేచి ఉంటుందా?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

రెండు దశాబ్దాల 'రైతునేస్తం'

నేను సైతం రైతు కోసం అంటూ 2005లో ప్రారంభమైన రైతునేస్తం వ్యవసాయ మాసపత్రిక ద్విదశాబ్ది వేడుకలు జరుపుకుంటోంది. ఈ కాలం మొత్తం రైతునేస్తం రైతుల గుండె చప్పుడుకు వేదిక అయింది. ఆధునిక వ్యవసాయంతో సాగును లాభసాటి వ్యాపకంగా తీర్చిదిద్దడానికి అహరహం శ్రమించి పల్లె పల్లెకు చేరింది. ప్రతి రైతు కుటుంబంలో భాగస్వామి కావటానికి కష్టపడింది. వ్యవసాయ అనుబంధ రంగాలతో అదనపు ఆదాయం రైతుకు సమకూరాలనే దిశగా రైతులలో అవగాహన కోసం పరితపించి కొన్ని విజయాలు సాధించింది. రైతులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాల మధ్య వారధిగా మారి రోజువారీ సాగు సమస్యలకు హేతుబద్ధ పరిష్కార మార్గాలు సూచిస్తూ ప్రయాణం కొనసాగటం అందరికీ తెలిసిందే. మారిన కాలాన్ని అనుసరించి పశునేస్తం, ప్రకృతినేస్తం మాసపత్రికలను కూడా అందుబాటులోకి తెచ్చారు. అయితే కరోనా తరువాత రైతుల కోరిక మేరకు తిరిగి వాటిని రైతునేస్తంకు జోడించి సమగ్ర వ్యవసాయ పత్రికగా తిరిగి తీసుకువచ్చారు. ఇదే సమయంలో పత్రికను పూర్తిగా సేంద్రియ, సంప్రదాయ, సుస్థిర, సహజ వ్యవసాయ విధానాల కోసమే నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆ దిశగా పత్రిక నడుస్తోంది.

హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణలో, గుంటూరు జిల్లా కొర్నెపాడు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌లో నిరంతరం వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. చిరుధాన్యాలు, ప్రాసెసింగ్, అదనపు విలువ చేర్చటం, మిద్దెతోట సాగుకు అండగా చేయూతనిస్తూ ఆరోగ్య సమాజం కోసం తనవంతు కర్తవ్యం నిర్వహిస్తూ వస్తున్నారు. మరోవైపు రైతుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన వ్యాపకాల మీద వందకు పైగా ప్రచురణలు తీసుకురావటం సాధారణ విషయం కాదు. శిక్షణ, అవగాహన శిబిరాలు, ప్రచురణలతో పాటు రైతునేస్తం పేరుతో సేంద్రియ వ్యవసాయం కోసమే యూట్యూబ్ ఛానెల్ నడుపుతూ, రైతుల మద్దతుతో కొద్దికాలంలోనే విశేష ఆదరణ పొందటమే కాకుండా నెంబర్ వన్ స్థాయికి ఎదగటం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. లాభంతో పనిలేదు. కేవలం సేవాభావంతోనే కార్యక్రమాలు చేస్తూ రైతునేస్తం అంటే రైతులకు ఒక నమ్మకంగా నిలబెట్టారు.

పిట్ట కొంచెం కూత ఘనం అన్న పెద్దలమాట రైతునేస్తం విషయంలో రుజువయింది. చిన్న పత్రిక కొన్ని మౌలిక మార్పులకు శ్రీకారం చుట్టి తీవ్ర ప్రభావం చూపింది. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రైతులు, శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులతో పాటు వ్యవసాయ పాత్రికేయులను పద్మశ్రీ డా. ఐ.వి సుబ్బారావు రైతునేస్తం పురస్కారాలతో సత్కరిస్తూ వ్యవసాయ రంగంలో పని చేస్తున్నవారు ఎవ్వరికీ తీసిపోరు అన్న ఆత్మబలం ఇవ్వగలిగింది. రైతులకు ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి తన విశ్వసనీయత పెంచుకుంది. మిద్దెతోట, చిరుధాన్యాలు... ఆరోగ్యకర సమాజం కోసం అవసరమని నమ్మి, ఒక ఉద్యమ స్ఫూర్తితో చేస్తున్న అవగాహన సదస్సులు వారి కృషికి ప్రత్యేక సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. తెలుగునాట మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియా ఖాదర్ వలీ, మిద్దెతోట నిపుణులు రఘోత్తమరెడ్డి ఆశయాలను ప్రతి గడపకు చేర్చింది. సత్కార కార్యక్రమం చేస్తే రైతునేస్తం వారే చెయ్యాలి. పుస్తకం ముద్రిస్తే వారే ముద్రించాలి. శిక్షణ, అవగాహన శిబిరాల నిర్వహణ అంటే రైతునేస్తం వైపు దృష్టి సారించటం అంటే... పత్రిక తన 20 ఏళ్ల ప్రయాణంలో విజయం సాధించినట్లే కదా!

– కాకుమాను సాంబశివరావు

(అక్టోబర్ 20న గన్నవరం, ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్టులో రైతునేస్తం ద్విదశాబ్ది వేడుకలు)

మానవతా ధార్మికుడు రతన్ టాటా

రతన్ టాటా మరణం యావత్ దేశాన్ని శోకసంద్రంలో ముంచేసింది. ఎంతోమంది తమ కుటుంబ సభ్యుణ్ణి కోల్పోయినట్టు బాధపడి, ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వేదికగా తమ దుఃఖాన్ని వెలిబుచ్చారు. సాధారణ వ్యక్తులు సైతం టాటా సన్స్ గ్రూప్ గురించి తెలుసుకుని మరీ బాధపడటం టాటాలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనం. వ్యాపారాలు అందరూ చేస్తారు కానీ విలువలతో కూడిన వ్యాపారాలు చేస్తూ, సంపదను రోజురోజుకు పెంచుకోవడం ఒక ఎత్తు అయితే, వచ్చిన లాభాల్లో మళ్ళీ సమాజానికే సింహభాగం కేటాయించడం, నైతికత, విలువలతో వ్యాపారం చేయటం టాటా గ్రూప్ ప్రత్యేకత. ఇదే టాటాను ప్రపంచంలో ప్రత్యేకంగా నిలబెట్టింది. ఇదొక్కటే కాదు సామాజిక అవసరాలు తీరుస్తూనే కాలానుగుణంగా వస్తున్న మార్పులతో పోటీపడి సామాన్య భారతీయుని కలలను సాకారం చేసేందుకు రతన్ టాటా తాపత్రయపడ్డారు. గుజరాత్‌లోని నవ్సారలో ఒక చిన్న బట్టల మిల్లుతో ప్రారంభమైన టాటాల ప్రస్థానం, నేడు ప్రపంచంలో వందకు పైగా దేశాల్లో అన్ని రంగాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి ప్రపంచమే అబ్బురపడేలా సాగుతోంది.



గుజరాత్‌లో నూలు పరిశ్రమతో జంషెడ్‌జి టాటా గ్రూప్‌ను 1870లలో స్థాపించారు. ఆ తర్వాత ఈ గ్రూప్ ప్రస్థానం మనకు తెలియంది కాదు. ఒక్క టాటానే కాదు పార్శీలు అందరూ కష్టపడి పని చేయటంలోనూ, కాలానుగుణంగా మారడంలోనూ, వ్యాపార మెలకువల్లోనూ ప్రపంచంలోనే అగ్రగణ్యులు. ప్రస్తుతం మన దేశంలోని 145 కోట్ల మంది జనాభాలో పార్శీల జనాభా కేవలం 60 వేలు మాత్రమే. కానీ అనాదిగా దేశం కోసం విప్లవాత్మక మార్పులు తేవటంలో వారి పాత్ర అమోఘం. దేశంలో మొదటి బట్టల మిల్లు, మొదటి న్యూస్ పేపర్, మొదటి భారతీయ బ్యాంక్ స్థాపన పార్శీలే చేశారు. ముంబైలో సింహభాగం వ్యాపారాలే కాకుండా, ముంబైని ఆర్థిక రాజధానిగా మలిచింది కూడా పార్శీలే. కేవలం ఆర్థికంగానే కాక సాంఘిక రాజకీయ జీవనంలో కూడా వారి భాగస్వామ్యం వెలకట్టలేనిది. స్వాతంత్రోద్యమ కాలంలో కూడా ఫిరోజ్ షా మెహతా, దాదాబాయి నౌరోజీ లాంటి వారు, ప్రఖ్యాత సైంటిస్టు హోమి జహంగీర్ బాబా, పల్లోంజి మిస్త్రీ, గోద్రెజ్, పూనావాల, వాడియాల కుటుంబాలు పార్శీలవే. ఇక జంషెడ్‌జి టాటా అయితే స్వామి వివేకానందతో చికాగో నుంచి చేసిన ప్రయాణమే తన వ్యాపార సామ్రాజ్యాన్ని మలుపు తిప్పిన ఇనుము ఉక్కు పరిశ్రమల స్థాపనకు ప్రేరేపించిందని చెప్పారు.

స్వాతంత్ర్యం తరువాత జరిగిన అభివృద్ధిలో రతన్ టాటా నవభారత నిర్మాణానికి పునాదులు వేశారనడంలో సందేహం లేదు. ఆధునిక శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా రోజురోజుకీ వస్తున్న మార్పులను టాటా గ్రూప్‌కు అన్వయిస్తూ ప్రపంచంలోని మేటి సంస్థలకు దీటుగా నిలుపుతూనే సగటు భారతీయుని ఆలోచనలను, ఆకాంక్షలను తీర్చేందుకు నిత్య శ్రామికుడిగా మారాడు. ఎంతలా అంటే తాను వివాహం చేసుకుంటే మళ్ళీ వ్యాపారానికి ఇచ్చే సమయం ఉండదేమో అన్నంతగా. రతన్ టాటా చూపిన దాతృత్వ మార్గం మాత్రం కార్పొరేట్ వ్యాపార సామ్రాజ్యంలో ప్రకంపనలు సృష్టించింది.

కార్పొరేట్ సామాజిక బాధ్యతలలో భాగంగా పేదల కోసం ఎన్నో వినూత్న సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారాయన. కంపెనీ లాభాల్లో రెండు శాతమో, ఐదు శాతమో లాభాలను టర్నోవర్‌ను బట్టి వినియోగించాలని సీఎస్ఆర్ చట్టం రూపొందించినా, రతన్ టాటా మాత్రం ఏకంగా 50 నుంచి 60శాతం లాభాలను సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించటం నిజంగా ఆదర్శనీయం. విపత్తుల వేళ ఆయన చూపిన మానవతావాదం కార్పొరేట్‌లను విస్మయానికి గురిచేసింది. కరోనాకాలంలో పీఎమ్ కేర్స్‌కు ఏకంగా 1200 కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వడం, ఆయన చేతులకు ఎముకలు లేవని మరోమారు నిరూపిం చింది. దేశంలోని ప్రతి పౌరునికి టాటా గ్రూప్‌పై అభిమానం ప్రేమ కలిగేందుకు కారణం ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు. కార్పొరేట్ ఉద్యోగులకు, కంపెనీలకు సామాజిక స్పృహ ఉండాలని టాటా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ స్థాపించడం చూస్తే సేవా గుణాన్ని, దాతృత్వాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు ఆయన పడ్డ తాపత్రయం అర్థమవుతుంది.

గుండు పిన్ను నుంచి విమానాల వరకు ఆయన స్పృశించని రంగం అంటూ ఏదీ లేదు. వారసత్వ కట్టడాలను పరిరక్షించడం కోసం తాజ్ హోటల్స్ పేరుతో లాభాపేక్ష లేకుండా అందరూ సందర్శించేలా చేశారు. కార్పొరేట్ వ్యాపారాలకు మానవతా విలువలు జోడించి, విజయం సాధించిన ఆధునిక వ్యాపారవేత్త ఆయన. భవిష్యత్తు భారతాన్ని అంచనా వేసి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. వేగంగా నడవాలంటే ఒంటరిగా, దూరం నడవాలంటే తోడుగా నడవాలన్న ఆయన మాటలు దూరదృష్టితో టాటాల సామ్రాజ్యం, దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెప్పింది కావచ్చు.

సామాన్య భారతీయుని కలల కారు ప్రయాణాన్ని లక్ష రూపాయలతో నానో కారు ద్వారా తీర్చి ఆయన సంచలనమే సృష్టించారు. నానో ద్వారా నష్టాలు వచ్చినా కష్టంగా భరించారు. ఇతర వ్యాపారాల్లో లాభాల ద్వారా ఈ నష్టాన్ని పూడ్చారే తప్ప సామాన్యుని కలలను మాత్రం చెరిపి వేయలేదు. ఆయన ఆచరించి చూపిన వ్యాపార మార్గం వ్యాపార నిర్వహణ శాస్త్ర విద్యార్థులకు, నిర్వాహకులకు పాఠాలుగా మిగిలిపోతాయి. దురదృష్టవశాత్తూ కమ్యూనిస్టు పార్టీలు అధికార పార్టీలను విమర్శించే క్రమంలో టాటాలకు, బిర్లాలకు దోచిపెడుతున్నారంటూ ఊతపదంగా వాడేవారు. టాటాలు ఎప్పుడు కూడా రాజకీయాలకు, వివాదాలకు దూరంగా ఉన్నారు. టాటా అంటేనే ట్రస్ట్, వ్యాపారం అంటే కేవలం ఆదాయం మాత్రమే కాదు అభిమానం, ఆత్మీయత అని నిరూపించారు రతన్ టాటా. భారతీయుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మనసున్న వ్యాపారవేత్త. దేశం సంకట స్థితిలో ఉన్నప్పుడు ఆపన్న హస్తాన్ని అందించే నిర్మల దేశభక్తుడు. ఆదాయం కంటే ఆత్మసంతృప్తి ముఖ్యమని కోట్లాదిమంది భారతీయుల హృదయాలను దోచుకుని చాలా లాభాన్ని సంపాదించి మూటగట్టుకెళ్లిన నిజమైన భారతరత్నం.

■ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

నివాళి



అమాయక జనాన్ని
మాయా పాలకులే
అన్యాయానికి గురిచేస్తుంటే
ప్రశ్నించినందుకు, అడ్డుకున్నందుకు
ప్రజాస్వామ్యబద్ధంగా
ప్రజాపక్షం వహించినందుకు
ప్రతీకారంతో ప్రతీ వికారాన్ని ప్రదర్శిస్తూ
మావోయిస్టుల ఆరో ప్రాణమనో
ఆయన ఆరో ప్రాణం మావోయిస్టులనో
మోపిన ఆరోపణ చూస్తే
చంపదలచిన కుక్కకు
'పిచ్చిద'నే ట్యాగేసినట్టుంది.

తొంభైశాతం దివ్యంగత్వాన్ని ధరించి
తన ఆరోగ్యాన్ని పట్టించుకోక
సాటి ఖైదీల హక్కుల్ని
తన హక్కుగా పట్టించుకున్న
సూర్యుడైనందుకు
పాలక మేఘాలు/ నిర్బంధ వర్షంతో
ఆర్పివేయ తడిపినై
ఆరోగ్యాన్ని మరింత/ కొల్లగొట్టి, చెడగొట్టి
ఆర్నెల్లకంటే ఎక్కువ కాలం
శరీరం మన్నకుండా చేసి
నిర్దోషిగా నిర్ణయించడం
ఈ ధర్మభూమిలో ధర్మప్రభువుల
కనికట్టు కనికరం.

బహుమతుల కోసమే
బహు మతులు
కలాన్ని, కాలాన్ని, సకలాన్ని
సమీకరించే మేధావులారా,
సకల జనుల కళాకారులారా,
సశస్త్ర సకలం యోధులారా,
ఆయన సకలల సాకారం కోసమే
అంజలి ఘటిద్దాం రండి!

– డా. రాపోలు సుదర్శన్
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం



వదిలేదేలే!

- ఏళ్లుగా ఒకే స్థానాల్లో బల్దియా సూపరింటెండెంట్ల విధులు
- రాజకీయ అండదండలతో తిష్టవేసుకుంటున్న వైనం
- మహానగరపాలకంలో విధులు నిర్వహిస్తున్నది ఆరుగురే
- బదిలీల్లేకుండా.. అందినకాడికి దండుకుంటున్న కొందరు
- అన్నీ తెలిసి చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో పనిచేసే కొందరు సూపరింటెండెంట్లు యేళ్లతరబడి పాతుకుపోయారు. ఇదే అదనుగా తమకున్న రాజకీయ అండదండలతో తోటి ఉద్యోగులని కూడా చూడకుండా బదిలీలు, వేతనాల చెల్లింపు, చేసిన పనులకు బిల్లులు, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు కోట్లకు పడగలెత్తారని ప్రచారం జరుగుతోంది. ఏకంగా ఓ సూపరింటెండెంట్ ఐదేళ్లుగా ఒకే విభాగంలో పర్యవేక్షణాధికారిగా, క్లర్క్‌గా, యూనియన్ నాయకుడిగా పని చేస్తూ రెండు చేతులా సంపాదిస్తుండటం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. అతడి అవినీతిని గుర్తించిన నగర మేయర్, కమిషనర్ పిలిచి మందలించడంతో తనపై నిందలు వేస్తారా? అంటూ నానా హంగామా చేసి ఆత్మహత్య చేసుకుంటానని వారిని బ్లాక్‌మెయిల్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఇలా బల్దియాలో ప్రతీ విభాగంలో పని చేస్తున్న సూపరింటెండెంట్లు నకిలీ బిల్లులు పాస్ చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం బల్దియా పరిధిలో తొమ్మిది మంది సూపరింటెండెండ్లు ఉండాల్సింది పోయి వివిధ కారణాలతో ఆరుగురే పని చేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన సూపరింటెండెంట్లు అదనపు పని చేస్తున్నట్టు నటిస్తూ ఆయా విభాగాల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. చాలా కాలంగా ఒకే చోట పని చేస్తూ బదిలీ అయినా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోకుండా రాజకీయ పలుకుబడి, అధికారుల అండదండలతో డిప్యూటేషన్‌పై ఇక్కడే పని చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటీవల బల్దియాలో పని చేస్తున్న సూపరింటెండెంట్లపై ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా నయానో, భయానో తీసుకుని గప్‌చుప్‌గా ఉంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం ఆరుగురే విధుల నిర్వాహణ..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థతో పాటు కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాల్లో ఒక్కో విభాగానికి ఒక్కో పర్యవేక్షణాధికారి పని చేస్తున్నారు. అక్కడి విభాగం అధికారుల కనుసన్నల్లో సూపరింటెండెంట్లు పని చేస్తారు. కానీ కొందరు పర్యవేక్షణాధికారులు అక్కడి ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం లెక్కచేయకుండా సొంత నిర్ణయాలు తీసుకుంటూ లంచావతారులుగా పేరుతెచ్చుకుంటున్నారు. తమ విభాగం అధికారులకు తెలియకుండా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ తోటి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు విమర్శలున్నాయి. కాగా, ప్రస్తుతం బల్దియా ప్రధాన కార్యాలయంలో సీ-1, కే-1, హెల్త్ సెక్షన్, కాశిబుగ్గ, కాజీపేట, పెన్షన్ సెక్షన్‌లలో మాత్రమే పూర్తికాలపు సూపరింటెండెంట్లు పని చేస్తున్నారు. ఇటీవల

మిగతా 7వ పేజీలో...

బదిలీ కాకుండా రాజకీయ అండదండలు..

ప్రస్తుతం ప్రభుత్వ శాఖలలో మూడు సంవత్సరాలకు మించి ఒకే చోట పని చేసిన వారికి ప్రభుత్వం ఒక చోట నుంచి మరో చోటికి బదిలీ చేయాల్సి ఉంది. కాగా, బల్దియాతో పాటు సర్కిల్ కార్యాలయంలో కొందరు పర్యవేక్షణ అధికారులు ఐదు సంవత్సరాలకు మించి ఒకే చోట పని చేయడం, పని చేస్తున్న ప్రదేశంలో అవినీతి అధికారులుగా ఆరోపణలు ఉన్నా బదిలీలు కావడం లేదనే విమర్శలున్నాయి. అయితే ప్రస్తుతం కొందరు అధికారులు బదిలీ కాకుండా రాజకీయ పలుకుబడితో పాటు అధికారులు ఆశీస్సులు మెండుగా ఉండడంతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతానికి బదిలీ కాకుండా ఇక్కడే ఉంటున్నారు. అంతే కాకుండా ఇక్కడి ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు నెలవారిగా ముడుపులు ముట్టజెప్పడంతో బదిలీ ప్రక్రియను ఆపుతున్నట్టు తెలుస్తోంది. ఇంకా కొందరు అధికారులు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినా రెండు, మూడు నెలలు గడవక ముందే డిప్యూటేషన్‌పై వచ్చి పాతపద్ధతినే కొనసాగిస్తున్నారు. ఇటీవల బల్దియా నుంచి ఖమ్మం, నర్సంపేట, పరకాలకు బదిలీపై వెళ్లిన సిబ్బంది, అధికారులు కొద్ది రోజులు గడవక ముందే తిరిగి డిప్యూటేషన్‌పై రావడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇలా చాలా మంది సిబ్బంది బల్దియా నుంచి కదలరు, వదలరు అనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మేయర్, కమిషనర్ పాతుకు పోయిన అధికారులను బదిలీ చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



8

ఆడించేవారేరీ?

క్రీడలకు నోచుకోని ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు

- ఉమ్మడి జిల్లాలో 17 డిగ్రీ కాలేజీల్లో నలుగురే పీడీలు
- 50 జూనియర్ కళాశాలల్లో ఒక్కరూ లేని వైనం
- అధ్యాపకులతోనే నామమాత్రంగా ఆటల నిర్వహణ

పిల్లలకు విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచేలా.. చదువుతో పాటు ఆటల్లోనూ రాణించేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందుకోసం నిధులు కూడా కేటాయిస్తున్నాయి. కానీ, అందుకు తగిన ప్రతిఫలం మాత్రం దక్కడం లేదు. అసలు విద్యార్థులతో ఆటలు ఆడించే ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవడంతో ప్రభుత్వాల లక్ష్యం నీరుగారుతోంది. ఇందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పీడీలు లేకపోవడమే నిదర్శనంగా నిలుస్తోంది. మొత్తం 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మూడు కాలేజీల్లో మాత్రమే ఫిజికల్ డైరెక్టర్లున్నారు. ఇక 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుంటే ఒక్క కళాశాలలో కూడా ఆటలాడించే సార్లు లేరంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- మహబూబాబాద్ ఎడ్యుకేషన్



కేయూకు రెగ్యులర్ వీసీ?

- నేడో, రేపో ఉత్తర్వుల జారీకి అవకాశం
- నియామకంపై కొనసాగుతున్న ఉత్కంఠ

8

సురేఖ.. నాకు స్ఫూర్తి!

- ట్విటర్ ఎక్స్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పోస్ట్
- ఎమ్మెల్యేల అసమ్మతి వేళ మంత్రిపై ప్రశంసలు



ఎక్స్(ట్విట్టర్)లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చేసిన పోస్టు

వరంగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తనకు రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్ఫూర్తి అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ట్విటర్ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు. సినీహీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు, గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సీట్లో కూర్చోవడం లాంటి వరుస వివాదాలతో పాటు సొంత జిల్లాకు చెందిన సొంత పార్టీ నేతలనుంచి అసంతృప్తి సెగ ఎదుర్కొంటున్న సురేఖ ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో ఒంటరి అవుతున్నారన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ట్విటర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టు ఓరుగల్లు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. సురేఖపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల్లో యశస్వినిరెడ్డి కూడా ఉందనే ప్రచారం జరిగింది. కానీ బుధవారం రాత్రి మడికొండలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కలుసుకున్న మంత్రి సురేఖ, యశస్వినీరెడ్డి ఫొటోలు దిగి, సరదాగా గడిపారు. ఆ తర్వాత ఆ ఫొటోలను యశస్వినిరెడ్డి ట్విటర్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ.. 'హనుమకొండలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మంత్రి సురేఖను కలిశా. ఆమె ప్రజల కోసం స్థిరంగా నిలబడతారు. ప్రగతి కోసం అవిశ్రాంతంగా పని చేస్తారని నిరూపించుకున్న డైనమిక్ లీడర్. ప్రజాసేవలో ఆమె చూపే నిబద్ధత నాకు స్ఫూర్తినిస్తుంది' అంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. అయితే మంత్రిపై ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసిన 24గంటల్లోపే పాలకుర్తి ఎమ్మెల్యే ఎక్స్ వేదికగా చేసిన పోస్టు రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. సొంత పార్టీ నేతల నుంచి దూరమవుతున్నారని అనుకుంటున్న కొండా ఎపిసోడ్‌లో ఇదో కీలక మలుపన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలి

- టీవీఏసీ జాక్ డిమాండ్
- మహాధర్నాతో దద్దరిల్లిన ఎన్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం

6

భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్, కుడా పరిధిలోని వివిధ అభివృద్ధి పనులపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి రెవెన్యూ, మునిసిపల్, కుడా, టౌన్‌ప్లానింగ్, ఇతర శాఖల అధికారులతో గురువారం సాయంత్రం కలెక్టర్ ప్రావీణ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియ, కుడా ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా శాఖల అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో చెరువులు, కుంటలు ఉన్నచోట రెవెన్యూ, సాగునీటి పారుదల శాఖల అధికారులు కూడా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి ధృవీకరణ ప్రక్రియలో పాల్గొనాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కుడా ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలలో డీపీవో చర్యలు తీసుకోవాలని సూచించారు. విస్తీర్ణం ప్రకారం చెరువులు, కుంటలకు సంబంధించిన భూములకు హద్దులను ఏర్పాటు చేయాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కుడా ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల కేంద్రంలో చేపట్టనున్న జంక్షన్, సుందరీకరణ పనులకు సంబంధించిన వివిధ అంశాలను కుడా, ఆర్డీసీ అధికారులతో చర్చించారు. ఈసమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్ రెడ్డి, డీపీవో లక్ష్మీ రమాకాంత్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్ తక్షణమే విడుదల చేయాలి

- లేదంటే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం
- వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరిక
- హనుమకొండ అశోక జంక్షన్‌లో ధర్నా, రాస్తారోకో

హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయకుంటే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. రాష్ట్రంలోని విద్యార్థులు పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కేడీసీ కళాశాల నుంచి అశోక జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని సంక్షోభంలోకి తీసుకెళ్లగా, నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే విద్యా వ్యవస్థను గాడిన పెడతామని తెలంగాణ విద్యార్థి లోకానికి హామీ ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం గత ప్రభుత్వం అనుసరించిన విద్యార్థి వ్యతిరేఖ విధానాన్నే కొనసాగిస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు పది రోజులు పాటు విద్యా సంస్థల నిరవధిక బందుకు పిలుపునివ్వడంతో విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని లేదంటే వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. నర్సింహారావు, వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శులు మిశ్రిన్ సుల్తానా, రాచకొండ రంజిత్, ఏఐఎస్‌బీ హనుమకొండ జిల్లా కన్వీనర్ పెండ్యాల సతీష్, యూఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్, ఏఐఎస్‌బీ జిల్లా కో కన్వీనర్ రోహిత్ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రాకేష్‌గౌడ్, అర్జున్, చరణ్ పాల్గొన్నారు.



హనుమకొండ అశోక జంక్షన్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

వైభవంగా గార్ల వేట వేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గార్ల అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మర్రిగూడెం సమీపంలోని వేట వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేట వేంకేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రతిష్ఠించి, మేళతాళాలతో ఎదుర్కోళ్లు నిర్వ హించి, కల్యాణాన్ని నిర్వహించారు. తలంబ్రాలను, పట్టువస్త్రాలను డోర్నకల్ మండ లం అమ్మపాలెం నుంచి మల్లం గోపయ్య, నర్సయ్య వంశస్తులు తీసుకరాగా, పుల్లఖండం వేణుగోపాల్‌రావు, కవిత, బుడిద అరుణ్‌గౌడ్, రాణి, ఉమాశంకర్, సుచిత్ర, రంగనాథస్వామి, హేమలత, ఖండూర లక్ష్మీనారాయణ స్వామి, లక్ష్మి, కాండూరి రామానుజ్యాచార్యలు, భరద్వాజ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణతంతును నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి వేలాదిగా తరలొచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఎస్సై జీనత్‌కుమార్ బం దోబస్తును ఏర్పాటు చేశారు. గ్రామపెద్దలు పుల్లఖండం రమేష్‌బాబు, రాపూరి వెంకట్రా మ య్య, సురపురెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నారై పులి గోపాల్‌రెడ్డి ప్రమీలరెడ్డి దేవాదా యశాఖాధికారి సమత, పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రాల అనుమతికి దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక బాణసంచా విక్రయాలకు అనుమతి కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వరంగల్ పోలీసు కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తుతో పాటు ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లయితే స్థల యజమాని అనుమతి పత్రం, అలాగే ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతి పత్రం, పక్క నిర్మాణల్లో ఏర్పాటు చేస్తున్నట్లతే వాటి యజమానుల అనుమతితో పాటు పక్క భవనం బ్లూ ప్రింట్, ఎస్‌బీఐ ఆదాలత్ శాఖలో రూ. 800 ప్రభుత్వ ఖజానాకు జమచేసినట్లుగా బ్యాంక్ చాలన్‌తో దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబరు 23వ తేదీలోపు సమర్పించాలని సీపీ కోరారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు అనుమతులు జారీ చేస్తారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

హనుమకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను(ఫ్లాగ్ డే) పురస్కరించుకొని వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విద్యార్థినీ, విద్యార్థులకు, యువతీ, యువకులకు ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్‌లకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్టు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. పోలీసు అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఈ మధ్య కాలంలో తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి(మూడు నిమిషాలు)గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీ లోగా వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిలిమ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 ఇంటు 8 సైజ్ ఫొటోలను వరంగల్ సీపీ పీఆర్‌వోకు అందచేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం, వాటి అనర్థాలు, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2013 అక్టోబరు నుంచి ప్రస్తుత సంవత్సరం అక్టోబరు నెల(ఇప్పటి వరకు) తీసిన మూడు ఫొటోలు, షార్ట్ ఫిలిమ్ పంపించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకోసం 8712685050 నంబర్‌ద్వారా పీఆర్‌వోను సంప్రదించాలని పేర్కొన్నారు.

జర్నలిస్టు సుభాష్ కుటుంబానికి అండగా ఉంటా

▸▸ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సుభాష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

హసన్‌పర్తి, అక్టోబర్ 17, (ఆంధ్రజ్యోతి): మృదుస్వభావి, సీనియర్ జర్నలిస్టు నాయకపు సుభాష్‌గౌడ్ కుటుంబానికి అండగా ఉంటానని అతని ఒక్కగానొక్క కుమారుడికి కోరుకున్న పెద్ద కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇచ్చారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సుభాష్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు సుభాష్ తనకు ఆప్త మిత్రుడని ఆయన మరణం జర్నలిస్టు లోకానికి, కుటుంబానికి తీరని లోటన్నారు. దయాకర్‌రావు వెంట 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి వరంగల్ బ్యూరో చీఫ్ తడక రాజ్‌నారాయణగౌడ్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ప్రతినిధి నవీన్, ఎర్రగట్టు దేవస్థానం మాజీ చైర్మన్‌లు లక్ష్మణ్, రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రజనీకుమార్, పాపుశెట్టి శ్రీధర్, రమేష్ తదితరులున్నారు.

విద్యార్హతల ఆధారంగా పోస్టింగ్స్ కేటాయించాలి



హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం ఎదుట మహా ధర్నా చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

▸▸ టీవీఏసీ జాక్ డిమాండ్

▸▸ మహా ధర్నాతో దద్దరిల్లిన సీఎండీ కార్యాలయం

హనుమకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్‌లో ఆర్టిజన్స్‌కు ఉన్న విద్యార్హతల ఆధారంగా పోస్టింగ్ కేటాయించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జాక్ (టీవీఏసీ) చైర్మన్ కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేసిన తర్వాతే డిస్కంలలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని సీఎండీ కార్యాలయం ఎదుట టీవీఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఎన్పీడీసీఎల్‌ని 16 సర్కిళ్లలో ఆర్టిజన్ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహాధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాక్ చైర్మన్ కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ 2017లో 23,667 మంది కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించగా, 2024 సంవత్సరం వచ్చే సరికి 23,667 మందిలో కొంత మంది రిటైర్డ్ కావడం, మరి కొంత మంది ప్రమాదాలతో మరణించడం ద్వారా ప్రస్తుతం 19,587 మంది ఆర్టిజన్‌లు మాత్రమే మిగిలిపోయారన్నారు. వారందరిని కన్వర్షన్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్‌లల్లో ఐటీఐ చదివిన వారికి జూనియర్ లైన్‌మెన్, డిప్లొమా పూర్తి చేసిన వారికి సబ్ ఇంజనీరింగ్, డిగ్రీ ఆపైన చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్, పది చదవిన వారికి సబార్డినేట్‌గా, ఇంటర్ చదవినవారికి రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దీనిపై ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కను జాక్ ఆధ్వర్యంలో కలిసి చర్చించగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమస్య ఇలాగ ఉండగానే మరో 3500 పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేస్తుందని, ముందుగా 19,587 మంది ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేసిన తర్వాతనే నియామకాలు చేపట్టాలని లేదంటే జాక్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని మేనేజ్‌మెంట్, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జాక్‌లోని ముఖ్య నాయకులు సీఎండీ వరుణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

మహా ధర్నాకు ముందు ఉమ్మడి ఐదు జిల్లాల నుంచి తరలివచ్చిన ఆర్టిజన్‌లు పబ్లిక్‌గార్డెన్ నుంచి ఎన్పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కాళోజీ జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్‌కు వచ్చే మార్గంలో కార్పొరేట్ కార్యాలయం ఎదుట సమారు 3 గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాక్ కన్వీనర్ వజీర్, కో- కన్వీనర్ నాగరాజు, కో-చైర్మన్ బి. శంకర్, ఫైనాన్స్ సెక్రెటరీ సదానందం, జాయింట్ సెక్రెటరీ చంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ పాల్గొన్నారు. కాగా, నక్కలగుట్ట నుంచి అంబేద్కర్ వరకు వన్ వే చేసి ఆ మార్గాన్ని సమారు 4 గంటల పాటు బ్లాక్ చేయడం ద్వారా వావాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



రాజబాబు (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొత్తపెల్లిలోబుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపెల్లికి చెందిన పోశాల రాజబాబుగౌడ్(45) తాటి చెట్లు ఎక్కుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య సువర్ణ రాజబాబులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సంపాదన సరిపోక పదేళ్లుగా బంధువు వద్ద 3 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకున్నారు. కొన్నేళ్లుగా పంటలు చేతికందక పోవడం, పెట్టుబడి రాక అప్పులు కాగా మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 16న రాత్రి కొత్తపెల్లిలోని చేపల చెరువు సమీపంలో చెట్టుకు ఉరి వేసుకోగా, గమనించిన స్థానికులు రాజబాబును 108 సహాయంతో వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. దీంతో భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



సాంబయ్య (ఫైల్)

సంగెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన గుండు సాంబయ్య (60) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నరేష్ చెప్పారు. ఎస్సై కథనం ప్రకారం.. సాంబయ్య మద్యం మత్తులో గతంలోనూ మూడు సార్లు పురుగుల మందుతాగి చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈనెల 14న ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందుతాగి కిందపడి పోయాడు. సాంబయ్య కుమారుడు రాజు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

సఖి సెంటర్ సేవలను వినియోగించుకోవాలి



లెనిన్‌నగర్‌లో మహిళల భద్రతపై అవగాహన కల్పిస్తున్న సఖి సెంటర్ నిర్వాహకులు

శంభునిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణలో ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సఖి సెంటర్ బాధ్యులు స్వప్న, తిరుమల తెలిపారు. నగరంలోని రంగశాయిపేట లెనిన్ నగర్‌లో మహిళలు, బాలికల రక్షణ గురించి సఖి సెంటర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళలకు ఎలాంటి ఆపద వచ్చినా మహిళా హెల్ప్‌లైన్ 181నెంబరుకు కాల్ చేసి రక్షణ పొందాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్‌లను నడిపిస్తున్నాయన్నారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్‌తో పాటు పోలీసు, వైద్య, న్యాయ సహాయం అందివ్వడంతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తుందన్నారు. పలు అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు, మహిళా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్‌కు అనుగుణంగా సిలబస్ ఉండాలి

▸▸ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : మార్కెటింగ్ అనుగుణంగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల సెలబస్‌ను రూపొందించుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. గురువారం కేయూ కామర్స్ విభాగంలో ప్రిన్సిపాల్ అమరవేణి అధ్యక్షతన కామర్స్ విభాగం అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇండస్ట్రీలు, మార్కెటింగ్ అవసరాలకు అనుగుణంగా నూతన దృక్పథంలో సెలబస్ ఉండాలని అన్నారు. భవిష్యత్ అవసరాలను తీర్చాలని పేర్కొన్నారు. సెలబస్‌లో అప్లికేషన్, కేస్‌స్టడీస్, ప్రాజెక్టు వర్క్స్ తదితర అంశాలు ఉండాలని తెలిపారు. డీన్, ప్రిన్సిపాల్ అమరవేణి మాట్లాడుతూ... 10 ఏళ్ళ తర్వాత నూతన అంశాలను జోడించి సెలబస్‌ను రూపొందించినట్లు వివరించారు. సమావేశంలో కామర్స్ ప్రొఫెసర్ వరలక్ష్మి, కట్ల రాజేందర్, శ్రీరామోజు నరసింహచారితో పాటు ఎంకామ్, ఎంబీఏ అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

పత్తి సాగుపై రైతులకు అవగాహన

▸▸ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ

ఖిలావరంగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అధిక సాంద్రత పత్తి పంటను సాగు చేయడం వలన కూలీల ఖర్చు తగ్గి, పంట కాలం తగ్గుతుందని, ఎక్కువ దిగుబడి వస్తుందని వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. గురువారం పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విద్యాలయం పరిధిలో కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు, వరంగల్ ఆధ్వర్యంలో ఖిలావరంగల్ మండల రైతులకు అవగాహన సదస్సును వరంగల్ ఏవో రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 360 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది పత్తి నాణ్యత పరీక్ష కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, సేద్య విభాగం డాక్టర్ సీహెచ్ సౌమ్య మాట్లాడుతూ అధిక సాంద్రతతో పత్తి సాగు చేయడం వల్ల గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. దీని నివారణకు రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని తెలిపారు. తర్వాత రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ కార్పొరేటర్ సువర్ణ-సురేష్, నూజివీడు విత్తన సంస్థ రీజియన్ మేనేజర్ మురళీమోహన్, నూజివీడు ప్రతినిధులు రామచంద్రారెడ్డి, నాగరాజు, ఏవోలు హరిప్రసాద్, చంద్రకాంత్, కేవీకే ప్రొఫెసర్ హర్షరెడ్డి, సాయిచంద్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు దూడయ్య, బ్లాక్ అధ్యక్షుడు బెడిద వీరన్న, ఉత్తమ రైతు వనపర్తి కర్నాకర్‌ను సన్మానించారు. రైతులు ఏసీరెడ్డి రమేష్, బొలుగొడ్డు శ్రీనివాస్, క్రాంతి, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న వరంగల్ డీఏవో అనురాధ


రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి ఎం. మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ హైదరాబాద్‌కు చెందిన కంపెనీలో రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేసేందుకు ట్రైయినీ కేంద్ర మేనేజర్ 50 ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19న ములుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాలకు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 78933 94393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కేయూ డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 28

కేయూ క్యాంపస్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ విద్యార్థులందరూ అక్టోబరు 28 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో నవంబరు 2వ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం ఉందని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ విద్యార్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని వివరించారు.

రేపటి నుంచి ఆర్ట్స్ కళాశాలలో అంతర్ కళాశాలల పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం నుంచి అంతర్ కళాశాలల ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి వెల్లడించారు. గురువారం ఆమె చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో చదివే సుమారు 800 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బాల్‌బాడ్మింటన్‌లో 12 టీమ్‌లు, క్రాస్‌కంట్రీ, హ్యాండ్ బాల్‌లో 14, కబడ్డీలో 29, ఖోఖోలో 7, సాఫ్ట్‌బాల్‌లో 11 టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. క్రీడాకారులకు ఆర్ట్స్, పీజీ కళాశాల ఎంబీఏ విభాగాల్లో వసతి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పోటీలను కేయూ ఇన్‌చార్జి వీసీ బుర్ర వెంకటేశం, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు పాల్గొని పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్, పీడీ డాక్టర్ భాస్కర్, పీఆర్వో డాక్టర్ ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బకాయి 523.84 కోట్లు

మహదేవపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీ లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బకాయి రూ. 523 కోట్ల 84 లక్షల 676 పేరుకుపోయింది. 2019 జూన్ 21న ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 163 టీఎంసీల నీళ్లను దిగువకు ఎత్తిపోశారు. పంప్‌హౌస్ ప్రారంభం నుంచి ఈఏడాది ఆగస్టు వరకు విద్యుత్ బిల్లు మొత్తం రూ.833 కోట్లు పేరుకుపోగా అందులో రూ. 320 కోట్లు చెల్లించారు. ఇంకా 513 కోట్లు చెల్లించాల్సి ఉండగా సెప్టెంబరు బిల్లు రూ.10.84 కోట్లు వచ్చింది. ఇలా విద్యుత్ శాఖకు ఇంకా రూ. 523.84 కట్టాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు.


'పెండింగ్ పనులు పూర్తి చేయాలి'

హసన్‌పర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యాలయ పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయాలని జడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని తెలంగాణ బాలికల గురకుల విద్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. గురుకులంలో పనిచేస్తున్న సిబ్బంది, విద్యార్థినుల వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను, భోజన వసతులతో పాటు విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని, వంటగదిని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పెండింగ్ పనులను పరిశీలించారు. మిగిలిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

▸▸ డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీల్లో నగరంలో నిర్వహించనున్న అండర్-19 జూనియర్ కళాశాలల స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని హనుమకొండ డీవైఎస్‌వో, అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి గుగులోత్ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం హనుమకొండ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో అండర్-19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీల నిర్వహణపై జిల్లాలోని ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ)లు, కోచ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తొలి విడతగా ఈ నెల 25, 26, తేదీల్లో క్రీడా పోటీల నిర్వహణ ఉంటుదని, అదే విధంగా 28, 29 తేదీల్లో రెండో విడతగా నగరంలో అండర్-19 జూనియర్ కళాశాలల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. త్వరలోనే క్రీడా పోటీల వివరాలను వెల్లడిస్తామని దీనికి జిల్లా లోని పీడీలు కోచ్‌ల సహాయ సహకారాలను అందించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు గోపాల్, డాక్టర్ శ్రీధర్, సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, పీడీలు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

రైల్వే సొరంగ మార్గంలో లీకేజీలు!




సొరంగ మార్గంలో లీకేజీ అవుతున్న స్లాబ్

▸▸ స్లాబ్ నుంచి నీరు లీకై పట్టాలపైకి

▸▸ అప్రమత్తం కాకుంటే ఇబ్బందే..

కాజీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాజీపేట-హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య కోమటిపల్లి సమీపంలో నిర్మించిన రైల్వే సొరంగమార్గం ప్రారంభమై నెలరోజులైనా గడవకముందే అప్పుడే లీకేజీలు మొదలయ్యాయి. ఈ మధ్య కురిసిన చిన్నపాటి వర్షానికే నీరు లీకై రైల్వే ట్రాక్‌లపై పడటంతో రైల్వే ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటసారిగా సుమారు రూ. 30 కోట్లతో రైల్వే శాఖ ఓ చాలెంజింగ్‌గా సొరంగ మార్గం నిర్మించిన సంగతి తెలిసిందే. 350 మీటర్ల మేర నిర్మించిన ఈ సొరంగమార్గంపై 4ఫీట్ల స్లాబ్ దానిపై మట్టి, కంకర, పైన పట్టాలపై ట్రాక్ అనుసంధానికి ఏర్పాటుచేసిన సిమెంట్‌దిమ్మెలు, ఇన్ని మరమ్మత్తులు చేసి నిర్మించిన స్లాబ్‌నుంచి చిన్నిపాటి వర్షానికే నీరులీకై నీరు కిందివరకు రావడంపై పలు విమర్శలు తలెత్తుతున్నాయి. ఒకవేళ భారీ వర్షాలు వరదలు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ సొరంగ మార్గం ప్రత్యేకత ఏంటంటే ఏక కాలంలో పైనుంచి, కిందనుంచి రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సొరంగమార్గాన్ని రైల్వే అధికారులు అప్రమత్తమై ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



సొరంగ మార్గంలో లీకేజీ అవుతున్న స్లాబ్

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

వర్ధంతి కార్యక్రమంలో వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆది కవి వాల్మీకి జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ సత్యశారద అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కృషి ఉంటే మనుషులు రుషులవుతారని చరిత్ర చెబుతోందని, ఈ రోజు మనం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామన్నారు. మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడిచి తమ జీవిత లక్ష్యాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అందరికి అనుసరణీయమైన రామాయణం రచించిన గొప్ప కవి అని కొనియాడారు. జ్ఞానం ఎవరి సొత్తు కాదని కృషి చేస్తే జ్ఞాన సముపార్జన ఎవరికైనా సాధ్యమేనని అది వాల్మీకి విషయంలో నిరూపితమైందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, వాల్మీకి సంఘం నాయకులు సాంబశివరావు, ఐలయ్య, అధికారులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో...

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వాల్మీకి ఆచరించిన ఆదర్శాలను మనం ఆచరించాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాంరెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బోయ వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

భారతీయ సాహిత్యానికి వాల్మీకి కృషి మరువలేనిది

శంభునిపేట (ఆంధ్రజ్యోతి) : భారతీయ సాహిత్యానికి వాల్మీకి చేసిన కృషి మరువలేనిదని టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రామ్ ప్రకాశ్ అన్నారు. మామునూరు బెటాలియన్‌లో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి రామ్ ప్రకాశ్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కవులు వాల్మీకిని ఆదర్శంగా చేసుకొని సమాజానికి అవసరమైన రచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్ఐలు శోభన్, రవి, కిరణ్, సర్వర్, చంద్రన్న, పురుషోత్తం రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుమాములలో..

వరంగల్ టౌన్ (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏనుమాములలో వాల్మీకి బోయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబశివరాజు ఆధ్వర్యంలో మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు నిగ్గుల ఐలయ్య, పెనుకుల సదానందం, కుమారస్వామి, రాజు, రమేష్, రామచంద్రం, సాంబయ్య, మల్లయ్య, అనిల్, రవిచంద్రప్రసాద్, శ్రవణ్, వినయ్, కిరణ్ చందు, నిగ్గుల మొగిలి, క్రాంతి, సందీప్, బండ రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

మహాకవి వాల్మీకి ఆధ్యాత్మిక యుగానికి వారసుడు

55వ డివిజన్‌లో..

హసన్‌పర్తి, అక్టోబర్ 17, (ఆంధ్రజ్యోతి): మహాకవి వాల్మీకి మహర్షి మన ఆధ్యాత్మిక యుగానికి వారసుడని 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లుయాదవ్ అన్నారు. గ్రేటర్ 55వ డివిజన్ భీమారం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ధర్మమార్గాన్ని అనుసరించమని ప్రపంచానికి సందేశం ఇచ్చిన మహాకవి వాల్మీకి మహర్షి అని అన్నారు. రామాయణం ద్వారా ఆయన అందించిన జ్ఞానం యుగయుగాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు శ్రీధరాచార్యులు, సంఘం అధ్యక్షుడు ముచ్చ సుధాకర్, గోపర బోయిన రవీందర్, సాంబయ్య, సదానందం, బండ రాజు, చందు, జయంతు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్‌లో ..

హనుమకొండ టౌన్, అక్టోబర్ 17 : మహర్షి వాల్మీకి జయంతిని గురువారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు వాల్మీకి చిత్రపటానికి సీఎండీ వరుణ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి. అశోక్‌కుమార్, టి. సదరల్‌లాల్, వి. తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు తిరుమల్‌రావు, రాజుచౌహాన్, కిషన్, రవీంద్రనాథ్ అశోక్, కె.ఎన్ గుట్ట, బికంసింగ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

వడ్డెపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని న్యాయవాది రేట్లపల్లి రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడా మైదానాలు, కనీస సౌకర్యాలు లేకుండానే ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు సంస్థలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. జిల్లా విద్యాధికారులు స్పందించి ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు.

ఆలస్యంగా వస్తే సీఏలు నిలిపివేత

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య

బాలసముద్రం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయానికి రావడంలేదని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. కార్యాలయానికి ఆలస్యంగా వస్తే లేట్ అటెండెన్సు ద్వారా ఉద్యోగులకు సీఏలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. గురువారం చింతగట్టు నీటిపారుదల శాఖలోని సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక యాప్ ద్వారా అటెండెన్సు రిజిస్టర్‌ను కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాటు చేశారు. దీంతో ఆలస్యంగా వచ్చే ఉద్యోగులు ఇక నుంచి సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని నీటిపారుదాల శాఖ ఉన్నాతాధికారులు ఆంధ్రజ్యోతికి తెలిపారు. సర్కిల్ కార్యాలయంతో పాటు పరకాల, వర్ధన్నపేట, హనుమకొండ ఇతర డివిజన్ల పరిధిలో కూడా లేట్ అటెండెన్స్ ఏర్పాటు చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

బరుపాటి గోపికి డాక్టరేట్



మట్టెవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏవీవీ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బరుపాటి గోపికి రాజస్థాన్‌లోని సన్‌రైజ్ వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్‌ను ప్రకటించింది. డాక్టర్ నల్లెల్ల శ్రీనివాస్, ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో గోపి పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. డాక్టర్ రాజ్‌కుమార్‌శర్మ, డాక్టర్ వర్తికా చేతులమీదుగా గోపి గురువారం డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గోపిని ఏవీవీ కాలేజీ సెక్రటరీ డాక్టర్ చంద విజయ్ కుమార్, ఏవీవీ కాలేజీ లైఫ్‌టైమ్ మెంబర్ చంద శ్రీకాంత్, ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్‌రెడ్డి, వెన్న, కొమురెల్లి, నిమ్మ మోహన్‌రావు అభినందించారు.

22, 23న చదరంగ ఎంపిక పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సారయ్య

కాశిబుగ్గ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగ సమైక్య ఆధ్వర్యంలో ఈనెల 22, 23న అండర్-15 రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమైక్య కార్యదర్శి కార్యదర్శి కన్నా తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. పోటీలను హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ఎదురుగా ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు కన్నా తెలిపారు. ఇందులో గెలుపొందిన నలుగురు చొప్పున బాలబాలికలు నవంబర్‌లో తమిళనాడులో జరిగే జాతీయ స్థాయిలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి1, 2009 నుంచి ఆ తర్వాత జన్మించిన వారు అర్హులని వివరించారు. ఆసక్తి గల వారు ఈనెల 20లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్, కాంగ్రెస్ నేత రవి, సమైక్య సభ్యులు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

మట్టెవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అన్నారు. గురువారం వరంగల్ ఆర్ఎంపీ రోడ్‌లోని దుకాణ యజమానులు, వరంగల్ చౌరస్తా, ఆర్ఎన్‌టీ రోడ్డులోని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్కింగ్, ట్రాఫిక్ రూల్స్ గురించి వివరించారు. వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్‌లోని బైక్ పార్కింగ్ కోసం రెడ్‌లైన్ వేసినట్లు తెలిపారు. వాహనదారులు ఈ గీత దాటి పార్కింగ్ చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను నిలపాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనదారులు సహకరించాలని తెలిపారు.

గోపాలపూర్‌లో ఉచిత వైద్య శిబిరం




రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హైదర్

వడ్డెపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని దేవరాజ్ కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్ ప్రారంభించారు. సమ్మయ్య నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ ఎండి హైమద్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీసెల్ జనరల్ సెక్రటరీ కందుకూరి పూర్ణచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వల్లాల రాజ్‌కుమార్‌గౌడ్, గూడెం రమేష్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో జంగా దంపతులు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి అమ్మవారిని స్టేట్ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న రాఘవరెడ్డి దంపతులు వల్లభ గణపతి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



భద్రకాళి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న జంగా రాఘవరెడ్డి దంపతులు

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

న్యూస్ బాక్స్

వరంగల్ లీగల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి) : వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా జడ్జి, హనుమకొండ జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి అపర్ణాదేవి న్యాయవాదులకు సూచించారు. రెండు రోజుల నిమిత్తం శరత్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి హనుమకొండ వారిచే నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని న్యాయమూర్తి గురువారం ప్రారంభించారు. 10 కోర్టుల భవనంలోని నూతన బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయమూర్తి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని కంటి పరీక్ష చేసుకోవాలని న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, కోర్టు పీసీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ , హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి లాడే రమేష్, సీనియర్ కార్యనిర్వాహక సభ్యులు సాంబశివరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు , న్యాయవాదులు, శరత్ కంటి ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు

వరంగల కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీఎం సెంటర్ శ్రీనివాస కాలనీలోని శృంగేరి శంకరమఠంలో గురువారం పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. భక్తులతో ఆశ్రమంలో వ్రతాలు నిర్వహించిన అనంతరం మంగళహారతి, తీర్థప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో శంకరమఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంపు

హనుమకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఈనెల 19వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి భీమారం శుభం కల్యాణ వేదికలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. మెడికోవర్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులతో పాటు శరత్ ఐ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డ్స్ వారి కుటుంబ సభ్యులకు అలాగే పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారి తెలిపారు.

ఎన్‌పీఆర్ నగర్‌లో చోరీ

ఆరు తులాల బంగారం అపహరణ

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేశాయిపేట శివారు ఎన్‌పీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంతెజార్‌గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశాయిపేట ఎన్‌పీఆర్ నగర్‌లో ఎస్‌కే హీనా సుల్తానా నివాసం ఉంటుంది. బుధవారం మధ్యాహ్నం దొంగలు ఇంట్లో చొరబడి 6 తులాల బంగారం, 45 తులాల వెండితో పాటు కొంత నగదు చోరీ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

మడికొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఎఎస్సై చంద్రమౌళి, హెడ్ కానిస్టేబుల్ రాంచందర్, కానిస్టేబుల్ సతీష్‌కుమార్‌తో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా మడికొండ శివారలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నట్లు గుర్తించారు. విషయాన్ని ఇన్‌స్పెక్టర్‌కు తెలపడంతో ఆయన ఎస్సై రాజబాబుతో కలిసి ఆ స్థలానికి చేరుకుని నలుగురు ట్రాక్టర్ డ్రైవర్లు రాపోలు విజయ్, దండ్లె ప్రసాద్, దారంగుల రాజు, ఎత్తరి కళ్యాణ్, జేసీబి డ్రైవర్ పల్లపు నాగరాజులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అలాగే నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

డిజిటల్ సర్వేకు వ్యతిరేకంగా ఏఈవోల నిరసన

బాలసముద్రం,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో డిజిటల్ పంట సర్వేకు వ్యతిరేకంగా ఏఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం శాంతియుతంగా నిరసన తెలిపారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రవీందర్‌సింగ్‌కు అందించారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ తక్కువ జీతంతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఈవోలు, ఏటీఎంఏల సిబ్బందిని డిజిటల్ పంట సర్వే చేయడంలేదని వ్యవసాయశాఖ ఉన్నాతాధికారులు పంపిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతీ మండల పరిధిలో శుక్రవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు, ఏపీఎంలు, సీసీలు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన వివరాలను ధాన్యం కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు, ఏపీఎంలు, వీవోలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ధాన్యం కొను గోలుకు సంబంధించిన డేటా ఎంట్రీ పక్కాగా చేయాలని, ప్రతీ రోజు ఆన్‌లైన్ లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రతీ రైతుకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం వివ రాలను కరెక్ట్‌గా నమోదు చేయాలన్నారు. ఒకవేళ ఒకదానికి బదులుగా మరొ కటి నమోదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొను గోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగేటట్టు చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబం ధించి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏపీఎంలు పాటించాల్సిన విధివిధానాలను అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగ పద్మజ, పౌరసరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

వదిలేదేలే!

(5వ పేజీ తరువాయి)

ఎల్ఆర్ఎస్ ఫ్లెక్సీలో జరిగిన తప్పుల తడక విషయంలో టౌన్‌ప్లానింగ్‌లో పని చేస్తున్న జీవన్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. అంతే కాకుండా ఇంజనీరింగ్ సెక్షన్‌లో రవి (సీనియర్ అసిస్టెంట్) ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా విధుల్లో కొనసాగుతున్నారు. టౌన్‌ప్లానింగ్ నుంచి హబీబ్ అనే ఉద్యోగికి హైదరాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఇంకా ఎవరిని భర్తీ చేయలేదు. దీంతో బల్దియా పరిధిలో తొమ్మిది మంది అధికారులు పని చేయాల్సి ఉండగా ఆరుగురు మాత్రమే పని చేస్తుండడంతో ప్రస్తుతం వారి విధులతో పాటు అదనపు విధులు నిర్వర్తిస్తున్న అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా నడుస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ప్రస్తుతం పని చేస్తున్న సూపరింటెండెంట్లు సమయపాలన పాటించడం కాదు గదా కనీసం విధులకు హాజరైనట్టు బయోమెట్రిక్ వేలిముద్రలు కూడా వేయడం లేదనే విమర్శలున్నాయి.

వీరే బల్దియాలో లీకు వీరులు..

ప్రస్తుతం బల్దియా పరిధిలో పని చేస్తున్న కొందరు పర్యవేక్షణ అధికారులు కార్యాలయంలో జరుగుతున్న సీక్రెట్ జీవోలు, ఫండ్స్, రహస్యాలు బయటికి లీకులు ఇస్తూ అందరికి మంచి వారిలా నటిస్తున్నట్టు తెలుస్తోంది. ఓ విభాగంలో పని చేసే అధికారి ఆ విభాగానికి సంబంధించిన అధికారుల రహస్యాలు, వాహనాలు, చెత్త తరలింపు విషయాలు బయటకు చేరవేస్తున్నట్టు సమాచారం. అంతే కాకుండా ఆ వింగ్‌లో డీజిల్ అక్రమ విక్రయం, పక్కదారిలో వాడకం అంతా తానై చూసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇంకా నెలవారీగా కార్మికులకు సమయానికి చేయాల్సిన జీతాలు చెల్లించడంలో జాప్యం చేస్తున్నట్టు తెలుస్తోంది. కొందరి నుంచి అడ్డదారిలో డబ్బులు దండుకుని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేయకున్నా అడ్డదారిలో డబ్బులు చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. చాలా రోజులుగా విధులకు హాజరు కాని వారిని ఫోన్ చేసి పిలిచి డబ్బులు ఇస్తే జీతం చేస్తానని ఒప్పందం కుదుర్చుకుని వచ్చిన జీతంలో వాటాలు వేసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇంకా ఓ అధికారి అధికారులకు ఉపయోగించే ట్యాక్సీ వాహనాల వాడకంలో అడ్డదారులు తొక్కి తనకు అనుకూలంగా ఉన్న వారు, నెల వారిగా డబ్బులు ఇచ్చే వారి వాహనాలనే అధికారుల వద్ద ఎంగేజ్ చేస్తున్నాడు. ఇంకా కొందరు అధికారులు సొంత వాహనాలు వాడుతున్నా వారి వాహనాలకు నెల వారిగా రూ. 32 వేల బిల్లులు చేసి అధికారుల మన్ననలు పొందుతున్నాడు. ఇలా బల్దియాలో పని చేసే ప్రతీ పర్యవేక్షణ అధికారిపై ఆరోపణలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. ఓ అధికారి తనకు ఇక్కడ బోర్ కొడుతుంది ఎక్కడికైనా బదిలీపై పంపించండి బాబోయ్ అంటున్న బదిలీలు చేయడం లేదని మొత్తుకుంటున్నాడు.

మెరుగైన విద్యుత్ సేవలందించాలి

శంభునిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని విద్యుత్ అధికారులను రంగశాయిపేట కాలనీల అభివృద్ధి కమిటీ బాధ్యులు కోరారు. ఎన్పీడీసీఎల్ రంగశాయిపేట ఏఈగా నల్లెల్ల రవి కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం రవీందర్ ఆధ్వర్యంలో ఏఈని సత్కరించారు. కాలనీల్లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల అధ్యక్షులు సుభాష్ రావు, శ్రీనివాస్ గుప్తా, జువ్వాజీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా ఉపాధ్యాయులంతా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి పెండెం రాజు కోరారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా యూటీఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరారు. సంఘం జిల్లా కోశాధికారి డి. కిరణ్‌కుమార్, కార్యదర్శి కె. మోజెస్, హెడ్మాస్టర్ రామారావు, ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ సభ్యత్వాల నమోదు

మిల్స్‌కాలనీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. గురువారం వరంగల్ చౌరస్తాలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాసు శిల్ప ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, రత్నం సతీష్ పలువురికి సభ్యత్వ రసీదులను అందజేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 57 వేల మంది స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వాలు పొందినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్, మహిళా మోర్చా నాయకులు స్వర్ణజ, రాజేశ్వర్, ఉష, సరస్వతి, స్వరూప, దేవిక, అపర్ణ, శర్య తదితరులు పాల్గొన్నారు.

విండ్రో కంపోస్ట్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 17: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లలో ఉన్న పార్కులలో విండ్రో కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఉద్యానవన శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు సమర్థవంతంగా పని చేసేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బల్దియా నిర్వహిస్తున్న పార్కులలో విండ్రో కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటుతో పాటు వర్మి కంపోస్ట్ యూనిట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పార్క్‌లలో పచ్చదనం, పరిశుభ్రత కనిపించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బంది తప్పకుండా సమయ పాలన పాటించాలని చెప్పారు. ఎస్ఈ రాజయ్య, హార్టికల్చర్ అధికారి రమేష్, హార్టికల్చర్ అధికారులు ప్రిన్సి, అశ్విని, అనూహ్య, ప్రవళిక పాల్గొన్నారు.



ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

కొమురంభీం స్ఫూర్తితో హక్కులను సాధిస్తాం

ఆదివాసీ నేత ప్రొఫెసర్ ఈసం నారాయణ

కేయూ క్యాంపస్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం కొమురంభీం స్ఫూర్తితో హక్కులను సాధించుకుంటామని ఆదివాసీ నేత, కేయూ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. గురువారం కేయూ మొదటి గేటు వద్ద ఆదివాసీ విద్యార్థుల నేతృత్వంలో కొమురంభీం వర్ధంతిని నిర్వహించారు. కొమురంభీం చిత్రపటానికి పూల మాల వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆదివాసీ నేత, కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ ఆది వాసీల అభివృద్ధికి కమిషన్ వేసి విద్య, అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయి ంచాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను మైదాన ప్రాంతాల వారితో పోటీ పడి ఎదిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్ మొరె, ఆదివాసీ విద్యార్థి ఉద్యమ నేతలు సాయి, అనిల్ పాల్గొన్నారు.

● గిర్మాజిపేట (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ స్ఫూర్తిగా పోరాడాలని సామాజిక ఉద్యమ నాయకుడు సోమ రామ్మూర్తి పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ నగరంలోని అబ్బనికుంటలోని తెలంగాణ రైతు సంఘం భవనంలో సోమ రామ్మూర్తి, సోమిడి శ్రీనివాస్ ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు అంశాల రెడ్డి, జిల్లా కోశాధికారి రవీందర్, ఎఐకేఎఫ్ జిల్లా నాయకులు నగేష్, జిల్లా కమిటీ సభ్యులు పేరయ్యబుచ్చిరెడ్డి,రాజేశ్వర్‌రావు, లడే మోహన్‌రావు,సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



కొమురంభీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ఈసం నారాయణ తదితరులు

కాలగర్భంలో కలుస్తున్నాయ్..

అధ్వానస్థితిలో కాకతీయుల కాలం నాటి బావులు

- చెత్తా చెదారంతో నింపేస్తున్న స్థానికులు
- పురాతన కట్టడాల రక్షణ మరిచిన అధికారులు



చెత్తా చెదారంతో నిండిపోయిన మధ్యకోటలోని కోడికూత బావి



ముళ్ల పొదలతో నిండి ఉన్న సింగారపు బావి

ఖిలావరంగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లు అంటేనే కాకతీయుల నాటి కళా సంపదకు నిలయం. నాటి కాలంలో నిర్మించిన ఎన్నో ఆలయాలు, సరస్సులు, బావులు పర్యావరణ, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. క్రీ.శ 11వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు దక్షిణ దేశాన్ని పరిపాలించిన కాకతీయ రాజులు.. తమకు రక్షణగా ఉండేందుకు మట్టి, రాతికోటలు, దేవాలయాలు, చెరువులు, బావులను తవ్వించారు. ఆ సమయంలో వరంగల్ ఉమ్మడి జిల్లాతో పాటు వరంగల్ కోటలో అనేక బావులను తవ్వించారు. వాటిలో రామప్ప, లక్నవరం, పాకాల, ములుగు, ఘణపురం, భద్రకాళి, గుండు చెరువులతో పాటు రాతి, మట్టికోటల చుట్టూ కందకాలను తవ్వి వాటిలో నీటిని నింపేవారు. అలాగే ఖిలావరంగల్ దిగుడు, మెట్లు, సింగారపు, కోనేరు తదితర బావులను నిర్మించారు. వాటిలో సంవత్సరం అంతా నీరు ఉండేదని పెద్దలు చెబుతున్నారు. ఇక రాజులు స్నానాలు చేయడానికి ఖిలావరంగల్ మధ్యకోటలో సింగారపు బావి, శివనగర్‌లో మెట్లు, కోడికూత, సవతులు, అక్కాచెల్లెళ్ల, గడియారం, అవుసుల, ఈసన్న, తలుపుల, తదితర బావులున్నాయి. ప్రస్తుతం ఖిలావరంగల్ మూడు కోటల్లో జనాభా విస్తరణ కావడంతో జనావాసాల మధ్యలో ఉన్న కోడికూత, ఈసన్న, తలుపుల, అవుసుల బావులను పట్టించుకునే వారు లేకపోవడంతో స్థానికులు ఇష్టారీతిన చెత్తాచెదారం వేస్తున్నారు. దాంతో పాటు వాటిలో, వాటి చుట్టూ చెట్లు, ముళ్లపొదలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. పర్యాటకులు అందులోకి వెళ్లి బావులను చూసేందుకు భయపడే పరిస్థితి ఉంది. ఇలా పురాతన కాలం నాటి బావులు కాలగర్భంలో కలిసి, ఆనవాళ్లు లేకుండా పోవడం పట్ల పర్యావరణ, పర్యాటక ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతన కాలంనాటి చెరువులు, బావులను పరిరక్షించి ముందుతరాలకు అందించాల్సిన అవసరం ఉందని పర్యాటక, చరిత్రకారులు, పెద్దలు కోరుతున్నారు.



ఖిలావరంగల్ కాపువాడలో ఉన్న ఈసన్నబావి చెత్తతో నిండిపోయిన దృశ్యం

సూచిక బోర్డులు, దారులను ఏర్పాటు చేయాలి



తోట రాజు, ఖిలావరంగల్

ఖిలావరంగల్ ప్రాంతానికి వచ్చే దారిలో సూచికబోర్డులను ఏర్పాటు చేసి, చారిత్రక ప్రసిద్ధి చెందిన దేవాలయా లు, కట్టడాలు, బావులకు దారులను నిర్మించాలి. దీంతో దేశ, విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

చారిత్రక కట్టడాలు, బావులను పరిరక్షించాలి



ఎండీ. సలీంఖాన్, మధ్యకోట

పర్యాటక ప్రదేశాలకు కేంద్రమైన కాకతీయుల కట్టడాలు, ఆలయాలు, చెరువులు, బావులను రక్షించి ముందు తరాలకు అందించాలి. లేదంటే వేల సంవత్సరాల చరిత్ర కలిగిన అద్భుత కట్టడాలు, చెరువులు, బావులు కాలగర్భంలో కలిసి పోతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పురాతన కట్టడాలను పరిరక్షించేలా మరిన్ని పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.

కొండెక్కిన కొబ్బరి


- వర్షాలు, గాలిదుమారాలతో తగ్గిన దిగుమతి
- రకం, సైజును బట్టి ఒక్కో కాయ రూ.35కి వి క్రయం
- ఉమ్మడి జిల్లాకు తమిళనాడు నుంచి వస్తున్న సరుకు
- కొబ్బరి బొండాల ధరలూ పెరిగిన వైనం





వరంగల్ చౌరస్తా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పండుగలు, శుభ, అశుభకార్యాలు సందర్భం ఏదైనా.. ఆలయాల సందర్శనకు వెళ్లినా.. ప్రతీ ఒక్కరు ఉపయోగించేది కొబ్బరి కాయ. అసలు ఈ కొబ్బరికాయ లేనిదే ఏ కార్యక్రమం కూడా పరిపూర్ణత ఉండదని అందరి నమ్మకం. అలాంటి కొబ్బరి కాయ ధరలు కొండెక్కాయి. ఏకంగా 50 శాతం నుంచి 100శాతం వరకు ధరలు పెరిగాయి. ఇందుకు ఇటీవలి భారీ వర్షాలు, గాలిదుమారాలే కారణమని చెబుతున్నారు. భారీ వర్షాలతో ఆంధ్రా ప్రాంతంలోని భీమవరం, పాలకొల్లు ఇతర ప్రాంతాల్లో పంటకు తీవ్ర నష్టం జరుగడంతో కొబ్బరికాయల ఉత్పత్తి తగ్గింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాపారులు తమిళనాడు నుంచి కాయను దిగుమతి చేసుకుంటున్నారు. తెలంగాణలోనే హైదరాబాద్ తర్వాత అతి పెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్న వరంగల్ బీట్ బజార్ మార్కెట్‌కు గతంలో ఏపీ నుంచి నిత్యం 8 లారీల్లో దాదాపు 2లక్షల కొబ్బరికాయలు వచ్చేవి. అందులో నిత్యం దాదాపు 80 శాతం అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం ఏపీ నుంచి దిగుమతి సగానికి తగ్గింది. ఇక వారం రోజుల నుంచి తమిళనాడులో కూడా భారీ వర్షాలు వస్తుండటంతో కొబ్బరి పంటకు నష్టం వాటిల్లి అనుకున్నంత సరుకు ఇక్కడికి రావడం లేదు. దీంతో రోజుకు రూ.30లక్షల మేర జరిగే వ్యాపారం కాస్తా కుంటుపడింది. రెండు నెలల క్రితం నాలుగు రకాల సైజుల్లో ఉండే కొబ్బరికాయలకు ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.20 వరకు వి క్రయించే వారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆ ధరలు రూ.15 నుంచి రూ.35కు పెరిగాయి. మరోవైపు కొబ్బరిబొండాల ధరలు కూడా అంతే ఉన్నాయి. గతంలో సైజు, రకాన్ని బట్టి ఒక్కో బొండాం రూ.15 నుంచి రూ.20 వరకు వి క్రయించే వారు. కానీ ఇప్పుడు ఏర్పడిన కొరత కారణంగా రూ.40వరకు అమ్ముతున్నారు.

శ్రమైక జీవన సౌందర్యం.. నిండు చంద్రుడి సోయగం..



శ్రమైక జీవన సౌందర్యానికి.. నిండు పౌర్ణమి చంద్రుడి సోయగం తోడైతే.. ఆ సుందర దృశ్యం కళ్లముందు ఆవిష్కృతమైతే పరవశించని మనసుంటుందా. చూడముచ్చటైన ఆ ప్రకృతి గీసిన సహజ రూపాన్ని స్వీకరించని, ఆస్వాదించని హృదయం ఉంటుందా. పున్నమి వేళ.. సంధ్యాసమయాన.. చంద్రకాంతి వెదజల్లుతున్న వేళ ఇదిగో ఇలా ఓ గీత కార్మికుడు కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతూ అద్భుత దృశ్యానికి ఆయువు పోశాడు. ఈ అపురూప చిత్రం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం గట్టుకిందిపల్లి వద్ద ఆవిష్కృతమైంది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

వైభవంగా గోదావరి హారతి

మహదేవపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో గోదావరి హారతి కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం నుంచి అర్చకులు, ఆలయ నిర్వాహకులు మంగళవాయిద్యాలతో గోదావరి ఒడ్డుకు చేరుకొని హారతి ఇచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ ధర్మకర్త శ్యాంసుందర్, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు, అన్నమయ్య సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. దేవాదాయశాఖ ఆదేశాలమేరకు ప్రతి పౌర్ణమికీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

రంగనాథుడిని తాకిన సూర్య కిరణాలు



రంగనాథ స్వామిపై పడిన సూర్యకిరణాలు

కాశిబుగ్గ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని రంగనాథ ఆలయంలో స్వామిపై గురువారం సూర్యకిరణాలు పడ్డాయి. ఉదయం 6.30గంటల ప్రాంతంలో సూర్యకిరణాలు పడ్డ విషయం స్థానికులకు తెలియడంతో భక్తుల రద్దీ పెరిగింది. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాస్, కవిత, ప్రకాష్‌రెడ్డి, ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.



వరంగల్ 27వ డివిజన్‌లో పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్, భక్తులు

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

గిర్మాజిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం 27వ డివిజన్‌లోని గోవిందరాజుల గుట్ట ప్రాంతంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో స్థాని క కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ముదిరాజ్‌లు బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు తలపై బోనాలు పెట్టుకుని పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులను చల్లంగా చూడాలంటూ తల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సునీల్ కుమార్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, అర్బన్ అధ్యక్షుడు బి.స్వామి, ముదిరాజ్ నాయకులు ఆదినారాయణ, మహేష్, చందర్, నర్ర శివ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రికెట్ జట్టు

కాశిబుగ్గ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక గురువారం ముగిసింది. రెండు రోజులుగా సీకేఎం కళాశాల మైదానంలో కార్యక్రమం నిర్వహించారు. వరంగల్, హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల జట్లను ఎంపిక చేశారు. ఈ జట్లు ఈనెల 20 నుంచి 23 వరకు జరిగే అండర్- 23 లీగ్ కమ్ నాకౌట్ పోటీల్లో పాల్గొననున్నట్లు వరంగల్ ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో రాణించిన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ కేంద్రంగా నవంబర్ 4నుంచి 6వరకు జరిగే అండర్-23 అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపికవుతారని వివరించారు.

కేయూకు రెగ్యులర్ వీసీ?

- నేడో, రేపో ఉత్తర్వుల జారీకి అవకాశం
- నియామకంపై కొనసాగుతున్న ఉత్కంఠ

కేయూ క్యాంపస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీకి ఈసారి రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ నియామకం జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇటీవలి వరకు కేయూ ఇన్‌చార్జ్ వీసీగా విధులు నిర్వహించిన ఐఏఎస్ అధికారి వాకాటి కరుణ ఏపీకి వెళ్లిపోవడంతో కేయూ వీసీ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. అయితే కేయూ వీసీ పోస్టులోకి రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా మరొకరిని నియామిస్తారని శుక్రవారం రాత్రి వరకు వర్సిటీ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూశాయి. కానీ చివరి నిమిషంలో విద్యాశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం నేడో, రేపో కాకతీయ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమిస్తామని, ఇంతలో ఇన్‌చార్జ్ వీసీగా మరొకరిని నియమించాల్సిన అవసరం లేదని అన్నట్లు సమాచారం. అదే సమయంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నేడో, రేపో కచ్చితంగా రెగ్యులర్ వీసీని నియమిస్తుందని, ఇన్‌చార్జ్ వీసీ అవసరం లేదని, రెగ్యులర్ వీసీ వచ్చే వరకు తాత్కాలికంగా చూసుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఈ లోపు ఏదైనా అత్యవసరమైన సమాచారం ఉంటే తన దృష్టికి తేవాలని ఆదేశాలిచ్చారని సమాచారం. ఏదేమైనా వర్సిటీ చరిత్రలో వీసీ లేకపోవడం చర్చనీయంగా మారింది.

ఆడించే వారేరీ?

- క్రీడలకు నోచుకోని ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు
- 50 జూనియర్ కళాశాలల్లో ఒక్కరూ లేని వైనం
- ఉమ్మడి జిల్లాలో 17 డిగ్రీ కాలేజీల్లో నలుగురే పీడీలు
- అధ్యాపకులతోనే నామమాత్రంగా ఆటల నిర్వహణ



మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుల్లోనే కాదు.. క్రీడారంగంలోనూ రాణించాలని పాలకులు తమ ప్రసంగాల్లో ఊదరగొడుతుంటారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం సొంతమవుతుందంటారు. అలాంటి క్రీడల నిర్వహణకు, క్రీడా రంగం అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నారు. కానీ అది ఆచరణలో మాత్రం అమలవుతున్నట్లు కనిపించడం లేదు. అందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఆటలు ఆడించే వారే కనపడకపోవడమే నిదర్శనం. మొత్తం 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలుండగా, మూడు కళాశాలల్లో మాత్రమే ఫిజికల్ డైరెక్టర్‌లున్నారు. కాగా, కొన్ని కళాశాలల్లో పోస్టులే మంజూరు కాకపోవటంతో పాటు మొత్తంగా 14 కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవటం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఒక్క కళాశాలలో కూడ ఫిజికల్ డైరెక్టర్లు లేరంటే అతిశయోక్తి కాదేమో. అన్ని కళాశాలలకు నామ్‌కే వాస్తేగా అధ్యాపకులతోనే క్రీడలు నిర్వహిస్తున్నారు. జిల్లాల ఏర్పాటు తర్వాతనైనా ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారిస్తారనుకుంటే కొత్త జిల్లాలు ఏర్పడి కూడా రెండేళ్లు పూర్తికావస్తున్నా ఒక్క కళాశాలకు పీడీని నియమించలేక పోయారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ, జూనియర్ కళాశాలకు ఇచ్చిన క్రీడా సామాగ్రి వినియోగంలో లేక మూలకు పడింది.

క్రీడా మైదానాలు సరే.. ఆడించే వారేరీ?

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో కొత్తగా ఏర్పడిన మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల పరిధిలో 17 డిగ్రీ, 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ప్రతీ కళాశాలకు రూ.లక్షల విలువగల క్రీడావస్తువులను సరఫరా చేసినప్పటికి ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)లను నియమించలేదు. పాఠశాల స్థాయిలో క్రీడారంగంలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణించి పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్, డిగ్రీ విద్య కోసం కళాశాలల్లో చేరిన విద్యార్థులకు కళాశాలల్లో క్రీడలు నిర్వహించకపోవటంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యాబోధనతో పాటు క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు కళాశాల కీలకదశ అని చెప్పుకోవచ్చు. క్రీడాకారులు ఉన్నతచదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో స్పోర్ట్స్ కోటాలో సీట్లు సాధించుకునే అవకాశం ఉంటుంది. కళాశాలల్లో క్రీడల్లో తర్ఫీదు నిచ్చే పీడీలు లేకపోవడంతో విద్యకే పరిమితం కావాల్సి వస్తోంది. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా అవకాశం లేకవారి భవిష్యత్ చేజార్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. క్రీడలకు పుట్టినిల్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి పరిస్థితి నెలకొంటే ఇక మారుమూల ప్రాంత విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతోంది. ఇప్పటికైనా పీడీలను నియమించి క్రీడాకారులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉంది. ఆదిశగా ప్రయత్నాలు చేయాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

కనిపించని క్రీడా వస్తువులు

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి కనబరుస్తున్నా గత ఎనిమిదేళ్లుగా క్రీడా వస్తువులు అందడంలేదు. వాలీబాల్, బాస్కెట్ బాల్, క్యారంబోర్డు, క్రికెట్ కిట్, చెస్, ఫుట్‌బాల్, షటిల్‌బ్యాట్లు, షాట్‌పుట్, జావలిన్ త్రో, టెన్నికాయిట్, డిస్కస్‌త్రో, టెన్నిస్‌బాల్,స్కిప్పింగ్ క్రీడల్లో విద్యార్థులు రాణిస్తున్నా ఆటలు ఆడించే వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడం దేవుడెరుగు. క్రీడలపై ఆసక్తి ఉన్న క్రీడాకారులు స్వతహాగా ఆడేందుకు కూడా క్రీడా కిట్లు అందుబాటులో లేకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు.

సొంత ఖర్చులతోనే వర్సిటీ స్థాయి పోటీలకు..

యూనివర్సిటీ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులు స్వంత డబ్బులతోనే వెళ్లి పోటీల్లో పాల్గొనాల్సి వస్తుందని వాపోతున్నారు. గతంలో క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులను కళాశాలలకు వచ్చే నిధుల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు తీసుకువెళ్లేవారు, అంతే కాకుండా క్రీడా డ్రెస్‌లను కూడా కళాశాలల నుంచే సమకూర్చేవారు. కానీ, అవేమి లేకపోవడంతో విద్యార్థులు సైతం ఆసక్తి చూపడంలేదనే విమర్శలు లేకపోలేదు.

క్రీడలకు నిధులు కేటాయించాలి



బి.అజయ్, మాజీ జాతీయ క్రీడాకారుడు, మహబూబాబాద్

క్రీడలకు నిధులు కేటాయించాలి. స్వరాష్ట్రంలోనైనా క్రీడలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి క్రీడా కారులను ప్రోత్సహించాలి. మానుకోట డివిజన్ క్రీడా కారులకు పుట్టినిల్లుగా పేరుగాంచింది. ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విద్యార్థులను క్రీడారంగంలో రాణించే విధంగా చూడాలి.

వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి



బొడ్డుపెల్లి ఉపేందర్, మాజీ జాతీయ ఖోఖో క్రీడాకారుడు, మహబూబాబాద్

క్రీడాకారులకు తర్ఫీదు నిచ్చేందుకు పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి. పాఠశాలలు, కళాశాలల్లో సాయంత్రం వేళల్లో క్రీడలకు సమయం కేటాయించాలి. వ్యాయామ ఉపాధ్యా యులులేక క్రీడలు నిర్వహించకపోవటంతో పాటు క్రమశిక్షణ కొరవడుతుంది. ప్రభుత్వం వ్యాయామ ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలి.

జిల్లాల వారీగా జూనియర్ కళాశాలలు, పీడీలు

జిల్లా	కళాశాలలు	పీడీల సంఖ్య
వరంగల్	11	0
హనుమకొండ	09	0
మహబూబాబాద్	10	0
జయశంకర్ భూపాలపల్లి	05	0
ములుగు	08	0
జనగామ	07	0
మొత్తం	50	00

జిల్లాల వారీగా డిగ్రీ కళాశాలలు, ప్రస్తుతం ఉన్న పీడీలు

జిల్లా	కళాశాలలు	పీడీల సంఖ్య
వరంగల్	05	01
హనుమకొండ	02	01
మహబూబాబాద్	05	0
జయశంకర్ భూపాలపల్లి	02	0
జనగామ	01	01
ములుగు	02	01
మొత్తం	17	04




వేడుక

గోదారి తీరంలో పద్మల్‌పూరి కాకో జాతర

తెలంగాణలో ఏకైక ఆదివాసీ గిరిజన దైవ మందిరం... పద్మల్‌పూరి కాకో అమ్మవారి దేవాలయం. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు దగ్గర... గోదావరి నది తీరాన ఉన్న ఈ ఆలయ పరిసరాలు ప్రతి ఏటా ఆశ్వయుజ పౌర్ణమి నుంచి జనసందోహంతో నిండిపోతాయి. దసరా అనంతరం వచ్చే పౌర్ణమి నాడు ఆరంభమయ్యే దండారీ, గుస్సాడీ ఉత్సవాలు దీపావళి అమావాస్య వరకూ అత్యంత వైభవంగా జరుగుతాయి. రాష్ట్రం నలుమూలల నుంచి గిరిజనులు కుటుంబసమేతంగా తరలివచ్చి, కాకో అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆదివాసీ-గోండు సంస్కృతిలో ఆటపాటలకు ఉన్న ప్రాధాన్యానికి ఈ వేడుకల్లో ప్రదర్శించే నృత్యాలు అద్దం పడతాయి. గిరిజన సంప్రదాయాలు, కట్టుబాట్లు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. కొత్తగా పెళ్లైన జంటలతో... ఆలయంలో అమ్మవారి ముందు 'భేటీ' (కొత్త కోడళ్ల పరిచయం) కార్యక్రమం నిర్వహిస్తారు. గిరిజనులు గోదారమ్మతల్లికి, నది పరీవాహక ప్రాంతాల్లో ఉండే దేవతలకు పూజలు చేస్తారు. అనంతరం సామూహిక విందు భోజనాలు చేస్తారు. ఉత్సవ దినాల్లో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయి.

గోదావరి ఒడిలో వికసించిన గిరిజన సంస్కృతి ఎంతో







ప్రాచీనమైనది, వైవిధ్యభరితమైనది. నాసిక్‌లో మొదలయ్యే గోదావరి నది పలు ప్రాంతాల మీదుగా ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తుంది. ఆ గమ్యం చేరేలోపు ఎన్నో గిరిజన ప్రాంతాలు, దేవాలయాల మీదుగా ముందుకు సాగుతుంది. గోదావరితో గిరిజనులది విడదీయరాని బంధం. అందుకే గోదావరి పరీవాహక ప్రదేశాన్ని 'ఆదివాసీల పుట్టినిల్లు' అని పిలుస్తారు.

పద్మల్‌పూరి కాకో దేవాలయం తెలంగాణలో ఆదివాసీల ఏకైక దేవాలయంగా ప్రసిద్ధి చెందింది. చాలా పురాతనమైన ఈ ఆలయం గుడిరేవు గ్రామానికి కిలోమీటర్ దూరంలో... గోదావరి తీరంలో ఉంది. గోండు, ప్రధాన్, కోలాం, తోటీ తదితర ఆదివాసీ తెగలవారు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, జైనూర్, గుడిహత్నూర్, ఇచ్చోడ, బోథ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, తిర్యాణితోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి గిరిజనులు ఇక్కడికి వస్తుంటారు. ఉత్సవాల సందర్భంగా పురుషులు తలపై నెమలి పింఛాలు అలంకరించుకొని చేసే గుస్సాడీ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మహిళలు సైతం తమ సంప్రదాయ పద్ధతిలో ఏకరూప దుస్తులు ధరించి నృత్యాలు చేస్తారు. దేవతలను కొలుస్తూ పాటలు పాడుతారు.

ఆలయ విశిష్టతలు....

పద్మల్‌పూరి కాకోబాయి ఆలయాన్ని సందర్శిస్తే కోరికలు నెరవేరుతాయనే నమ్మకం గిరిజనుల్లో ఉంది. ఉత్సవాలకు ఒకరోజు ముందుగానే ఇక్కడికి వచ్చి గోదావరి జలాలతో అమ్మవారికి అభిషేకం చేస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతియేటా దీపావళికి మూడు రోజుల ముందు దర్బార్ నిర్వహిస్తారు. అది ఈ నెల 28వ తేదీన జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, గుస్సాడీ, దండారీ నృత్యాల ప్రత్యేకతల గురించి, నెమలి పింఛం విశిష్టత గురించి తెలియజేస్తారు. ఈ ఆలయంలో నిష్ఠతో పూజలు చేస్తే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖ శాంతులు కలుగుతాయని, పాడి పంటలు, పశుసంపద పెంపొందుతాయని గిరిజనులు విశ్వసిస్తారు. పూర్వం దేవతా విగ్రహం ప్రాచీనమైన చెట్టుకింద కొలువు తీరి ఉండేది. ఆ తరువాత అన్ని హంగులతో ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం రెండు చోట్లా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో పుష్య మాసంలో 'పెర్సాపేన్' (జల్లిదేవర) పూజలు జరుగుతాయి.

అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు....

పద్మల్‌పూరి కాకో అమ్మవారి కోసం పిండి పదార్థాలతో గిరిజనులు ప్రత్యేక నైవేద్యాలు తయారుచేస్తారు. పెసలు, వినుములు, బబ్బెర (బొబ్బర్ల) గారెలు, దంచిన బియ్యంతో అరిసెలు తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. నువ్వులు, పల్లీలు గానుగ పట్టి తీసిన నూనెను వంటకాలకు ఉపయోగిస్తారు. మరికొందరు కోళ్లు, మేకలతో మొక్కులు తీర్చుకుంటారు.

• దేగ సత్యం, మంచిర్యాల.



గీతాసారం


ఆచరణతో మార్గదర్శకత్వం

ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి చిన్నపిల్లలు ఎప్పుడూ తమ తల్లితండ్రుల మార్గదర్శకత్వం కోసం చూస్తారు. తద్వారా కొత్త విషయాలు, మర్యాదలు, ప్రవర్తనలు తదితరాలను నేర్చుకుంటారు. మన మాటలకు, చేతలకు మధ్య సామరస్యంతో వారికి ఉదాహరణగా నిలుస్తూ ఉండడమే పిల్లల్ని పెంచడానికి ఉత్తమ మార్గం. ఆ తరువాత స్నేహితులు, ఉపాధ్యాయులు, సలహాదారుల్లాంటి వారి మీద వారు ఆధారపడడం కొనసాగుతుంది. అలాగే... మనమీద ఆధారపడే వ్యక్తులు, మార్గదర్శకత్వం కోసం మనవైపు చూసే వ్యక్తులు ఉంటారని కూడా ఇది సూచిస్తోంది. మనం ఏది చేసినా అది వారి మీద ప్రభావం చూపుతుంది. దీని గురించి శ్రీకృష్ణుడు చెబుతూ "శ్రేష్ఠమైన పురుషుడి ఆచరణనే (ప్రవర్తననే) ఇతరులు అనుసరిస్తారు. అతను నెలకొల్పిన ప్రమాణాలనే లోకులందరూ పాటిస్తారు" అన్నాడు. అలాగే "ఓ అర్జునా! ముల్లోకాలలో నాకు కర్తవ్యం అనేదే లేదు. అలాగే నేను పొందాల్సిన వస్తువుల్లో పొందనిది కూడా లేదు. అయినా నేను కర్మ



లలోనే ప్రవర్తిల్లుతున్నాను. ఎప్పుడైనా నేను కర్మలను విస్మరిస్తే లోకానికి గొప్ప హాని సంభవిస్తుంది. ఎందుకంటే మనుషులందరూ అన్ని విధాలుగా నన్నే అనుసరిస్తారు. నేను కర్మలను ఆచరించడం మానేస్తే లోకాల్లో అల్లకల్లోలాలు చెలరేగుతాయి. లోకాలన్నీ నశిస్తాయి. అంతేకాదు, ప్రజానష్టం వాటిల్లుతుంది. అప్పుడు వాటన్నిటికీ నేనే కారణమవుతాను" అని చెప్పాడు.

ఈ విషయాలన్నీ పరమాత్మ స్థాయి నుంచి మనకు శ్రీకృష్ణుడు తెలియజేస్తున్నాడు. సృష్టి, నిర్వహణ, విధ్వంసంతో కూడిన సృజనాత్మకత స్థాయి నుంచి బోధిస్తున్నాడు. ఒక రైతు విత్తనాలను నాటినప్పుడు అవి మొలకెత్తడానికి కారణం సృజనాత్మకత. సృజనాత్మకత ఆగిపోతే... విత్తనాలు వృథా అవుతాయి. మొలకెత్తిన తరువాత పంట ఎదగకపోతే... అది కూడా గందరగోళానికి దారి తీస్తుంది. పెరిగిన తరువాత పంట పండకపోతే... అది ముందు తరాలను నాశనం చేస్తుంది. ఇవన్నీ సృజనాత్మకత తన చర్యను ఆపివేస్తే ఎదురయ్యే పరిణామాలు. ఈ ఉదాహరణ ద్వారా... శ్రీకృష్ణుడు చెప్పినదాన్ని మనం అర్థం చేసుకోవడం సులభం అవుతుంది. ఈ విశ్వంలో కనిపించే, కనిపించని స్వయంచాలకత్వం మీద మన జీవితాలు పూర్తిగా ఆధారపడి ఉన్నాయి. సృజనాత్మకత ద్వారా అలసిపోకుండా జరుగుతున్న అనేక కార్యాల కారణంగానే మన మనుగడ సాధ్యమవుతోంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

తప్పుల్లో పాఠాలు...

చింతన




తప్పును తప్పుగా చూడనివాళ్ళు అదృష్టవంతులు. ఎందుకంటే... వాళ్ళు దాన్ని ఒక పాఠంగా తీసుకుంటారు. తప్పులు చెయ్యడం సర్వసహజమైన విషయం. కానీ ఆ తప్పు మీకు విలువైన పాఠం కావాలి. అదే తప్పు మళ్ళీ మళ్ళీ చేస్తున్నారంటే... మీరు ఇంకా పెద్ద తప్పు చేస్తున్నారని అర్థం. మనం చేసిన తప్పులు కాలం గడిచేకొద్దీ ఎన్నో కష్టాలకు, వేదనకూ కారణం అవుతాయి. మరి ఇది తెలిసినా కూడా తప్పు ఎందుకు చెయ్యాలి?

చెయ్యాల్సిన దాన్ని సరైన రీతిలో కాకుండా... అందుకు వ్యతిరేకంగా చెయ్యడాన్నే 'తప్పు' అంటారు. కొన్ని తప్పులు మనకు తెలియకుండానే జరిగిపోతూ ఉంటాయి. వాటిని గుర్తించి, ఎప్పటికప్పుడు పాఠాలు నేర్చుకుంటేనే మనం పురోగతి సాధించగలం. మనం చేసిన తప్పులు అందరికన్నా మనకే బాగా తెలుస్తాయి. "నేను అలా చెయ్యలేదు, నేను అమాయకుణ్ణి" అని మనం వాదించవచ్చు. వేరే వ్యక్తులమీదకు దాన్ని నెట్టేసి తప్పించుకోవచ్చు. కానీ అది చేసింది మనమేనని మన అంతరాత్మకు తెలుసు. కాబట్టి మిమ్మల్ని మీరు మోసగించుకోకండి. తప్పును అంగీకరించండి. అదే మిమ్మల్ని ఉన్నతులుగా మార్చుతుంది. అలాగే ఇతరుల్లో తప్పును ఎత్తి చూపడానికి ముందు... "నేను అలాంటి తప్పు ఎప్పుడైనా చేశానా? అతనికన్నా నేను ఎలా భిన్నమైన వ్యక్తిని?" అని ఆలోచించండి. ఆ వ్యక్తి చేసిన తప్పును పదే పదే ఎత్తి చూపడం కన్నా... అతను దాన్ని ఎలా సరిదిద్దుకోగలడో ఆలోచించండి. ఆ మార్గాన్ని అతనికి బోధించండి. ఇతరులు తప్పు చేస్తున్నారని పదే పదే ఆక్షేపించడం కూడా ఒక తప్పే. అలాగే వేరేవారిలో తప్పులు వెతకడం, సమయం, సందర్భం లేకుండా వాటి గురించి మాట్లాడడం కూడా తప్పే. ఒకే తప్పును మూర్ఖులు పదే పదే చేస్తూ ఉంటారు. వాటి నుంచీ పాఠాలను ఎన్నటికీ నేర్చుకోరు. తెలివైన వాళ్ళు తమ సొంత తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటారు. వివేకవంతులు ఇతరుల తప్పులను పాఠాలుగా స్వీకరిస్తారు.

• శ్రీశ్రీ రవిశంకర్

రక్షించేవి పూర్వ పుణ్యాలే

సుభాషితం



వనే రణే శత్రు జలాగ్ని మధ్యే
మహార్ణవే పర్వత మస్తకేవా
సుప్తం ప్రమత్తం విషమ స్థితిం వా
రక్షంతి పుణ్యాని పురాకృతాని... అంటూ మంచి కర్మలు చేయడం వల్ల కలిగే ఫలితాన్ని తన 'నీతి శతకం'లో భర్తృహరి వివరించాడు. ఆ శ్లోకాన్ని తెలుగులో...

కాననమున రణమున సలిలానల రిపు మధ్యమున
మహాబ్ధి నగాగ్ర
స్థానమున మత్తు నిద్రితుం
బూనికతో బూర్వపుణ్యములు
రక్షించున్... అని ఏనుగు లక్ష్మణ కవి అనువదించాడు.

భావం: మనిషి కీకారణ్యంలో ఉన్నా, యుద్ధంలో శత్రువులు చుట్టుముట్టి ఉన్నా, అగ్నిజ్వాలల మధ్య చిక్కుకుపోయినా, మహాసముద్రంలో మునిగిపోతున్నా, ఒళ్ళు తెలియని మత్తుతో నిద్రావస్థలో ఉన్నా పురాకృతమైన (అంతకు ముందు లేదా పూర్వజన్మలో చేసిన) మంచిపనుల వల్ల వచ్చిన పుణ్యమే అతణ్ణి కాపాడుతుంది. రోజులన్నీ ఒకేలా ఉండవు. కష్టాలు వస్తాయి. అలాంటి కష్టాలను తేలికగా అధిగమించాలంటే... ఎప్పుడూ మంచి పనులు చేస్తూ ఉండాలి.



సద్బోధ

సద్గురువు ఉండే చోటు

పూర్వం ఒక రాజు ఉండేవాడు. అతనికి పాలనా వ్యవహారాలతో, ఎత్తుగడలతో, ఆడంబరమైన జీవితంతో విసుగు పుట్టింది. ప్రశాంతత కోసం ఆధ్యాత్మికతవైపు అడుగులు వెయ్యాలనుకున్నాడు. ఒక రోజు "ఇక ఆలస్యం చెయ్యకూడదు. ఎలాగైనా సద్గురువును ఆశ్రయించాల్సిందే" అని నిర్ణయించుకున్నాడు. అప్పుడు అతనికి కొంతకాలం క్రితం తనను కలిసిన ఒక వృద్ధుడు "సద్గురువు అంటే అసలైన జ్ఞాని. అలాంటి వ్యక్తి అత్యంత సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు" అని చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే... అలాంటి వ్యక్తి కోసం రాజు అన్వేషణ మొదలుపెట్టాడు. ఎన్నో ఊర్లు తిరిగాడు, ప్రతి ఆలయాన్ని, ఆశ్రమాన్ని, మఠాన్ని గాలించాడు. ఎందరో ప్రసిద్ధ గురువులను కలిశాడు. కానీ వారిలో ఎవరూ తనకు జ్ఞానమార్గం చూపే సద్గురువుగా అతనికి అనిపించలేదు. ఎవరిలో చూసినా ఆడంబరం, అహంకారం కనిపించాయి. 'నాకు కావలసింది అహంకారంతో, ఆడంబరంగా మాట్లాడే పండితులు, శాస్త్రకోవిదులు కాదు. జ్ఞానజ్యోతిని దర్శించి, సత్యాన్నే మాట్లాడే సద్గుణ సంపన్నుడైన వ్యక్తి. అలాంటి వారు ఎక్కడా లేరు" అనుకొని, తిరిగి రాజధానికి చేరుకున్నాడు.

అంతకుముందు తనకు బోధ చేసిన వృద్ధుణ్ణి కలుసుకొని "మీరు మీ మాటలతో నన్ను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారు. మీ మాటలు నమ్మి ఏళ్ళ తరబడీ రాజ్యమంతా గాలించాను. సద్గురువులా అనిపించేవారు ఒక్కరూ కనబడలేదు" అన్నాడు.

అప్పుడు ఆ వృద్ధుడు "మహారాజా! మీరు ఏయే ప్రాంతాల్లో వెతికారో వివరంగా చెబుతారా?" అని అడిగాడు. రాజు తను వెతికిన మఠాలు, మందిరాలు, ఆశ్రమాల గురించి చెప్పాడు. అవన్నీ పేరు ప్రఖ్యాతులు కలిగిన గురువులు నివసించే స్థలాలే. అంతా శ్రద్ధగా విన్న ఆ వృద్ధుడు "మహారాజా వెతకరాని చోట వెతికి... విలువైన మీ సమయాన్ని వ్యర్థం చేసుకున్నారు. నిజమైన సద్గురువులు అతి సామాన్యులుగా ఉంటారని చెప్పాను కదా! వాళ్ళు అలాంటి వైభవోపేతమై ప్రదేశాల్లో ఎందుకుంటారు? ఏ వీధి మూలనో, పాడుబడిన ఇంటి సమీపంలోనో, చెత్తను పారేసే ప్రదేశాల దగ్గరలోనో ఉంటారు. ఎవరి నుంచీ ఎలాంటి ప్రత్యేక గౌరవాన్నీ ఆశించరు. దొరికిన తిండి తింటూ, అరకొర వస్త్రాలు ధరిస్తూనో, ధరించకుండానో జీవిస్తూ ఉంటారు" అన్నాడు.

ఆ వృద్ధుడి మాటలనే రాజు తలచుకుంటూ మరునటి రోజు ఉదయం తన మందిరం మేడ మీద కూర్చున్నాడు. వీధిలో వస్తూ, పోతూ ఉండేవారిని చూస్తున్నాడు. ఇంతలో ఒక యాచకుడు వచ్చాడు. రాజభవనం ప్రధాన ద్వారం ముందు నిలిచి భిక్ష అడుగుతున్నాడు. అతని నడకలో, మాటలో, చూపులో రాజుకు ఏదో ప్రత్యేకత కనిపించింది. మెట్లు దిగి వచ్చాడు. యాచకుడి ముందు నిలబడి, పలకరించాడు. ఇద్దరి మధ్య సంభాషణ నడిచింది. తను వెతుకుతున్న సద్గురువు అతనేననే జ్ఞానం రాజుకు కలిగింది. నిజానికి ఆ యాచకుడు రోజూ రాజమందిరం ముందుకు వస్తూనే ఉన్నాడు. ఇంతకాలం అధికార దర్పం, అహంకారం రాజు కళ్ళను కప్పేశాయి. ఆ యాచకుడిలోని జ్ఞానిని గుర్తించకుండా చేశాయి. ఒక సందర్భంలో ఈ కథను భగవాన్ రజనీశ్ (ఓషో) చెబుతూ "అహంకారాన్ని వదులుకొని, జ్ఞానం కోసం తపించిన రోజున సద్గురువు తనంతట తానే మన ముందుకు వచ్చి దర్శనమిస్తాడు. మన జ్ఞాన దాహాన్ని తీరుస్తాడు" అని వివరించారు.

• రాచమడుగు శ్రీనివాసులు

తెలుసుకుందాం

శివతాండవం ప్రాచీన భారతీయ నృత్య రూపాలన్నిటికీ మూలం



నాట్య శాస్త్ర సృష్టికర్త మహా శివుడని పురాణాలు చెబుతున్నాయి. నాట్య కళను తన వాహనమైన నందీశ్వరుడికి ఆయన అనుగ్రహించాడు. ఆ విద్యను తనకు నేర్పాలని బ్రహ్మదేవుడు కోరగా... శివుడి ఆనతి మేరకు బ్రహ్మకు దాన్ని నందీశ్వరుడు ఉపదేశించాడు. బ్రహ్మదేవుడు నాట్యవేదాన్ని రచించాడని, దానినే భరతముని నాట్య శాస్త్ర రూపంలో లోకానికి అందించాడనీ అంటారు. భారతీయ శాస్త్రీయ నృత్య రూపాలన్నిటికీ మూలం.. మహా శివుడి తాండవం. ఆ శివతాండవం... ప్రాచీన నృత్యరీతులుగా పరిణామం చెందిన తీరు ఇది.

నాట్యానికి మూలం శివతాండవమే!





ప్రధానమైన అంశాలు



- భావప్రకటనలు, భావోద్వేగాలు (రసాలు, భావాలు)
- హస్తాభినయాలు (ముద్రలు)
- సంగీతం (రాగాలు, తాళాలు)
- ఛందాలు లయ విన్యాసాలు/ రిథమిక్ ప్యాట్రన్స్
- సాహిత్యం (పద్యం, గీతం, సంభాషణ)
- దుస్తులు, అలంకరణ (ఆభరణాలతో సహా)
- శారీరకమైన కదలికలు (ఆంగికాభినయం)
- రంగాలంకరణ (ప్రదర్శించే వేదిక అలంకరణ)
- ప్రేక్షకులను నిమగ్నం చేయడం
- నాట్యం (నాట్యం, నృత్యం, నృత్తం)



రెండు భాగాలుగా ఉంటుందా?


మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి రూపొందించే భారీ చిత్రం వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభమవుతుందని ఆ చిత్ర కథారచయిత విజయేంద్రప్రసాద్ వెల్లడించారు. కథ తయారు చేయడానికి తనకు రెండేళ్లు పట్టిందని కూడా ఆయన తెలిపారు. దుర్గా ఆర్ట్స్ బేనర్‌పై డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మించే ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే అడ్వెంచర్ కథ కావడంతో ఈ సినిమాను రెండు భాగాలుగా అందించాలనే ఆలోచనలో దర్శకనిర్మాతలు ఉన్నారని అంటున్నారు. ఎంతో స్పాన్ ఉన్న కథను రెండు, మూడు గంటల్లో చెప్పడం కుదరదు కనుక రెండు భాగాలుగా తీస్తే బాగుంటుందన్న ఆలోచనలో ఉన్నట్లు వినిపిస్తోంది. ఈ విషయంపై చిత్ర బృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. అలాగే గ్లోబల్ ఫీచర్ ఫిల్మ్‌గా రూపొందించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారనీ, అందుకే వివిధ భాషల్లోని స్టార్స్‌తో పాటు కొంతమంది విదేశీ నటులను కూడా తీసుకుంటున్నారనీ చెబుతున్నారు. ఈ సినిమాకు సంబంధించి రకరకాలుగా ఊహాగానాలు వినిపిస్తున్నా, రాజమౌళి, ఆయన టీమ్ స్పందించకుండా ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో బిజీగా ఉంది. పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన వచ్చేవరకూ ఈ ఊహాగానాలు ఆగవేమో!

ఒక మహిళను ఇలా అనొచ్చా!



నటి, దర్శకురాలు దివ్య ఖోస్లాకుమార్ ఆలియా, కరణ్ జోహార్‌పై చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలే ఆమె 'జిగ్రా' సినిమా విషయమై అందులో నటించిన ఆలియాను, నిర్మాత కరణ్‌జోహార్‌ను ఉద్దేశిస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. "నేను నటించిన 'సవి' సినిమా, 'జిగ్రా' సినిమా కథాంశం, ట్రీట్‌మెంట్ ఒకే రకంగా ఉన్నాయి. కానీ నా సినిమానే ముందుగా ప్రొడక్షన్‌లోకి వెళ్ళింది. ముందుగా రిలీజైంది. ఇటీవల విడుదలైన 'జిగ్రా' సినిమాకు వస్తున్న కలెక్షన్లు.. చూపెడుతున్న కలెక్షన్లు పూర్తి తేడాగా ఉన్నాయి. ఒక సినిమా విజయాన్ని అందులో ఉన్న కంటెంట్, కళాత్మకతను బట్టి డిసైడ్ చేయాలి. కలెక్షన్ల పరంగా కాదు. నిజమైన హీరోయిజం అంటే ఇలాంటి తప్పుడు లెక్కలను చూపెడుతుంటే చూస్తూ ఊరుకోవడం కాదు" అని పేర్కొన్నారు. దాంతో నిర్మాత కరణ్ జోహార్‌కు ఒళ్లు మండి దివ్య పేరు ప్రస్థావించకుండా "కొన్ని సమయాల్లో మూర్ఖులకి సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండటమే ఉత్తమం" అని సోషల్‌మీడియాలో ఓ పోస్టు పెట్టారు. అయితే దీనిపై స్పందించిన దివ్యా ఖోస్లా "తప్పుల్ని ఎత్తిచూపితే.. ఒక మహిళను ఇలా 'ఫూల్' అనొచ్చా. నాతోనే ఇలాంటి పదాలు వాడితే.. ఇక ఇండస్ట్రీలో కొత్తవారి పరిస్థితి ఏంటి" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరో 50 రోజుల్లో...



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ పుష్ప. దీని కొనసాగింపుగా వస్తున్న సినిమా పుష్ప-2. మైత్రీ మూవీ మేకర్స్ అసోసియేషన్, సుకుమార్ రైటింగ్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు. సంగీతం దేవిశ్రీ ప్రసాద్. ఈ చిత్రం మరో 50 రోజుల్లో అంటే డిసెంబరు 6న విడుదలకు సిద్ధమవుతోంది. ఆ మేరకు చిత్ర బృందం హింట్ ఇస్తూ పోస్టర్‌ని విడుదల చేసింది. పోస్టర్‌లో అల్లు అర్జున్ సింహాసనంపై కూర్చొని మాసివ్ లుక్‌తో కనిపించారు. అల్లు అర్జున్, రష్మిక మందన్నాతోపాటు ఇతర పాత్రల్లో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటించారు.

నో అన్నా వాళ్లు వదల్లేదు!



రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ'. సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించారు. నవంబరు 7 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సమంత ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 'దర్శకులు నన్ను ఈ సిరీస్ కోసం సంప్రదించారు. అయితే నా అనారోగ్య కారణాల రీత్యా నటించలేనని చెప్పాను. అందుకు బదులుగా ఈ పాత్రకు సరిపోయే నలుగురు హీరోయిన్ల పేర్లను కూడా రాజ్ అండ్ డీకే కి సిఫార్సు చేశాను. అయినా వాళ్లు పట్టుబట్టి నా కోసం వెయిట్ చేశారు' అని తెలిపారు.



ప్రీక్వెల్ చేయాలని ఉంది



'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన చిత్రం 'వేట్టయాన్'. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై సూపర్‌హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా దర్శకుడు టీ.జే.జ్ఞానవేల్ మీడియాతో ముచ్చటించారు.

"రజనీ నుంచి అభిమానులు ఏం కోరుకుంటారో బాగా తెలుసు. అందుకే ఈ స్ర్కిప్టులో ఆయన కోసం ఎన్నో మార్పులు చేశాను. ఇందులో రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాత్రల మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా పరంగా ఎదుర్కొన్న అతి పెద్ద సవాల్ కమర్షియల్ అంశాలను ఇటువంటి సీరియస్ కథలో బ్యాలెన్స్ చేయడమే. అనిరుధ్ సంగీతం సినిమాకు ప్లస్సయ్యింది. ఈ సినిమాకు ప్రీక్వెల్ చేయాలని ఉంది" అని చెప్పారు.

అప్‌డేట్స్

నిఖిల్ వలపు గీతం



'స్వామి రారా', 'కేశవ' చిత్రాల తర్వాత హీరో నిఖిల్ సిద్దార్థ, దర్శకుడు సుధీర్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. కన్నడ క్రేజీ హీరోయిన్ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'హే తార' అంటూ సాగే మెలోడీ సాంగ్‌ను విడుదల చేశారు. కృష్ణ చైతన్య రాసిన ఈ పాటను కార్తీక్, నిత్యశ్రీ పాడారు. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమను తెలుపుతూ ఈ పాట సాగింది. నవంబర్ 8న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాత బీవీఎస్ ఎన్ ప్రసాద్ చెప్పారు.

మ్యూజికల్ డ్రామా



'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్స్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న చిత్రం 'మ్యాజిక్'. అనిరుధ్ రవిచందర్ స్వరకర్తగా వ్యవహరిస్తున్నారు. అనిరుధ్ పుట్టిన రోజు సందర్భంగా నిర్మాతలు చిత్రం విడుదల తేదీని ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు. డిసెంబరు 21న సినిమా విడుదల కానుంది. 'తమ కాలేజీ ఫెస్ట్ కోసం సొంతంగా ఒక పాటను స్వరపర్చడానికి నలుగురు టీనేజర్లు చేసే ప్రయత్నం చుట్టూ కథ తిరుగుతుంది. ఈ మ్యూజికల్ డ్రామాలో ఎందరో నూతన నటీనటులు నటిస్తున్నారు' అని నిర్మాతలు తెలిపారు.

చిత్రామృతం నాకు దక్కిన గౌరవం

\- కేఎస్ చిత్ర



ప్రముఖ సినీ నేపథ్య గాయని కేఎస్ చిత్ర 45 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పురస్కరించుకొని 'చిత్రామృతం' పేరుతో సినీ సంగీత విభావరి జరగనుంది. డిసెంబర్ 22న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వాహకులు నిర్వహించిన సన్నాహక కార్యక్రమానికి కేఎస్ చిత్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "చిత్రామృతం' అంటూ నా పేరుతో ఏకంగా ఓ సినీ సంగీత విభావరిని నిర్వహిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. దీన్నొక గౌరవంగా భావిస్తున్నాను. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ప్రేక్షకులను అలరించిన పలు గీతాలతో సంగీత విభావరి ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, గాయకుడు శ్రీకృష్ణ 'చిత్రామృతం' కాన్సెప్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

46కే ఢమాల్

సొంత గడ్డపై టీమిండియా చెత్త ప్రదర్శన

చెలరేగిన పేసర్లు హెన్రీ, ఓరోర్క్

కివీస్ తొలి ఇన్నింగ్స్ 180/3

తొలి టెస్టు



20000214..

ఏంటీ...ఈ నెంబర్లో ఇన్ని సున్నాలున్నాయని అనుకుంటున్నారా..? ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్ కలిగిన టీమిండియాలోని తొవిష్మది మంది బ్యాటర్ల స్కోర్లవి.. కివీస్ పేసర్లు హెన్రీ, ఓరోర్క్‌ల ధాటికి తొలి టెస్టులో కేవలం ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. అది కూడా 20 లోపే.. ఈ దెబ్బకు స్వదేశంలో జరిగిన టెస్టుల్లో రోహిత్ సేన అత్యంత చెత్త స్కోరును నమోదు చేయగా.. అటు కివీస్ తొలి రోజే ఆధిక్యం సాధించింది.

టెస్టుల్లో భారత్ అత్యల్ప స్కోర్లు		
36	ఆసీస్‌పై	2020
42	ఇంగ్లండ్‌పై	1974
46	కివీస్‌పై	2024
58	ఆసీస్‌పై	1947
58	ఇంగ్లండ్‌పై	1952

బెంగళూరు: స్వదేశంలో వరుసగా 18 టెస్టు సిరీస్ విజయాలు.. ఇటీవలే బంగ్లాదేశ్‌ను క్లీన్ స్వీప్ చేసి జోష్ మీదున్న భారత జట్టు కివీస్‌తో తొలి టెస్టును ఇంత దారుణంగా ఆరంభిస్తుందని ఎవరూ ఊహించలేదు. మ్యాచ్‌కు తొలిరోజైన బుధవారం ఆట వర్షార్పణం కాగా.. రెండో రోజు టాస్ గెలిచిన భారత్ అనూహ్యంగా బ్యాటింగ్ ఎంచుకుంది. రోజంతా పిచ్‌ను పూర్తిగా కవర్లతో కప్పి ఉంచిన వేళ, రోహిత్ తీసుకున్న నిర్ణయం అందరికీ షాక్ కలిగించింది. ఇంకేముంది.. మేఘావృత పరిస్థితిని సద్వినియోగం చేసుకుంటూ కివీస్ పేసర్లు చెలరేగిపోయారు. దీంతో భారత బ్యాటర్లు బెంబేలెత్తిపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 31.2 ఓవర్లలో కేవలం 46 పరుగులకే కుప్పకూలారు. పంత్ (20), జైస్వాల్ (13) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. పేసర్లు మ్యాట్ హెన్రీకి ఐదు, విలియం ఓరోర్క్‌కు నాలుగు, సౌథీకి ఓ వికెట్ లభించాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన కివీస్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 180/3 స్కోరుతో ఉంది. ప్రస్తుతం పర్యాటక జట్టు 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. డెవాన్ కాన్వే (91) సెంచరీని మిస్సయ్యాడు. క్రీజులో రచిన్ (22 బ్యాటింగ్), మిచెల్ (14 బ్యాటింగ్) ఉన్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లారు: రోహిత్ టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకోవడం కివీస్‌కు లాభించింది. బౌలర్లకు అనుకూల పరిస్థితి ఉండడంతో స్వింగ్, బౌన్సీ బంతులతో వికెట్ల జాతర కొనసాగించారు. దీంతో భారత బ్యాటింగ్ లైనప్‌లో వచ్చినవారు వచ్చినట్టు వికెట్‌ను సమర్పించుకుని పెవిలియన్‌కు చేరాల్సివచ్చింది. ఏడో ఓవర్‌లో కెప్టెన్ రోహిత్ (2)ను సౌథీ అవుట్ చేయడంతో జట్టు పతనం ఆరంభమైంది. 2016 తర్వాత వన్‌డౌన్‌లో ఆడిన విరాట్‌ను ఓరోర్క్ డకౌట్‌గా పంపాడు. ఆ తర్వాత సర్ఫరాజ్ కూడా డకౌట్ కావడంతో 10/3 స్కోరుతో దయనీయంగా కనిపించింది. జైస్వాల్, పంత్ నాలుగో వికెట్‌కు అందించిన 21 పరుగులే అత్యధికం కావడం గమనార్హం. రాహుల్, జడేజా, అశ్విన్ కూడా డకౌట్‌గానే వెనుదిరిగారు. కేవలం 15 పరుగుల తేడాతో చివరి ఏడు వికెట్లు కోల్పోయింది. తొలి సెషన్‌లో వర్షంతో 45 నిమిషాల ఆటకు అంతరాయం కలగ్గా.. రెండో సెషన్ ఆరంభంలోనే జట్టు ఆలౌటైంది.

కాన్వే దూకుడు: భారత బౌలర్లు కివీస్ బ్యాటర్లను కూడా ఇబ్బందిపెడతారని ఆశించినా నిరాశే ఎదురైంది. ఓపెనర్లు తొలి వికెట్‌కు 67 పరుగులు జోడించారు. లాథమ్‌ను స్పిన్నర్ కుల్దీప్ అవుట్ చేశాక.. విల్ యంగ్ (33)తో కాన్వే ఇన్నింగ్స్‌ను నడిపించాడు. శతకానికి 9 పరుగుల దూరంలో కాన్వేను అశ్విన్ బౌల్డ్ చేశాడు.

సర్ఫరాజ్‌పై రోహిత్ ఆగ్రహం

ఫీల్డింగ్ విషయంలో సర్ఫరాజ్‌పై కెప్టెన్ రోహిత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. స్పిన్నర్ బౌలింగ్‌కు వస్తున్న సంగతి గమనించకుండా అతడింకా బ్యాటర్‌కు దగ్గరే ఫీల్డింగ్ చేయడంతో రోహిత్‌కు మండింది. 'కళ్లు కనిపించడం లేదా' అంటూ ఓ బూతు మాటతో హెచ్చరించాడు. అలాగే లాథమ్ క్యాచ్‌ని అందుకునే విషయంలో రాహుల్‌పై కూడా ఆగ్రహం వ్యక్తంచేశాడు.


హెన్రీ (5/15)


ఓరోర్క్ (4/22)

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఎజాజ్ (బి) ఓరోర్క్ 13; రోహిత్ (బి) సౌథీ 2; కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) ఓరోర్క్ 0; సర్ఫరాజ్ (సి) కాన్వే (బి) హెన్రీ 0; పంత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 20; రాహుల్ (సి) బ్లండెల్ (బి) ఓరోర్క్ 0; జడేజా (సి) ఎజాజ్ (బి) హెన్రీ 0; అశ్విన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 0; కుల్దీప్ (సి-సబ్) బ్రేస్‌వెల్ (బి) హెన్రీ 2; బుమ్రా (సి) హెన్రీ (బి) ఓరోర్క్ 1; సిరాజ్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 31.2 ఓవర్లలో 46 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-9, 2-9, 3-10, 4-31, 5-33, 6-34, 7-34, 8-39, 9-40, 10-46. **బౌలింగ్:** సౌథీ 6-4-8-1; హెన్రీ 13.2-3-15-5; ఓరోర్క్ 12-6-22-4.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) కుల్దీప్ 15; కాన్వే (బి) అశ్విన్ 91; యంగ్ (సి) కుల్దీప్ (బి) జడేజా 33; రచిన్ (బ్యాటింగ్) 22; మిచెల్ (బ్యాటింగ్) 14; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 50 ఓవర్లలో 180/3. వికెట్ల పతనం:** 1-67, 2-142, 3-154. **బౌలింగ్:** బుమ్రా 10-4-23-0; సిరాజ్ 7-1-21-0; అశ్విన్ 11-1-46-1; కుల్దీప్ 12-1-57-1; జడేజా 10-0-28-1.

పంత్‌కు గాయం



భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ గాయపడడంతో మిగిలిన మూడు రోజులు ఆడేది సందేహంగా మారింది. కివీస్ ఇన్నింగ్స్ 38వ ఓవర్‌లో జడేజా వేసిన బంతి అతడి ఎడమ మోకాలిని తాకింది. దీంతో బాధతో విలవిల్లాడిన పంత్ మైదానం వీడాల్సి వచ్చింది. అతడి స్థానంలో జురెల్ కీపింగ్ చేశాడు. 2023లో సర్జరీ చేయించుకున్న చోటే బంతి తాకడంతో వాపు వచ్చిందని కెప్టెన్ రోహిత్ తెలిపాడు.


రోహిత్

మా ఆట బాధించింది

'పిచ్ స్వభావాన్ని తప్పుగా అర్థం చేసుకున్నాను. తొలి సెషన్ తర్వాత వికెట్ సీమర్లకు అనుకూలించదని భావించా. పచ్చిక కూడా అంతగా లేదు. అయితే నా అంచనా తప్పింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగాలనేది నా నిర్ణయమే. దీనికి నాదే బాధ్యత. కానీ మరీ 46 రన్స్ మాత్రమే చేయడం బాధించింది. ఏడాదిలో ఒకటి రెండు ఇలాంటి నిర్ణయాలు పర్వాలేదు' - **రోహిత్ శర్మ**

1 టాప్-8 బ్యాటర్లలో ఐదుగురు డకౌట్లు కావడం భారత జట్టులో ఇదే ప్రథమం. అలాగే ఆసియాలో అత్యల్ప స్కోరు (46) నమోదు చేసిన జట్టుగా భారత్ నిలిచింది.

2 ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో భారత్ నుంచి ఐదుగురు డకౌట్లు కావడం ఇది నాలుగోసారి. ఇంగ్లండ్, సౌతాఫ్రికాపై అత్యధికంగా ఆరేసి బ్యాటర్లు డకౌట్ అయ్యారు.

భారత్ ఆటతీరుపై ట్రోలింగ్

కివీస్‌పై భారత్ 46 రన్స్‌కే ఆలౌట్ కావడంపై ఆస్ట్రేలియా క్రికెట్ (సీఏ) ట్రోలింగ్‌కు దిగింది. 2020 అడిలైడ్ టెస్టులో ఇలాగే భారత్ 36 రన్స్ కుప్పకూలింది. ఆ సందర్భాన్ని ఇప్పటి ఆటతీరుతో పోలుస్తూ '46 ఆలౌట్ అనేది 36 ఆలౌట్‌ను మరిపించిందని చెప్పవచ్చా' అంటూ పోస్ట్ చేసింది. మరోవైపు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ సైతం 'ఈసారి 36 రన్స్‌ను అధిగమించినందుకు భారత క్రికెట్ అభిమానులు సంతోషపడాలి' అంటూ కామెంట్ చేశాడు.

క్వార్టర్స్‌కు సింధు

ఓడెన్స్ (డెన్మార్క్): కొన్నాళ్లుగా ఆరంభ రౌండ్లలోనే వెనుదిరుగుతున్న పీవీ సింధు డెన్మార్క్ ఓపెన్‌లో ఆ గండాన్ని అధిగమించింది. ఇక్కడ జరుగుతున్న సూపర్ 750 టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన రెండోరౌండ్లో మాజీ వరల్డ్ చాంపియన్ సింధు 18-21, 21-12, 21-16తో ప్రపంచ ఏడో ర్యాంకర్ హే యూ (చైనా)పై గెలిచింది. తర్వాతి రౌండ్‌లో సింధు.. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రిగోరియా మారిస్కా (ఇండోనేసియా)తో తలపడనుంది.



కూతకు సిద్ధం!

ప్రొ. కబడ్డీ సీజన్ నేటినుంచే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొకబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-11 హైదరాబాద్ వేదికగా శుక్రవారం ప్రారంభం కాబోతోంది. తొలి మ్యాచ్‌లో 2018 చాంపియన్ బెంగళూరు బుల్స్‌తో తెలుగు టైటాన్స్ పోటీపడనుంది. గురువారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన ట్రోఫీ ఆవిష్కరణలో 12 జట్ల కెప్టెన్లు కప్‌తో ఫొటోకు పోజులిచ్చారు. వచ్చే నెల 9 వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో తొలి అంచె పోటీలు, నవంబరు 10 నుంచి నోయిడాలో రెండో అంచె, డిసెంబరు 3 నుంచి 24 వరకు పుణెలో మూడో అంచె జరగనున్నాయి. లీగ్‌లో ప్లేఆఫ్స్‌తో సహా మొత్తం 137 మ్యాచ్‌లో జరగనున్నాయి. గత సీజన్‌లో టైటాన్స్ 22 మ్యాచ్‌ల్లో రెండే గెలిచి అవమానకర రీతిలో లీగ్ నుంచి నిష్క్రమించింది. నిరు డు సీజన్‌లో జట్టు పగ్గాలు తీసుకున్న స్టార్ రైడర్ పవన్ షెహ్రావత్ ఆటగాడిగా రాణించినా సారథిగా టీమ్‌ను విజయపథంలో నడపలేకపోయాడు. అయితే, ఈసారి జట్టులోకి కొత్త ప్లేయర్ల రాకతో పాటు నూతన కోచ్ క్రిషన్ కుమార్ చేరాడు.

టీ20 ప్రపంచ కప్‌లో ఆసీస్‌కు షాక్

ఫైనల్లో దక్షిణాఫ్రికా


అనికె బాష్ (74 నాటౌట్)

దుబాయ్: డిఫెండింగ్ చాంప్, 8వసారి ఫైనల్ బెర్త్‌పై కన్నేసిన ఆస్ట్రేలియాకు మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో షాక్ తగిలింది. అనికె బాష్ (48 బంతుల్లో 74 నాటౌట్) పవర్ హిట్టింగ్‌తో దక్షిణాఫ్రికా ఫైనల్‌కు చేర్చింది. గురువారం జరిగిన సెమీస్‌లో సౌతాఫ్రికా 8 వికెట్ల తేడాతో కంగారూలను చిత్తుచేసింది. ఆసీస్ నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా 17.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వన్‌డౌన్‌లో వచ్చిన బాష్‌తో పాటు లారా వొల్వార్డ్ (42) కూడా ధాటిగా ఆడారు. కాగా, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 134 పరుగులు చేసింది. బెత్ మూనీ (44) రాణించింది.

● **విండీస్-కివీస్ సెమీస్ నేడు**

వెస్టిండీస్, న్యూజిలాండ్‌లు శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. 2009, 2010 టోర్నీల్లో ఫైనల్ చేరిన న్యూజిలాండ్..మళ్లీ తుదిపోరుకు చేరుకోవాలనే పట్టుదలతో ఉంది. 2016లో టైటిల్ నెగ్గిన విండీస్.. 2018లో సెమీస్‌కు చేరుకొంది.

వివాన్‌కు రజతం..అనంత్‌కు కాంస్యం

న్యూఢిల్లీ: షూటింగ్ ప్రపంచ కప్ ఫైనల్లో భారత షూటర్లకు మరో 2 పతకాలు లభించాయి. వివాన్ కపూర్ రజతం, అనంత్‌జీత్ సింగ్ నరూక కాంస్యం దక్కించుకున్నారు. గురువారం జరిగిన పురుషుల ట్రాప్ ఈవెంట్ ఫైనల్స్‌లో వివాన్ 44 పాయింట్లు షూట్ చేసి రెండోస్థానంలో నిలిచాడు. ఇక, పురుషుల స్కీట్ ఈవెంట్ ఫైనల్స్‌లో అనంత్‌జీత్ సింగ్ 43 పాయింట్లు స్కోరు చేసి మూడోస్థానంలో నిలిచాడు.

ఇంగ్లండ్ లక్ష్యం 297

ముల్తాన్: స్పిన్నర్ సాజిద్ ఖాన్ విజృంభించడంతో.. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ పట్టుబిగించింది. 297 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా ఆటకు మూడో రోజైన గురువారం రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 36/2తో నిలిచింది. విజయానికి ఇంగ్లండ్ ఇంకా 261 పరుగుల దూరంలో ఉంది. కాగా, ఓవర్‌నైట్ స్కోరు 239/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్ 291 పరుగులకు ఆలౌటైంది. సాజిద్ 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 75 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్ 221 పరుగులకు కుప్పకూలింది. పాక్ మొదటి ఇన్నింగ్స్‌లో 366 పరుగులు సాధించింది.

బిజినెస్

ఇన్ఫీ లాభం రూ.6,506 కోట్లు

ఒక్కో షేరుకు రూ.21 డివిడెండ్

ఈ ఆర్థిక సంవత్సరానికి ఆదాయ వృద్ధి అంచనా 3.75-4.50 శాతానికి పెంపు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25).. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) ఇన్ఫోసిస్ రూ.6,506 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోలిస్తే లాభం 4.7 శాతం అధికమిది. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోల్చినా లాభం 2.2 శాతం పెరిగింది. కాగా, ఈ క్యూ2లో ఇన్ఫీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 4.2 శాతం పెరిగి రూ.40,986 కోట్లుగా నమోదైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి అంచనాను 3.75-4.50 శాతానికి పెంచింది. గత త్రైమాసిక ఫలితాల విడుదల సందర్భంగా ప్రకటించిన 3-4 శాతం ఆదాయ వృద్ధి అంచనా కంటే ఎక్కువ ఇది. కంపెనీకి కీలక ఆదాయ విభాగమైన ఆర్థిక సేవల రంగంలో క్లయింట్ల డీల్స్ పునరుద్ధరణ ఇందుకు దోహదపడనుందని కంపెనీ అభిప్రాయపడింది. అంతేకాదు, కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను పెంచడం ఇది రెండోసారి. జూలైలోనూ అంచనాను 1-3 శాతం నుంచి 3-4 శాతానికి పెంచింది.

{ ఈ క్యూ2లో త్రైమాసిక ప్రాతిపదికన 3.1 శాతం స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధిని నమోదు చేయగలిగాం. ఆర్థిక సేవల రంగంలో డీల్స్ పునరుద్ధరణ ఇందుకు దోహదపడింది. అంతేకాదు, గత మూడు నెలల్లో 240 కోట్ల డాలర్ల బడా డీల్స్ దక్కించుకోగలగడం మార్కెట్లో మా ప్రత్యేక స్థానాన్ని ప్రతిబింబింపజేస్తుంది. }

సలీల్ పరేఖ్, ఎండీ, సీఈఓ, ఇన్ఫోసిస్

ఉద్యోగుల సంఖ్యలో 2,456 పెరుగుదల

వరుసగా ఆరు త్రైమాసికాలుగా తగ్గుతూ వస్తున్న ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్యకు ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య నికరంగా 2,456 పెరిగి మొత్తం 3,17,788కి చేరుకుంది. అయితే, గత త్రైమాసికంలో ఉద్యోగుల వలసల రేటు మాత్రం 12.9 శాతానికి పెరిగింది. ఈ క్యూ1లో వలసల రేటు 12.7 శాతంగా నమోదైంది.

240 కోట్ల డాలర్ల బడా డీల్స్

గత త్రైమాసికంలో కంపెనీ 240 కోట్ల డాలర్ల విలువైన బడా డీల్స్‌ను దక్కించుకుంది. బడా డీల్స్ పుంజుకున్న నేపథ్యంలోనే కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాలను మరింత పెంచింది.

డివిడెండ్ రికార్డు తేదీ అక్టోబరు 29

ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.21 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. డివిడెండ్‌కు అర్హులైన షేర్‌హోల్డర్లను గుర్తించేందుకు రికార్డు తేదీని అక్టోబరు 29గా నిర్ణయించింది. వచ్చే నెల 8న డివిడెండ్ చెల్లించనున్నట్లు సంస్థ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు మొత్తం రూ.46 డివిడెండ్ చెల్లించింది.

హైదరాబాద్‌పై సత్వ గ్రూప్ ప్రత్యేక దృష్టి

అవకాశం వస్తే ఆంధ్రప్రదేశ్‌కూ విస్తరిస్తాం

సంస్థ వైస్ ప్రెసిడెంట్ శివమ్ అగర్వాల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బెంగళూరు కేంద్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థ సత్వ గ్రూప్ హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా వచ్చే ఆరు నుంచి తొమ్మిది నెలల్లో హైదరాబాద్‌లోని కోకాపేటలో 15 ఎకరాల్లో 1,500 ఫ్లాట్లతో మరో భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేపడుతోంది. సత్వ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ శివమ్ అగర్వాల్ ఈ విషయం వెల్లడించారు. డేటా కేంద్రాలు, వాణిజ్య స్థాయి కార్యాలయాల నిర్మాణంతోపాటు రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు సంబంధించి తమ గ్రూప్‌నకు బెంగళూరు, హైదరాబాద్ అత్యంత కీలక మార్కెట్లని అగర్వాల్ తెలిపారు మౌలిక సదుపాయాలు, ఐటీ రంగం పుంజుకుంటే భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, వైజాగ్‌కూ విస్తరించే విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

4 ఎన్‌బీఎఫ్‌సీలపై ఆర్‌బీఐ వేటు

ముంబై: అడ్డగోలుగా నిబంధనలను తుంగలో తొక్కుతున్న నాలుగు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వేటు వేసింది. బెంగళూరు కేంద్రంగా పనిచేసే నవీ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, ఢిల్లీ కేంద్రంగా ఉన్న డీఎంఐ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్‌కతా కేంద్రంగా పనిచేసే ఆరోహణ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, చెన్నైకి చెందిన ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ అనే నాలుగు ఎన్‌బీఎఫ్‌సీలు కొత్తగా రుణాల మంజూరు, పంపిణీ చేయకుండా నిషేధం విధించింది. ఈ నెల 21వ తేదీ నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుంది.

విప్రో బోనస్ బొనాంజా



వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీ

- దాదాపు 22 లక్షల మంది చిన్న షేర్‌హోల్డర్లకు లబ్ధి
- సెప్టెంబరు త్రైమాసిక లాభంలో 21 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సేవల కంపెనీ విప్రో బోనస్ షేర్ల బొనాంజా ప్రకటించింది. అమెరికన్ డిపాజిటరీ షేర్స్ (ఏడీఎస్) హోల్డర్లు సహా కంపెనీ వాటాదారులందరికీ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయాలని విప్రో బోర్డు సిఫారసు చేసింది. అంటే.. వాటాదారు కలిగిన ప్రతి ఒక్క విప్రో షేరుకు గాను మరో షేరు బోనస్‌గా లభించనుంది. ఈ సెప్టెంబరు 30 నాటికి ఉన్న ఉచిత రిజర్వ్ లేదా సెక్యూరిటీస్ ప్రీమియం అకౌంట్ లేదా కంపెనీ క్యాపిటల్ రిడంప్షన్ రిజర్వ్ అకౌంట్ నుంచి బోనస్ ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారం అందించింది. అయితే, ఈ ప్రతిపాదనను షేర్‌హోల్డర్లు ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కంపెనీ బోనస్ షేర్ల జారీకి అర్హులైన వాటాదారులను గుర్తించేందుకు రికార్డు తేదీని ప్రకటిస్తుంది.

ఈ డిసెంబరు 15 నాటికి కంపెనీ అర్హులైన వాటాదారులకు కేటాయించవచ్చని అంచనా. విప్రో బోనస్ షేర్ల జారీ రిటైల్ షేర్‌హోల్డర్లకు శుభవార్తే. ఈ సెప్టెంబరు 30 నాటికి విప్రో షేర్లు కలిగిన చిన్న షేర్‌హోల్డర్ల సంఖ్య దాదాపు 22 లక్షల స్థాయిలో ఉంది. విప్రో బోనస్ షేర్లు జారీ చేయడం 2019 తర్వాత ఇదే తొలిసారి. అలాగే, కంపెనీ చరిత్రలో ఇది 14వ సారి. గురువారం బీఎస్ఈలో కంపెనీ షేరు 0.65 శాతం నష్టపోయి రూ.528.80 వద్ద ముగిసింది.

లాభం రూ.3,209 కోట్లు

సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో విప్రో లాభం వార్షిక ప్రాతిపదికన 21.2 శాతం వృద్ధి చెంది రూ.3,208.8 కోట్లకు చేరుకుంది. ఆదాయం మాత్రం 0.95 శాతం తగ్గి రూ.22,301.6 కోట్లకు పరిమితమైంది. అయితే, డిసెంబరుతో ముగియనున్న త్రైమాసికానికి స్థిర కరెన్సీ ఆదాయ వృద్ధి అంచనాను మైనస్ 1-ప్లస్ 1 శాతం స్థాయి నుంచి మైనస్ 2 నుంచి సున్నా శాతానికి తగ్గించింది.

ఆఫర్ లెటర్లు ఇచ్చినవారందరికీ ఉద్యోగం

గతంలో ఆఫర్ లెటర్లు జారీ చేసిన ఫ్రెషర్లందరినీ ఈ ఏడాది చివరినాటికల్లా ఉద్యోగంలో చేర్చుకుంటామని విప్రో చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ సౌరభ్ గోవిల్ స్పష్టం చేశారు. ఐటీ కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలను 6 నెలల నుంచి 2 ఏళ్ల వరకు వాయిదా వేస్తూ వస్తున్నాయంటూ ఈ మధ్య వార్తలు వచ్చిన నేపథ్యంలో గోవిల్ వివరణ ఇచ్చారు.

"ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1) నుంచి ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకుంటున్నాం. క్యూ1, క్యూ2లో 2,500- 3,000 మంది చొప్పున కంపెనీలో చేర్చుకోవడం జరిగిందని" గోవిల్ అన్నారు. కాగా, సెప్టెంబరు 30 నాటికి కంపెనీలో మొత్తం 2,33,889 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

2 నెలల కనిష్ఠ స్థాయికి సూచీలు

సెన్సెక్స్ 495 పాయింట్లు పతనం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజు నష్టపోయి రెండు నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 596 పాయింట్ల వరకు పతనమై 81,000 స్థాయిని సైతం కోల్పోయింది. చివరికి 494.75 పాయింట్ల నష్టంతో 81,006.61 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 221.45 పాయింట్లు కోల్పోయి 24,749.85 వద్దకు జారుకుంది. సూచీలకిది రెండు నెలల కనిష్ఠ ముగింపు స్థాయి. బ్యాంకింగ్, వాహన, స్థిరాస్తి రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మన మార్కెట్ నుంచి పెట్టుబడులను తరలిస్తుండటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులోనే రూ.6.03 లక్షల కోట్లు తగ్గి రూ.457.25 లక్షల కోట్లకు (5.44 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

గట్టెక్కిన హ్యుండయ్ ఐపీఓ: హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ రూ.27,870 కోట్ల మెగా ఐపీఓ మొత్తానికి గట్టెక్కింది. గురువారంతో ముగిసిన ఈ ఇష్యూకు 2.37 రెట్ల సబ్‌స్ర్కిప్షన్ లభించింది. రిటైల్, సంస్థాగతేతర ఇన్వెస్టర్లు పెద్దగా ఆసక్తి చూపనప్పటికీ, సంస్థాగత పెట్టుబడిదారుల బిడ్లతో పూర్తి సబ్‌స్ర్కిప్షన్‌ను సాధించగలిగింది.

ఈ ఏడాది మార్కెట్లోకి మరో 4 కొత్త మోటార్‌సైకిళ్లు

జావా యెజ్డీ సీఈఓ ఆశిష్ సింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ మార్కెట్లోకి కొత్తగా నాలుగు మోటార్‌సైకిళ్లను తీసుకురానుంది. ప్రస్తుతం కంపెనీ పోర్టుఫోలియోలో 11 మోటార్‌సైకిళ్లు ఉండగా మరో 4 కొత్త మోడళ్లను ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు జావా యెజ్డీ మోటార్‌సైకిల్స్ సీఈఓ ఆశిష్ సింగ్ జోషి వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన తెలంగాణ మార్కెట్లోకి సరికొత్త 350 జావా 42 ఎఫ్‌జే విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 300 సీసీ నుంచి 600 సీసీ విభాగంలో ఈ మోటార్‌సైకిళ్లను తీసుకురానున్నట్లు చెప్పారు. 350 జావా 42 ఎఫ్‌జే ప్రారంభ ధర రూ.2,02,142 (తెలంగాణ ఎక్స్‌షోరూమ్). కాగా తెలంగాణలో జావా ప్రస్తుతం 12 షోరూమ్స్‌ను నిర్వహిస్తోందని, కార్యకలాపాల విస్తరణలో భాగంగా కొత్తగూడెం, గద్వాల, షాద్‌నగర్‌లలో కొత్త షోరూమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా 12 షోరూమ్స్‌ను నిర్వహిస్తుండగా కొత్తగా మరో 8 షోరూమ్స్‌ను నెలకొల్పనున్నట్లు ఆశిష్ పేర్కొన్నారు.

జీఆర్‌టీ జువెలర్స్ స్వర్ణ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్ దీపావళి పండగను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో స్వర్ణ దీపావళి, తమిళనాడులో తంగా దీపావళి పేరుతో వినియోగదారులకు ఈ ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీపావళి సందర్భంగా జీఆర్‌టీ జువెలర్స్‌లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వినియోగదారులకు 'సిల్వర్ ఫర్ గోల్డ్' ఆఫర్ కింద దానికి సమాన బరువు గల వెండిని పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. జీఆర్‌టీ జువెలర్స్ 60వ వార్షికోత్సవం సందర్భంగా ఈ దీపావళికి వజ్రాలపై క్యారెట్‌కు 25 గ్రాముల వెండి, అన్ కట్ డైమండ్స్‌పై క్యారెట్‌కు 2 గ్రాముల వెండి, ప్లాటినం ఆభరణాల బరువుకు సమానమైన వెండిని ఉచితంగా అందించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ వెల్లడించారు. అలాగే వెండి వస్తువుల (ప్రత్యేక వస్తువులు మినహాయించి) మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు సహా గిఫ్ట్ ఆర్టికల్స్ ఎంఆర్‌పీపై 10 శాతం తగ్గింపును ఆఫర్ చేస్తున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,110 ▲	71,600 ▲	1,03,000 ▲
ముంబై	76,810 ▲	70,358 ▲	91,600 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ

హైదరాబాద్	485	విజయవాడ	510
వరంగల్	487	గోదావరి	505
చిత్తూరు	538	విశాఖపట్నం	505

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	129
కర్నూలు	120	నెల్లూరు	129
విశాఖపట్నం	125	అనంతపురం	129
గోదావరి	130		

డిగ్రీ కళాశాలల బంద్ విరమణ

రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో బంద్‌ను విరమించుకుంటున్నట్టు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ప్రకటించాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో శుక్రవారం నుంచి డిగ్రీ కళాశాలలు యథావిధిగా నడుస్తాయని తెలిపాయి. ఫీజు రీ- యింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజుల నుంచి బంద్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆయన సూచన మేరకు విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశంతో కూడా కళాశాలల ప్రతినిధులు చర్చించారు. ఈ చర్చలు సఫలం కావడంతో బంద్ కార్యక్రమాన్ని విరమించుకున్నారు. ఫీజు బకాయిల విడుదలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని, చర్చల సందర్భంలో విద్యాశాఖ కార్యదర్శి కళాశాలల ప్రతినిధులకు తెలిపారు. త్వరలోనే ఈ నిధులు విడుదలవుతాయని స్పష్టం చేశారు. దాంతో బంద్‌ను విరమిస్తున్నట్టు కళాశాలల యాజమాన్యాలు ప్రకటించాయి.

బీఆర్ఎస్ వల్లే అద్దె బకాయిలు: మంత్రి పొన్నం



జహీరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణారాహిత్యం వల్లే గురుకులాల అద్దె బకాయిలు పెరిగిపోయాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో గురువారం ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించేలా భవన యాజమాన్యాలు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో కొన్ని గురుకుల భవనాలకు 30- 40 నెలల అద్దెలు పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్ అద్దెలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కళాశాల యాజమాన్యాలు ఆందోళనకు దిగడాన్ని మంత్రి తప్పుపట్టారు. విద్యార్థులు నష్టపోయే విధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నేరవేరుస్తుందని పేర్కొన్నారు.

దక్షిణ కొరియాకు ప్రజాప్రతినిధుల బృందం

» ఈ నెల 21 నుంచి 24 వరకు సియోల్ పర్యటన

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మురికి కూపంగా మారిన మూసీని పునరుజ్జీవనం చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. వివిధ దేశాల్లో నదుల అభివృద్ధిపై అధ్యయనం చేయిస్తోంది. అందులో భాగంగా దక్షిణకొరియా పర్యటనకు ప్రజాప్రతినిధులు, సీనియర్ అధికారులతో కూడిన బృందాన్ని పంపుతోంది. 21 నుంచి 24వ తేదీ వరకు ఈ బృందం సియోల్ నగరంలో పర్యటించి అక్కడి నదుల అభివృద్ధిపై అధ్యయనం చేయనుందని పురపాలకశాఖ గురువారం తెలిపింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో మరో మంత్రి పొన్నం ప్రభాకర్, వేం నరేందర్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ తదితరులు ఈ పర్యటనకు వెళ్లనున్నారు.

ఎకో-సెన్సిటివ్ జోన్‌గా పోచారం అభయారణ్యం

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోచారం వన్యప్రాణుల అభయారణ్యంను ఎకో-సెన్సిటివ్ జోన్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు పోచారం అభయారణ్యంలోని వన్యప్రాణులను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన ప్రాధాన్యతను గుర్తిస్తూ కేంద్ర పర్యావరణం, అటవీ వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో విస్తరించిన పోచారం అభయారణ్యంలోని అరుదైన జంతుజాలం, వన్యప్రాణుల రక్షణకు తగిన చర్యలు తీసుకునేందుకు ప్రకటించిన ఎకో-సెన్సిటివ్ జోన్ మానిటరింగ్ కమిటీకి నిజామాబాద్ కలెక్టర్ చైర్మన్ (ఎక్స్ అఫీషియో)గా వ్యవహరిస్తారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతినిధి, ఆయా జిల్లాల పరిధిలో పనిచేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా, మెదక్ డివిజనల్ అటవీ శాఖ అధికారి ఎకో జోన్ మానిటరింగ్ కమిటీ ఎక్స్‌అఫీషియో సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

కిషన్‌రెడ్డిపై అనుచిత వీడియోలు తొలగించాలి

» సైబర్ క్రైం పోలీసులకు బీజేపీ వినతి

» పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైం పోలీసులను పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సైబర్ క్రైం డిప్యూటీ కమిషనర్ (డిటెక్టివ్ డిపార్టుమెంట్) శ్వేతకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, కార్యదర్శి డాక్టర్ ఎస్. ప్రకాశ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ తదితరులు వినతి పత్రం అందజేశారు. కొంతమంది వ్యక్తులు కిషన్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్టులు పెట్టారని వారు ఫిర్యాదు చేశారు. సంబంధిత తప్పుడు వీడియోలను తక్షణం తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో క్లిప్పింగ్‌లను డిప్యూటీ కమిషనర్‌కు అందజేశారు.

నిరుద్యోగులు కేటీఆర్‌ను నమ్మరు: చనగాని

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నిరుద్యోగులు కేటీఆర్‌ను నమ్మరని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొమ్మిది నెలల్లో 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామకాల జాతర కేటీఆర్‌కు కనపడలేదా అని ఆయన ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో చనగాని దయాకర్ విలేకరులతో మాట్లాడుతూ, యూనివర్సిటీల్లోని ఖాళీలను పదేళ్లలో ఎందుకు భర్తీ చేయలేదో కేటీఆర్ చెప్పాలని, జీతాలు అడిగిన ఆశావర్కర్లపై ఇందిరాపార్క్ వద్ద లాఠీ చార్జీ చేసిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు ఇంకా మరిచిపోలేదని అన్నారు. తెలంగాణ విద్యార్థుల కోసం 6690 మెడికల్ సీట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చనగాని దయాకర్ చెప్పారు.

కేసీఆర్ వల్లే చిన్న లిఫ్టులు నిర్వీర్యం

» వాటి పునరుద్ధరణకు సర్కారుకు ప్రతిపాదనలు

» తెలంగాణ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతాంగానికి మేలు చేసిన ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఐడీసీ)ను పదేళ్లలో కేసీఆర్ నిర్వీర్యం చేశారని ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయ్ బాబు విమర్శించారు. గురువారం ఐడీసీ తొలి పాలకమండలి సమావేశం జరిగింది. అనంతరం విజయ్‌బాబు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 643 లిఫ్టులు ఉండగా అందులో 180 పూర్తిగా మూతపడ్డాయని, వీటి పునరుద్ధరణకు రూ.400 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరతామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ఐడీసీ లిఫ్టులు పనిచేయగా.. కాలక్రమంలో మూతపడటం, నిర్వహణ లేకపోవడంతో సాగు విస్తీర్ణం 2 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. గత పదేళ్లలో తీసుకున్న నిర్ణయాల ఫలితంగా లిఫ్టులు మూతపడ్డాయని, వాటి పునరుద్ధరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. నీటిపారుదల శాఖ నిర్వహణలోకి వెళ్లిన లిఫ్టులను తిరిగి ఐడీసీ చేతుల్లో పెట్టాలని పాలకమండలి సమావేశంలో తీర్మానం చేశామని విజయ్‌బాబు వెల్లడించారు.

మహిళా సంక్షేమం.. హరీశ్‌కు కనిపించట్లేదా..?

» ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మహిళల మీద ప్రేమ ఉన్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు తెగ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పదేళ్లలో మహిళలను అన్నిరకాలుగా కేసీఆర్ అణచివేశారని విమర్శించారు. కనీసం మంత్రి వర్గంలో అవకాశం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. స్వయం సహాయక సంఘాలను నిర్వీర్యం చేశారని, పావలావడ్డీ రుణాలు ఎత్తేసి మహిళలకు అన్యాయం చేశారని విమర్శించారు. మహిళల అభ్యున్నతి కోసం ఒక్క కార్యక్రమాన్నీ అమలు చేయలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఆడపడుచులను ఎలా గౌరవిస్తుందో హరీశ్‌రావు కళ్లకు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని స్పష్టం చేశారు.

ఇచ్చింది తీసుకో.. లేదంటే పో..!!

» సన్న ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడి

» ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో ఇష్టారాజ్యం

నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం రకాలకు విపరీతమైన ధర పలుకుతున్నా వాటిని పండించిన రైతులు మాత్రం లబ్ధి పొందడం లేదు. మిల్లర్లు రైతులను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు రూ.500 బోనస్ కూడా ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటిదాకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో.. 'మేము చెప్పిందే ధర' అనే పరిస్థితిని మిల్లర్లు సృష్టించారు. ఇచ్చింది తీసుకో.. లేదంటే వెళ్లిపో అంటూ రైతులను బెదిరించి తమకు నచ్చిన ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సన్నధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,320 కాగా బోనస్ రూ.500 కలిపి ప్రభుత్వం కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయితే, కొనుగోలు కేంద్రాలు ఇప్పటిదాకా ప్రారంభించలేదు. దీంతో రైతులు తమకు సమీపంలోని రైస్ మిల్లు పాయింట్ల వద్ద ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ఇలా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, చిట్యాల ప్రాంతాల్లోని మిల్‌పాయింట్ల వద్ద ధాన్యం విక్రయిస్తున్న రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదు. ఇక్కడ కనీసం రూ.2,800 ఇవ్వాల్సిన ధరను ధాన్యం పచ్చిగా ఉందంటూ రూ.2,100 నుంచి రూ.2,300కే పరిమితం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం



మిర్యాలగూడ మండలం శెట్టిపాలెంలోని రైస్‌మిల్లుల వద్ద బారులు తీరిన ధాన్యం లోడు ట్రాక్టర్లు

రావులపెంటకు చెందిన ఓ రైతు 40 క్వింటాళ్ల సన్నధాన్యాన్ని (కావేరి చింటు) గురువారం మిర్యాలగూడలోని ఓ ప్రముఖ రైస్‌మిల్ పాయింట్ వద్దకు తీసుకువస్తే రూ.2,200 ధర నిర్ణయించారు. తెచ్చిన ధాన్యాన్ని వెనక్కి తీసుకెళ్లలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో అదే ధరకు రైతు విక్రయించాడు. నిజానికి, సన్న ధాన్యం సీఎంఆర్ శాతాల (పచ్చి బియ్యం 59 కిలోలు, బాయిల్డ్ అయితే 60 కిలోలు)ను తగ్గించాలని మిల్లర్లు ఇటీవల మంత్రులను కోరారు. దీనిపై మంత్రి వర్గ ఉప సంఘం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈలోగా వరి కోతలు మొదలవ్వడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, చండూరు డివిజన్ల నుంచి మిర్యాలగూడ ప్రాంతంలోని మిల్లుల వద్దకు రైతులు ధాన్యం తీసుకొస్తున్నారు. దీంతో మిల్లు పాయింట్ల వద్ద మిల్లర్లు నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో విదేశాలకు కూడా సన్న బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు కేంద్రం అనుమతించడం, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడాన్ని మిల్లర్లు అవకాశంగా మార్చుకున్నారు. తమకు నచ్చిన ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొంటున్నారు. పైగా, సీఎంఆర్‌పై ప్రభుత్వం దిగివచ్చే దాకా మార్కెట్లో సన్న ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2,400కి మించి కొనుగోలు చేయవద్దని మిల్లర్లు అంతర్గతంగా అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

పత్తి మీద సాము

(మొదటి పేజీ తరువాయి)

పంట తెగుళ్ల బారినపడింది. చేలల్లో నీరు నిల్వ ఉండడంతో వేర్లకు తెగుళ్ల సోకి చెట్లు ఎండిపోవడం, కాయలు నల్లబడడం, ఆకులు ఎర్రగా మారుతున్నాయి. ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్లకు దిగుబడికి గాను నాలుగైదు క్వింటాళ్లు వివంచడం లేదు. మొదటి తీతలోనే దిగుబడి సంగతి తేలిపోవడంతో రైతులు కొన్ని ప్రాంతాల్లో పత్తి చెట్లను తొలగించి, మొక్కజొన్న సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



రాష్ట్రంలో ప్రాంతాన్ని బట్టి ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. కానీ, నాలుగైదు క్వింటాళ్ల దిగుబడే వస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వారం నుంచి పెద్ద మార్కెట్లయిన వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లలో క్వింటా రూ.5,300- రూ.7,100 వరకు మాత్రమే ధర పలుకుతోంది. రెండు, మూడు రోజుల్లో 3.5 లక్షల క్వింటాళ్ల పత్తిని రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. కాగా, కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. దీనికంటే కూడా తక్కువకే వ్యాపారులు ఖరీదు చేస్తున్నారు. తొలి విడత పత్తి మార్కెట్లోకి వస్తున్నా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలంగాణలో కొనుగోళ్లు ప్రారంభించలేదని.. ఇదే అదనుగా వ్యాపారులు, దళారులు ధర భారీగా తగ్గించేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వ వైఖరి కారణంగా తాము నష్టపోతున్నామని వాపోతున్నారు.

రూ.475 బోనస్ హామీ ఉత్తదేనా?

ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్కొక్క హామీని అమలు చేస్తున్న ప్రభుత్వం రూ.475 బోనస్‌పై దృష్టిపెట్టడం లేదని పత్తి రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల పైగా దిగుబడి తగ్గిన నేపథ్యంలో బోనస్ అందిస్తే ఎంతో కొంత ఊరట లభిస్తుందని ఆశిస్తున్నారు. రాష్ట్రంలో 25.33 లక్షల టన్నుల పత్తి వస్తుందని మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన బోనస్ కింద రూ.1,108 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటికే పత్తి కొనుగోళ్లు ప్రారంభం కావడంతో బోనస్ రానట్లేనని రైతులు భావిస్తున్నారు. మరోవైపు గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట భారీగా దెబ్బతిన్నది. వ్యవసాయ శాఖ అధికారులు 33 శాతం పంట నష్టం వాటిల్లితేనే పరిహారానికి అర్హులుగా గుర్తించారు. వివిధ సాంకేతిక కారణాలతో అర్హులైన వారికి పరిహారం రాలేదనే ఆరోపణలున్నాయి. అయితే, 8 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడికి గాను 50 శాతం కూడా రావడం లేదని.. ఈ లెక్కన చూసినా నిబంధనల ప్రకారం 33 శాతం కంటే అధికంగానే నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు. 50 శాతం దిగుబడి కోల్పోయిన రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎకరాకు 5 క్వింటాళ్లూ రావడం లేదు

ఈ ఏడాది ఆరు ఎకరాల్లో పత్తి వేశా. రూ.50 వేల చొప్పున రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెట్టిన. ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదు. వరుస వానలతో తెగుళ్ల విజృంభించి పంట ఎండిపోయింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. కష్టానికి కూడా ప్రతిఫలం దక్కేలా లేదు. ప్రభుత్వం పత్తి రైతులకు బోనస్‌తో పాటు నష్టపరిహారం కూడా ఇచ్చి ఆదుకోవాలి.

-ర్యాకం రవీందర్, చిట్యాల, భూపాలపల్లి జిల్లా

3 క్వింటాళ్ల దిగుబడీ లేదు..

పత్తి సాగుకు చేసిన ఖర్చులు కూడా రావడం లేదు. రెండెకరాల్లో రూ.లక్ష పైగా పెట్టుబడి పెట్టిన. మా శ్రమకు తగిన ప్రతిఫలం కూడా వచ్చేలా లేదు. 45 రోజులుగా కురిసిన వర్షాలకు తెగుళ్ల సోకాయి. మా ప్రాంతంలో ఎకరానికి మూడు క్వింటాళ్ల దిగుబడీ రాలేదు. ప్రభుత్వం మద్దతు ధరను కల్పించడంతో పాటు బోనస్ చెల్లించాలి.

-కొర్ర గవర్సింగ్, రైతు, పర్శనాయక్ తండా, వరంగల్ జిల్లా

మొక్కజొన్నకు దిక్కేది..?

కొనుగోలు కేంద్రాలు తెరవని మార్క్‌ఫెడ్

మార్కెట్‌కు చేరుతున్న పంట..

రూ.150 వరకు ధర తగ్గిస్తున్న దళారులు

తరుగు పేరిట కోత.. తూకంలోనూ దగా



జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంటను అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోవడంతో మార్క్‌ఫెడ్ కేంద్రాలను తెరిచే పరిస్థితి కనిపించడం లేదు. ఇదే అదనుగా దళారులు ధరలు తగ్గించి రైతులను దగా చేస్తున్నారు. ఈ సీజన్‌లో అధిక వర్షాలతో కష్టాల్లో ఉన్న రైతులను ఈ పరిణామం మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

పతనమవుతున్న ధర:

మక్కలు క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,225గా ఉంది. ప్రైవేటు వ్యాపారులు రూ.2,100 నుంచి రూ. 2,150 వరకు చెల్లిస్తున్నారు. తరుగు పేరిట క్వింటాలుకు సుమారు నాలుగు కిలోల వరకు కోత పెడుతున్నారు. అలాగే క్యాష్ కటింగ్ పేరిట రెండు శాతం కోత, తూకాల్లో సైతం మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. జగిత్యాల జిల్లాలో ఇప్పుడిప్పుడే మక్కలు మార్కెట్‌కు వస్తున్నాయి. జిల్లాలో వారం, పది రోజుల క్రితం వరకు మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2,300 వరకు పలికింది. పంట చేతికి వస్తున్న సమయంలో ధరలు పతనమవుతు న్నాయి. వ్యాపారుల మాయాజాలం వల్లే ధరలు తగ్గుతున్నాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు జరిపించాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ విషయమై జగిత్యాల జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం ఎండీ హబీబ్‌ను సంప్రదించగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే జిల్లాలో ఎక్కడైతే మొక్కజొన్న సాగు ఎక్కువగా ఉందో ఆయా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరవాలి

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పండించిన మొక్కజొన్న కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కేంద్రాలు తెరవాలి. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. మార్కెట్‌లో దళారులు ధరలు తగ్గించడంతో పాటు క్యాష్ కటింగ్, తేమ పేరుతో ధర తగ్గింపు, తూకంలో హెచ్చు తగ్గులు వంటి అవకతవకలకు పాల్పడుతున్నారు.

- నల్లాల ఆదిరెడ్డి, మొక్కజొన్న రైతు, ఆలూరు గ్రామం, జగిత్యాల జిల్లా

బతుకమ్మ చీరల విషయంలో సీతక్క పొంతన లేని వ్యాఖ్యలు: హరీశ్



హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీని ఎందుకు నిలిపివేసిందన్న అంశంపై మంత్రి సీతక్క పొంతనలేని వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. చీరలు ఎందుకు ఇవ్వలేదో చెప్పకుండా ఇతర విషయాలు మాట్లాడుతున్నారన్నారు. అయితే బీఆర్ఎస్ హయాంలో ఏటా రూ.300 కోట్లతో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారని ఒప్పుకున్న సీతక్కకు ధన్యవాదాలని చెప్పారు. కానీ అంతకుమించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించినట్లు భ్రమలు కల్పించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా ప్రచారం కోరుకోవడం ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు అలవాటుగా మారిందన్నారు. మహాలక్ష్మి పథకం బకాయిలు అలాగే ఉన్నాయని, కళ్యాణ లక్ష్మి పథకంలో అదనంగా తులం బంగారం ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. రూ.500కు వంటగ్యాస్, గృహజ్యోతి కొందరికే పరిమితమైందని, హామీల అమలు విషయంలో చేసింది గోరంత, చెప్పుకునేది కొండంతగా ఉందన్నారు. మహిళల గౌరవాన్ని నిలబెడుతున్నామన్న కాంగ్రెస్ మాటలు అటుంచితే, ముందు మహిళల ప్రాణాలు కాపాడాలని, వారి భద్రతకు భరోసా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ హయంలో నాసిరకం చీరలు ఇచ్చి.. మహిళల ఆత్మగౌరవాన్ని కించపర్చారు



గత ప్రభుత్వం ఖర్చుపెట్టిన డబ్బుకు

పది రెట్ల ప్రయోజనాలు మహిళలకు కల్పిస్తున్నాం: సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో బతుకమ్మ చీరలను బంద్ పెట్టారన్న హరీశ్‌రావు వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నాసిరకం చీరలిచ్చి మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరలకు మించిన ఆర్థిక ప్రయోజనాలను మహిళలకు కల్పిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలకు ఏడాదికి పెట్టిన ఖర్చు రూ.300 కోట్లు మాత్రమేనని, దానికి పది రెట్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం తమ ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఒక నెలకు అయ్యే ఖర్చే రూ.332 కోట్లు అని వివరించారు. మహిళల గౌరవాన్ని నిలబెడుతూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేయూత ఇస్తున్నామని తెలిపారు.



నాగార్జున సాగర్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

కృష్ణా ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

శ్రీశైలానికి 79 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో

నాగార్జున సాగర్‌కు 67 వేల క్యూసెక్కులు

గద్వాల/నాగార్జున సాగర్/మెండోర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణా, తుంగభద్ర నదులకు స్వల్పంగా వరద ప్రవాహం కొనసాగుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు గురువారం 40 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 42 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయానికి 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 34,420 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 51 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. గేట్ల ద్వారా 21,528 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 38,408 క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 28 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్ల ద్వారా 14 వేల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 5 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 79,536 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 67,776 క్యూసెక్కులను వదులుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలకు గాను 212.91 టీఎంసీల నీరు ఉంది. నాగార్జున సాగర్‌కు 67,637 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిగా నిండటంతో (312 టీఎంసీలు) నాలుగు గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ నుంచి మొత్తం 78,997 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. నిజామాబాద్ జిల్లాలో గోదావరి నదిపై ఉన్న శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులోకి 18,826 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మూడు గేట్లు ఎత్తి.. 9,372 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి(80 టీఎంసీలు)లో నిండి ఉంది.

గెలవలేమనే అడ్డగోలు హామీలిచ్చారు

ఈ విషయం ఓ కాంగ్రెస్ మంత్రి చెప్పారు.. మీరే 15 మందిని మార్చుకుంటే గెలుస్తుండే అన్నారు

» రేవంత్‌కు ఏమీ తెల్వదు.. తెల్వదన్న విషయమూ తెల్వదు

» ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలతో గ్రూప్-1 మెయిన్స్ మళ్లీ రద్దయ్యే పరిస్థితి

» పైన జుమ్లా పీఎం.. ఇక్కడ హౌలా సీఎం..

» 25సార్లు ఢిల్లీకెళ్లిన రేవంత్ చేసిందేమీ లేదు

» మూసీ బాధితులకు అండగా ఉంటాం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): "గెలుస్తామని అనుకోకుండా అడ్డగోలు హామీలిచ్చామని ఓ కాంగ్రెస్ మంత్రి ఇటీవల నాతో అన్నారు. మీరే 15 మందిని మార్చుకుని ఉంటే గెలుస్తుండే అని చెప్పారు. నా పేరు చెప్పవద్దంటూ అన్నీ చెప్పేశారు" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ ప్రతినిధులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. అంతకుముందు గ్రూప్-1 పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో సమావేశమై వారితో చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమంలో మహా ఉద్దండ పిండాలతో కొట్లాడినం. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి లాంటి వాళ్లతో కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం. అంతటి ఉద్దండుల ముందు ఈ చిట్టి నాయుడు ఒక లెక్క కాదు. ఈయనతో కొట్లాడదామంటే కూడా మనసు ఒప్పడం లేదు. మొన్న వికారాబాద్ వెళ్లి హైదరాబాద్ చుట్టూ మూడు దిక్కులు సముద్రం ఉందంటాడు. ఆగస్టు 15 రోజు ప్రసంగంలో భాక్రానంగల్ డ్యాం ఉందన్నాడు. రేవంత్ రెడ్డి ప్రకారం.. విప్రో సీఈవో సత్య నాదెళ్ల. ఆయనకు ఏం తెల్వదు. తెల్వదన్న విషయం కూడా ఆయనకు తెల్వదు. పిచ్చోడి చేతిలో రాయి మాదిరిగా ఉంది పరిస్థితి. ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత మన మీద ఉంది. రాష్ట్రంలోని ఏ వర్గం ప్రజలకు కష్టం వచ్చినా.. గాంధీ భవన్, బీజేపీ ఆఫీస్‌కు కాకుండా తెలంగాణ భవన్‌కు వస్తున్నారు. తెలంగాణ భవన్‌కు వెళ్తే కేసీఆర్ దండు ఉంటదని, న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. హైడ్రా బాధితులు కూడా ఇక్కడికే వస్తున్నారు. చిట్టినాయుడు పాలనలో బాధపడని వాళ్లు లేరు. ఊళ్లలో రైతులు తిడుతున్నారు. తులం బంగారం, బతుకమ్మ చీరలు.. ఏదీ దిక్కులేని పరిస్థితి తెచ్చారన్నారని మండిపడుతున్నారు" అని ఆయన అన్నారు.



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

గ్రూప్-1 అభ్యర్థులు రోడ్డెక్కినా పట్టించుకోరా?

"గ్రూప్-1 కోసం అశోక్‌నగర్‌లో విద్యార్థులు రోడ్డెక్కారు. గ్రూప్-1 పరీక్షల్లో అన్యాయం జరుగుతుందని వారంటున్నారు. కేసీఆర్ తెచ్చిన 95% రిజర్వేషన్‌కు తూట్లు పొడుస్తున్నారు. స్థానిక పిల్లలకు ఉద్యోగాలు రావాలని కేసీఆర్ ప్రయత్నిస్తే.. మాకు రాకుండా చిట్టి నాయుడు చేస్తున్నారని పిల్లలు ధర్నాకు కూర్చున్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో విద్యార్థులకు అన్యాయం జరిగేలా వ్యవహరిస్తున్నారు. గ్రూప్-1 మెయిన్స్ రాసేందుకు ఇబ్బంది లేదని అభ్యర్థులు చెబుతున్నారు. 3లక్షల మందిలో 30వేల మంది అర్హత సాధించామని చెబుతున్నారు. మెయిన్స్ రాసిన తర్వాత ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల వల్ల పరీక్ష రద్దు అయ్యి మళ్లీ రాయాల్సిన పరిస్థితి వస్తుందంటున్నారు. అశోక్ నగర్‌కు వెళ్లాల్సి ఉన్నప్పటికీ అక్కడ పోలీసులను పెట్టటంతో విద్యార్థులే తెలంగాణ భవన్‌కు వచ్చారు" అని కేటీఆర్ తెలిపారు.

మళ్లీ ప్రజలు మెచ్చే విధంగా దగ్గరవుదాం

తెలంగాణకు ఏ అన్యాయం జరిగినా బీజేపీ వాళ్లు ప్రశ్నించరు. పేదల ఇళ్లు కూల్చినా.. చిట్టి నాయుడు మొత్తం తెలంగాణను నాశనం చేసినా.. బీజేపీ వాళ్లు మాట్లాడరు. ఎందుకంటే బడే భాయ్.. చోటే భాయ్ ఇద్దరూ ఒక్కటే. పైననేమో జుమ్లా పీఎం.. ఇక్కడ హౌలా సీఎం. మనం జాగ్రత్తగా ఉండాల్సింది ఈ రెండు పార్టీలతోనే. మతాన్ని, దేవుడ్ని అడ్డం పెట్టుకుని పిల్లల్ని రెచ్చగొట్టే పార్టీ బీజేపీ. రాష్ట్రానికి బీజేపీ చేసిందేమి లేదు. పదినెలల్లో మన పార్టీ అన్ని కష్టకాలాలను అధిగమించింది. చిన్నచిన్న పొరపాట్ల వల్ల ఊహించని విధంగా ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్‌కి గాయం. కొంతమంది పార్టీ మారటం, మన పార్టీ నాయకురాలు కవితను జైలుకు వెళ్లడం జరిగింది. తలవంచకుండా పోరాటం చేశాం. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఎదురుదెబ్బ తగిలింది. ప్రజలు మనకు రెండుసార్లు అవకాశం ఇచ్చారు. వాళ్లను అనటానికి ఏమీ లేదు. మళ్లీ ప్రజలు మెచ్చే విధంగా వాళ్లకు దగ్గరవుదాం అని కేటీఆర్ అన్నారు. మరోవైపు.. మూసీ ప్రాజెక్ట్ పేరుతో పేదల ఇళ్లు కూల్చుతామంటే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని కేటీఆర్ హెచ్చరించారు. మూసీ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. తమకు అండగా ఉండాలని గురువారం తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులు భయపడాల్సిన అవసరం లేదని, న్యాయ సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కాగా, పోను 25 సార్లు.. రాను 25 సార్లు ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసి సిల్వర్ జూబ్లీ పూర్తి చేసిన సీఎం రేవంత్ రెడ్డి తట్టా మట్టి తీసింది లేదు.. కొత్తగా చేసింది అసలే లేదు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో సీఎం 25 సార్లు ఢిల్లీకి వెళ్లారన్నారని ఆయన ఎక్స్ వేదికగా విమర్శించారు.

ఈ నెల 23న క్యాబినెట్ భేటీ

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 23న భేటీ కానుంది. వచ్చే బుధవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. సమావేశంలో మూసీ నది సుందరీకరణ, ధరణి ప్రాజెక్టు, హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇంటి పథకం, తదితర అంశాలు చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే హైడ్రాకు పలు శాఖల అధికారాలను బదిలీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైడ్రాపైనా చర్చించనున్నట్లు తెలిసింది. వీటితో పాటు మరికొన్ని అంశాలపై చర్చించి, కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

పత్రికలు నిజాలు తెలుసుకొని వార్తలు రాయాలి

- ప్రజల్లో అపోహలు కల్పించేలా రాయకూడదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పత్రికలు నిజ నిజాలు తెలుసుకొని వార్తలు రాయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఒకటి, రెండు పార్టీల పత్రికలు పనిగట్టుకొని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం, మంత్రులపై అసత్య వార్తలు రాస్తూ శునకానందం పొందుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉండాలి తప్ప ప్రజల్లో అపోహలు కల్పించేలా వార్తలు రాయకూడదని హితవు పలికారు. కొన్ని పత్రికలు పార్టీలను సంతృప్తిపరిచే వార్తలు రాయడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ పత్రిక తాను హెలికాప్టర్ అడిగితే అధికారులు వద్దన్నట్టు వార్త రాసిందని, సీఎంకు, మంత్రులకు మధ్య విభేదాలు సృష్టించేలా ఓ పార్టీ పత్రిక వెకిలి రాతలు రాస్తోందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డ ప్రభాకర్ రావును అమెరికాకు పంపిన విషయం, హరీశ్ రావు, కేటీఆర్ అక్కడకు వెళ్లి భారతదేశంలోకి అడుగుపెట్టొదంటూ ఆయన్ను హెచ్చరించిన విషయాన్ని ఆ పత్రిక రాయాల్సిందని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు పార్టీలో రెండో స్థానం కోసం కేసీఆర్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తున్న విషయాన్ని ఆ పత్రిక రాస్తే బాగుంటుందని అన్నారు.

గాంధీభవన్‌లో 23న మంత్రులతో ముఖాముఖి

ఈ నెల 23న గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి ఉంటుందని టీపీసీసీ నాయకులు తెలిపారు. ఆయా సమస్యలపై ఫిర్యాదులు అందించి పరిష్కారం కోరుకునే ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం గాంధీభవన్‌కు రావాలని పీసీసీ నాయకులు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పాపాలను రేవంత్ కడుగుతున్నారు

- పీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం

బీఆర్ఎస్ చేసిన పాపాలను సీఎంగా రేవంత్‌రెడ్డి కడుగుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం వ్యాఖ్యానించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చితే... రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ అప్పులకు వడ్డీల కింద రూ.50 వేల కోట్లు చెల్లించినట్టు సత్యం శ్రీరంగం తెలిపారు. ఈ విషయాన్ని మరిచి 9 నెలల్లో 80వేల కోట్లు అప్పు చేశారని కేటీఆర్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

మేడిగడ్డ కేసు డిసెంబరు 27కు వాయిదా

- కేసీఆర్ సహా ఏడుగురు గైర్హాజరుతో కోర్టు నిర్ణయం

భూపాలపల్లి కృష్ణకాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు మరో ఆరుగురిపై భూపాలపల్లికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి దాఖలు చేసిన కేసు మళ్లీ వాయిదా పడింది. ప్రతివాదులైన కేసీఆర్, హరీశ్‌రావు, ఇరిగేషన్ చీఫ్ సెక్రటరీ రజత్ కుమార్, రాష్ట్ర మాజీ ముఖ్య అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్లు హరిరాం, ఎన్.శ్రీధర్, మెగా ఇంజనీరింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఎల్అండ్‌టీ కంపెనీ జనరల్ మేనేజర్ సురేశ్ కుమార్ భూపాలపల్లి జిల్లా సెషన్ కోర్టుకు గురువారం హాజరుకావాల్సి ఉంది. హరీశ్‌రావు తరఫున న్యాయవాది లలితారెడ్డి, మెగా కృష్ణారెడ్డి, రజత్‌కుమార్ తరఫున న్యాయవాది అవధాని, హరిరాం, శ్రీధర్ తరఫున న్యాయవాది నర్సింహారెడ్డి మాత్రమే కోర్టుకు హాజరయ్యారు. దీంతో కేసును డిసెంబరు 27కు జడ్జి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో కేసీఆర్, స్మితా సబర్వాల్, ఎల్అండ్‌టీ సురేశ్ కుమార్‌కు సమన్లు పంపనున్నట్టు పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. తమ తరఫు న్యాయవాది గంట సంజీవ రెడ్డి మృతి చెందడంతో ఆయన స్థానంలో హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్‌తో పాటు మరో ఇద్దరు న్యాయవాదులను నియమించుకున్నామని పిటిషనర్ తెలిపారు.



వాల్మీకీ, కొమురం భీమ్‌కు సీఎం నివాళి

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొమురం భీమ్ వర్ధంతి, వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.



సచివాలయంలో మూసీ పునరుజ్జీవం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను తిలకిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి

మూసీకి పునరుజ్జీవం

(మొదటిపేజీ తరువాయి)

పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ మురికి కూపంగా మారడంతో దశాబ్దాలుగా హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలు నరకం చవిచూస్తున్నారని, కొందరు మూసీ గర్భంలో మురికి కూపాల్లో మగ్గుతూ దుర్భరమైన జీవనం సాగిస్తున్నారని, అలాంటి ప్రజలకు మెరుగైన జీవనం అందించాలనే లక్ష్యంతో తాము పునరుజ్జీవానికి పూనుకొంటే అధికారం కోల్పోయిన దుగ్ధతో కొన్ని శక్తులు విష ప్రచారానికి పూనుకుంటున్నాయని మండిపడ్డారు. "450 ఏళ్లకు పైబడిన చరిత్ర ఉన్న చారిత్రక నగరమిది. అన్ని నాగరికతల్లాగే అందమైన మూసీ నదీ తీరంలో ఈ నగరం ఎదిగింది. ఎంతో ఖ్యాతి సంపాదించింది. గోల్కొండ కోట, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, ఉస్మానియా ఆసుపత్రి, హైకోర్టు భవనం వంటి చారిత్రక కట్టడాలతో అలరారుతోంది. దీన్ని ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా మార్చవచ్చు. అందుకు మేం పూనుకున్నాం. దీనికి ఎందుకు అడ్డుపడుతున్నారు? మీ బాధేంటి? మీ అభ్యంతరాలేమిటి? మీ అనుమానాలేంటి" అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. చివరకు మీడియా సైతం మౌనంగా ఉంటోందని, తమ ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం లేదని వాపోయారు. "చెప్పండి.. మీకెవ్వరికీ ఇష్టం లేదంటే.. నేను కూడా ఎల్లుండే ఈ ప్రాజెక్టును ఆపేస్తా. టెండర్లు రద్దు చేస్తా" అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌ను ప్రపంచంలో గొప్ప నగరంగా తీర్చిదిద్దడానికి ఇది మంచి అవకాశమని, పర్యాటకం ద్వారానే ఆదాయం పెరుగుతుందని, ఆదాయం లేకపోతే సంక్షేమ పథకాలు అమలు చేయలేమని అన్నారు.అన్నారు.

అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తా..

మూసీ పునరుజ్జీవానికి తాము చేపట్టే పనుల మీద అనుమానాలున్నా, వివరణలు కావాలన్నా, సూచనలు, సలహాలు ఉన్నా అన్ని పార్టీలు తప్పక చెప్పవచ్చని, దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతకంటే పెద్ద వేదికైన అసెంబ్లీలోనే చర్చిద్దామని, ఇందుకు నాలుగైదు రోజులపాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కిషన్ రెడ్డి, ఈటల వంటి ఎంపీల పరిధిలో మూసీ పరివాహక ప్రాంతం ఉన్నందున వాళ్లను కూడా సభకు ఆహ్వానిస్తామన్నారు. ఈ సమావేశాలకు రావాలని ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్, నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్‌లకు ఆహ్వానం పలికారు. మూసీ పునరుజ్జీవంపై ప్రతిపక్షాలకు ఎలాంటి అనుమానాలున్నా నోట్ రూపంలో ప్రశ్నావళి పంపితే.. వారి ప్రతి సందేహాన్ని రాతపూర్వకంగా తీరుస్తామని తేల్చి చెప్పారు. ఈనెల 19వ తేదీలోపు అనుమానాలను పంపాలని కేసీఆర్, కిషన్ రెడ్డి, ఒవైసీల తోపాటు కమ్యూనిస్టు పార్టీలకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు కూడా సలహా సూచనలను రాతపూర్వకంగా ఇవ్వాలని కోరారు. వారి స్పందన ఆధారంగా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తానని, తక్షణం శాసన సభ సమావేశాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఒక్క రోజు వృథా చేసినా నష్టమని, దానివల్ల పేదలకు ఎంతో కష్టమని అన్నారు. విపక్షాలతో సమావేశాలను ఏర్పాటు చేసి ఏకాభిప్రాయం తీసుకురావాలని ఇప్పటికే డిప్యూటీ సీఎంను కోరానన్నారు. దీనిపై మీడియా ఎడిటర్లతోనూ చర్చిస్తామన్నారు. పర్యావరణవేత్తలతో చర్చించేందుకు మంత్రివర్గ ఉప సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు.

ఇప్పటి వరకూ ఖర్చు 141 కోట్లే!

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు రూ.141 కోట్లు మాత్రమే ఖర్చు చేశామని సీఎం రేవంత్ తెలిపారు. కానీ, కొందరు ఎక్కడి నుంచో లక్షన్నర కోట్ల లెక్కలు తెచ్చారని, బహుశా కాళేశ్వరంలో ఆ పదం వాడి వాడి.. మూసీ విషయంలోనూ అలవాటుగా వాడేస్తున్నారని ఎద్దేవా చేశారు.

గ్లోబల్ కంపెనీలతో కన్సార్షియం

మూసీ పునరుజ్జీవానికి ప్రపంచంలోని ఐదు కంపెనీల (మెయిన్ హార్ట్ గ్రూప్, రియోస్, కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్, ఝూ, సోమ్)ను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చామని, అన్ని అంశాలను పరిశీలించి ఏడాదిన్నరలో వారు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) ఇస్తారని, ఆ తర్వాతే ఖర్చు తేలుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. "ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టుల్లో పాల్గొన్న ఐదు కంపెనీలను ఎంపిక చేసి, వాటిని ఒక కన్సార్షియంగా ఏర్పాటు చేశాం. ఆరున్నర ఏళ్లపాటు ప్రాజెక్టులో ఇది భాగస్వామిగా ఉంటుంది. ఏడాదిన్నరలో డీపీఆర్ ఇస్తుంది. అందులో పునరుజ్జీవ ప్రణాళిక, నిధుల అంచనా, ఆర్థిక వనరుల కూర్పు, పెట్టుబడుల సేకరణ, లాభనష్టాలు వంటి అంశాలన్నీ పొందుపరుస్తుంది. గ్లోబల్ ఏజెన్సీలతో సంప్రదింపులు, సదస్సులు, సమావేశాల నిర్వహణ తదితర పనులన్నీ చూసుకుంటుంది. ఇందుకే కన్సార్షియానికి రూ.141 కోట్లు కేటాయించాం. అంతకుమించి ఐదు పైసలు కూడా అదనంగా ఖర్చు చేయలేదు" అని వివరించారు. కన్సార్షియంలో ఉన్న కంపెనీలకు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ (సర్దార్ వల్లభాయ్ పటేల్), సమతామూర్తి (ముచ్చింతల్) విగ్రహాలు నిర్మించిన అనుభవం ఉందని, బుర్జు ఖలీఫా నిర్మాణంలో భాగమైన సంస్థ కూడా భాగస్వామి అని చెప్పారు. కానీ, పాకిస్థాన్‌కు చెందిన కంపెనీ అంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం కొందరు చేస్తున్నారని మండిపడ్డారు.

మూసీలో 3 నెలలు ఉండండి, అద్దె నేను కడతా

మూసీ ప్రక్షాళన ద్వారా ప్రజలకు మెరుగైన జీవితం అందించాలని తాము చూస్తుంటే కొందరు విష ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. "యూట్యూబ్‌లు పెట్టి విష ప్రచారం చేస్తే చాలు అధికారంలోకి



వస్తామని ఒకాయనకు ఎవరో చెప్పారట. దాంతో మెదడంతా విషం నింపుకొని సుందరీకరణ అంటూ ప్రచారం చేస్తున్నారు. అధికారం కోల్పోయిన అసహనంతో మాట్లాడుతున్నారు. మేం చేస్తున్నది దుబాయ్‌లో నెత్తి మీద జుట్టు నాట్లేయించుకునే సుందరీకరణ కాదు. మూసీలో ఒక్క ఇంటిని కూడా కూల్చనీయమని, బుల్డోజర్లకు అడ్డం పడతమని కొందరు లీడర్లు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. అదే మూసీ రివర్ బెడ్‌లోని ఇళ్లలో నివాసం ఉండాలని వాళ్లను నేను కోరుతున్నాను. కేటీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు సవాల్ విసురుతున్నా. నిర్వాసితులు ఖాళీ చేసి పోయిన ఇళ్లు రెడీగా ఉన్నాయి. వాటిలో ఓ మూడు నెలలు ఉండండి. రెంట్ నేను కడతా. మీకు ఫుడ్ కూడా ఏర్పాటు చేస్తా. మీరు ఉండి మంచిగుందంటే అప్పుడు పేదలు కూడా వచ్చి ఉంటారు. అప్పుడు తేలుద్దాం" అంటూ సీఎం రేవంత్ సవాల్ విసిరారు. అక్కడ బాగుందని అప్పుడు వాళ్లు చెబితే ప్రాజెక్టును రద్దు చేస్తానని, ఇప్పటి వరకు అయిన ఖర్చును తానే భరిస్తానని అన్నారు.

అందరికీ నచ్చిన రీతిలో ప్యాకేజీ



మూసీలో ఇప్పటి వరకు ఒక్క ఇంటిని కూడా ప్రభుత్వం బలవంతంగా కూల్చలేదని, డబుల్ బెడ్‌రూం ఇల్లు తీసుకుని వెళ్లిన లబ్ధిదారులే స్వచ్ఛందంగా వాటిని ఖాళీ చేయడమే కాకుండా ఆ ఇళ్లను కూలగొట్టారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటి వరకూ ఒక్క ఇటుకను కూడా ప్రభుత్వం తీయలేదని, హైడ్రా అటువైపు కన్నెత్తి చూడలేదని వివరించారు. రివర్ బెడ్‌లో 1600, బఫర్ జోన్‌లో మరో 10 వేల ఇళ్లు ఉన్నాయి. అందరికీ నచ్చిన రీతిలో ప్యాకేజీ మాట్లాడి మెరుగైన జీవనం కల్పిస్తాం. పేదలకు కలిగే నష్టం, కష్టాన్ని పరిగణనలోకి తీసుకుని, వారిని అక్కున చేర్చుకుని అన్ని విధాలుగా ఆదుకుంటాం. శాశ్వత నిర్మాణాలు ఉన్న వారిలో ఎవరు ఎంత నష్టపోతున్నారనే దానిని అంచనా వేసి, వారిని సంప్రదించి, వివరాలను సేకరించి ఆ స్థాయిలోనే న్యాయం చేస్తాం. ఈ విషయంలో ప్రభుత్వం విచక్షణతో ఉంది. ఆదుకోవాలనే తాపత్రయం ఉంది" అని వివరించారు. మూసీ పునరుజ్జీవానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ క్రమంలో పేదలను ఆదుకోవడానికి సంప్రదింపులే మార్గమని, వాటిని ఎలా మొదలు పెట్టాలనే కార్యాచరణను ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ, మజ్లి‌స్‌తోపాటు మీడియా కూడా ఇవ్వాలని కోరారు. మూసీ పునరుజ్జీవంలో నష్టపోయేవారికి ఏ సాయం అందించాలనే దానిపై మీడియా కూడా నిజనిర్ధారణ కమిటీ వేసి, రిపోర్టు ఇచ్చినా స్వీకరిస్తామని అన్నారు. దీనిపై అపోహలు, అనవసరమైన వాదనలతో మరో విషయాన్ని ముడిపెట్టి గందరగోళానికి తెర లేపవద్దని విజ్ఞప్తి చేశారు. హైడ్రా పేరుతో భయపెడితే బెదరవద్దని, హైడ్రా దయ్యమో, ఫామ్‌హౌజ్‌లో పడుకున్న భూతమో కాదని చమత్కరించారు. అక్కడ ఆస్తులు, ఇళ్లు కోల్పోతున్న వారిలో కొంతమంది కోర్టుకెళ్లారని విలేకరులు ప్రస్తావించగా.. కోర్టుకెళ్లినా, వెళ్లకపోయినా.. వారు నష్టపోతున్న దాన్ని అంచనా వేసి, ఏవిధంగా ఆదుకోవాలన్న దానిపైనే కార్యాచరణ ఇవ్వాలని కోరుతున్నానని స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు నష్టపోయిన వారికి రూ.10 వేలు పరిహారం ఇస్తామని ప్రకటించారని, అందులో పెద్ద స్కామ్ జరిగిందని, దానిపై విచారణకు సిద్ధమా అని బీఆర్ఎస్‌కు సీఎంరేవంత్ సవాల్ విసిరారు. సిద్ధమని అంటే.. 48 గంటల్లోనే ఏసీబీకి ఆదేశాలు ఇస్తానని వ్యాఖ్యానించారు. కాగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మూసీ పునరుజ్జీవన కార్యక్రమం చేపట్టాలని కేసీఆర్ భావించారని, కానీ, మానవీయ కోణంలో ఆలోచించే ఆయన చేయలేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని విలేకరులు చెప్పగా.. వాళ్ల మానవత్వం, మానవీయ కోణం మల్లన్నసాగర్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు నిర్మించిన ప్రాంతాలకు వెళ్తే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. ఏ విషయంలోనూ బీఆర్ఎస్‌తో తమకు పోలిక లేదని, ఒక మనిషి, ప్రభుత్వం ఎలా ఉండకూడదో, తక్కువ టైమ్‌లో ఎక్కువ దోపిడీ ఎలా చేస్తారనే దానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రోల్‌మోడల్ అని వ్యాఖ్యానించారు. వాళ్లు చేసినట్టు తాను చేయకపోతే తెలంగాణకు వెయ్యి రెట్లు మేలు చేసిన వాడినవుతానని అన్నారు. మూసీలో నిర్మాణాలు చేపట్టడంలేదని, గండిపేట నుంచి నల్గొండ వైపు వరకు ఎలివేటెడ్ కారిడార్లు, ఆపైన మెట్రో ఉండేలా, మూసీకి ఇరువైపులా ప్రయాణించేలా బ్రిడ్జిలు నిర్మిస్తామని స్పష్టతనిచ్చారు.

మీరు ఏడికంటే ఆడికి వస్తా

కొందరు ప్రతిపక్ష నాయకులు ఇక్కడికి వస్తవా.. అక్కడికి వస్తవా అంటూ సవాళ్లు విసురుతున్నారని, తానందుకు సిద్ధమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. "మూసీ పరివాహకంలోకే కాదు.. ఏటిగడ్డ కిష్టాపూర్, వేములఘాట్, మల్లన్నసాగర్, కొండపోచంపల్లి, రంగనాయక సాగర్‌కు కూడా వస్తా. సెక్యూరిటీ లేకుండా వస్తా. మీరు వస్తారా? రండి.. అక్కడ రచ్చబండ నిర్వహించి పదేళ్లలో మీరేం దుర్మార్గం చేశారో కూర్చొని చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. గత ప్రభుత్వం నిర్వాసితులకు పునరావాసం కూడా కల్పించకుండా పోలీసులతో దుర్మార్గంగా హింసించిందని, అవన్నీ మర్చిపోయి గత పాలకులు ఇప్పుడు అచ్చోసిన ఆంబోతుల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నగరంలో ఇప్పటికే చెరువులు, కుంటలు పోయాయని, వరదలు ముంచెత్తుతుంటే చూస్తూ ఊరుకుందామా అని ప్రశ్నించారు. చిన్న వర్షాలకే ఇటీవల బెంగళూరు, చెన్నై అతలాకుతలం అయ్యాయని, అదే గతి మనకూ పట్టాలని ప్రతిపక్ష నాయకులు కోరుకుంటున్నారా అని నిలదీశారు. సిటీలో చినుకు పడిందంటే గంటల తరబడి జామ్ అవుతోందని, వర్షం నీటిని ఎక్కడికి పంపాలో తెలియని పరిస్థితి ఉందని వివరించారు. ప్రభుత్వం ఒక మంచి కార్యక్రమం తీసుకుంటే ఓర్వలేకపోతున్నారని, ఈ నగరం మరో వెయ్యేళ్లు ఉండాలనే మూసీ పునరుజ్జీవానికి పూనుకున్నామని వివరించారు. ఇందుకు కేంద్రం నుంచి కూడా సాయం అందుతుందని భావిస్తున్నామని, కొన్ని గ్రాంట్లు కూడా వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదాయాన్ని పెంచి, పేదలకు పంచే విషయంలో తమకు ఎవరూ నీతులు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే కాకపోయినా హరీశ్‌ను మంత్రిని చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, ఆ విశ్వాసాన్ని ఆయన మర్చిపోకూడదని సూచించారు.

దేశ భద్రతే ముఖ్యం

దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసే రేడార్ స్టేషన్ సెల్ టవర్ కంటే తక్కువ ఫ్రీక్వెన్సీతో ఉంటుందని, ఆ కేంద్రం దేశ భద్రతకు సంబంధించిన విషయమని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. నిజంగానే ఆ ఫ్రీక్వెన్సీతో ఇబ్బంది ఉందనుకుంటే.. అక్కడ నేవీకి సంబంధించిన దాదాపు 3,500 కుటుంబాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. రేడార్ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 2,900 ఎకరాల్లో సుమారు 8-10 శాతం భూమిలోనే నిర్మాణం చేపడతారని చెప్పారు. దేశ భద్రతకు సంబంధించిన అంశంలోనూ రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు. అయినా.. అసలు ఆ రేడార్ స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతులను బీఆర్ఎస్ హయాంలోనే ఇచ్చారని, ఇప్పుడు తన ఖాతాలో రాసేలా చిత్రీకరిస్తున్నారన్నారని, దేశం కోసం రేడార్ స్టేషన్‌ను తన ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమేనని రేవంత్ స్పష్టం చేశారు. ఈ స్టేషన్ ఏర్పాటుకు కేంద్రం ఇచ్చిన నిధులను తీసుకుని, ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాహనాన్ని కేటీఆర్ వచ్చి ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. దేశభక్తి లేకపోతే కసబ్ కంటే హీనులని, కేటీఆర్ కసబ్‌లాగా మారతానంటే తనకేమీ అభ్యంతరం లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆకాశ హర్మ్యాలను నిర్మించడానికి 111 జీవో పరిధిలో ఉన్న 2-3 లక్షల ఎకరాలను సర్వనాశనం చేశారని, మూసీనే కాకుండా, గండిపేటను కూడా నాశనం చేయాలని చూసినవారు తమకు నీతులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూసీ ప్రక్షాళన వెనుక మరో కోణం

- హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్
- హైదరాబాద్‌లో హైడ్రాతో అందరికీ భయం
- రేవంత్‌రెడ్డి పాలనలో రియల్ ఎస్టేట్ కుదేలు
- మల్కాజిగిరి ఎంపీ ఈటల



ఖమ్మం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్‌లో మూసీనది ప్రక్షాళన వెనుక మరో కోణం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం వేరే ప్రయత్నాలు సాగిస్తోందని, అది సందర్భం వచ్చినప్పుడు బయటపెడతామని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో హైడ్రాతో అందరు భయపడుతున్నారని, హైదరాబాదులో పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారని అన్నారు. ఖమ్మంలోని పాతఖానాపురంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని గురువారం ఈటల ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం తప్ప ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీ సక్రమంగా అమలు కావడంలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో అసలు ఎంతమంది రైతులకు రుణమాఫీ అయింది? అసలు రైతుబంధు ఇస్తారా ? లేదా అనే విషయాల్లో స్పష్టత లేదన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులకు, ఇళ్లు మునిగి ఆస్తి నష్టపోయిన కుటుంబాలకు సైతం ఇప్పటి వరకు వరద సాయం చాలామందికి అందలేదన్నారు. రాష్ట్రంలో వరద నష్టానికి కేంద్రం నుంచి సహాయం అందించడం లేదని కాంగ్రెస్ మంత్రులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ విగ్రహాన్ని కూల్చిన దుష్ట శక్తులను ప్రభుత్వం శిక్షించాలని ఈటల డిమాండ్ చేశారు.

కొత్త లైన్ల వ్యయం వినియోగదారుల నుంచే వసూలు!

- దరఖాస్తుదారుల నుంచే రాబట్టుకోవాలని డిస్కమ్‌ల నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తగా విద్యుత్తు సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో కరెంట్ కనెక్షన్ తీసుకోవాలంటే చార్జీల మోత మోగనుంది. కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వారి నుంచి ఆ లైన్లు వేయడానికి అవసరమైన వ్యయాన్ని తిరిగి రాబట్టుకోవాలని తెలంగాణ డిస్కమ్‌లు యోచిస్తున్నాయి. ఈ మేరకు వెసులుబాటు కల్పించాలని తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)ని కోరాయి. 2020 డిసెంబరు 31న ఎలక్ట్రిసిటీ రూల్స్ ప్రకారం వినియోగదారులకు విద్యుత్తును అందించడానికి వీలుగా 150 కిలోవాట్ల లోపు లేదా ఆ పైన లోడు కోసం కొత్తగా సరఫరా వ్యవస్థకు వెచ్చించిన వ్యయాన్ని తిరిగి రాబట్టుకోవాలని కేంద్ర విద్యుత్తు శాఖ డిస్కమ్‌లకు ఆదేశాలిచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే 2013లో కమిషన్ జారీ చేసిన రెగ్యులేషన్-4ను సవరించాలని డిస్కమ్‌లు ఈఆర్సీకి విజ్ఞప్తి చేశాయి. దాంతో ఈ ముసాయిదా రెగ్యులేషన్ సవరణపై ఈనెల 24లోగా అభిప్రాయాలు/అభ్యంతరాలు తెలపాలంటూ గురువారం నోటిఫికేషన్ ఇచ్చింది. దాంతో కొత్తగా విద్యుత్తు సరఫరా వ్యవస్థను పునరుద్ధరించిన ప్రాంతాల్లో కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేవారి నుంచి సర్వీస్ లైన్ చార్జీలను కిలోవాట్ లోడ్ ఆధారంగా డిస్కమ్‌లు వసూలు చేయనున్నాయి.

సర్వీస్ లైన్ చార్జీల ప్రతిపాదనలు..

డొమెస్టిక్, వాణిజ్య, పరిశ్రమల విభాగాల్లో ఒక కిలోవాట్ వరకు ఎటువంటి చార్జీలు లేవు. ఒక కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల దాకా.. డొమెస్టిక్‌లో రూ.100, నాన్ డొమెస్టిక్‌లో రూ.110, పరిశ్రమలకు రూ.120గా ప్రతిపాదించారు. 3- 5 కిలోవాట్ల దాకా.. డొమెస్టిక్‌లో 3 కిలోవాట్లకు రూ.300.. ఆపైన కిలోవాట్‌కు 150, నాన్ డొమెస్టిక్‌లో 3 కిలోవాట్లకు రూ.330.. ఆపైన 165, పరిశ్రమలకు 3 కిలోవాట్లకు రూ.360.. ఆపైన రూ.180గా పేర్కొన్నారు. 5 కిలోవాట్ల నుంచి 15 కిలోవాట్ల దాకా.. డొమెస్టిక్‌లో 5 కిలోవాట్లకు 600, ఆపైన రూ.200, నాన్‌డొమెస్టిక్‌లో 5 కిలోవాట్లకు రూ.660.. ఆపైన రూ.220, పరిశ్రమలకు 5 కిలోవాట్లకు రూ.720, ఆపైన రూ.240గా నివేదించారు. 15 కిలోవాట్ల నుంచి 56 కిలోవాట్ల దాకా.. డొమెస్టిక్‌లో 15 కిలోవాట్లకు రూ.2,600.. ఆపైన కిలోవాట్‌కు రూ.250, నాన్‌డొమెస్టిక్‌లో 15 కిలోవాట్లకు రూ.2,860, ఆపైన రూ.250, పరిశ్రమలకు 15 కిలోవాట్లకు రూ.3,120, ఆపైన కిలోవాట్‌కు రూ.360గా ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. 56 కిలోవాట్ల నుంచి 75 కిలోవాట్ల దాకా.. పరిశ్రమల విభాగంలో 15 కిలోవాట్లకు రూ.15,420, ఆపైన కిలోవాట్‌కు రూ.360, 75 కిలోవాట్ల నుంచి 93 కిలోవాట్ల దాకా పరిశ్రమలకు 75 కిలోవాట్లకు 22,260, ఆపైన కిలోవాట్‌కు రూ.432గా నిర్ణయించారు.



ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరిస్తున్న బాలకిష్టారెడ్డి

రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం అమలు

- ప్రపంచంతో పోటీ పడేలా సిలబస్ మార్పు అవసరం
- ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా బాలకిష్టారెడ్డి బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. బాలకిష్టా రెడ్డి తెలిపారు. గురువారం మాసాబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్‌గా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంతో పోటీ పడాలంటే నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని, రానున్న అయిదు, పదేళ్ల అవసరాలకనుగుణంగా సిలబసును రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చదువు కోసం మనం వెళ్లకుండా, మన ఇంటికే విద్య అందేలా మార్పులు చేయాలన్నారు. జాతీయ విద్యావిధానం అమలు చేస్తేనే యూజీసీ, కేంద్రం నుంచి నిధులు వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. పదేళ్లుగా వర్సిటీల్లో నియామక ప్రక్రియ నిలిచిపోయిందని, సరిపడా సిబ్బంది లేరని ఆయన తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు కమిట్‌మెంట్‌తో పనిచేయడం లేదని వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యా మండలిలో పలు సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారని, ఉన్నత విద్యాభివృద్ధిలో మార్పులు తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ప్రొ. పురుషోత్తం బాధ్యతలు స్వీకరించారు.


'నేవీ రేడార్' కోసం ఆనాడే కేటీఆర్ 130 కోట్లు తీసుకున్నడు..

- ఇప్పుడేమో రేడార్ స్టేషన్‌తో నష్టమని అంటుండు..
- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్



వికారాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 'బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే 2017లో నేవీ రేడార్ స్టేషన్ ఏర్పాటు కోసం 44 జీవో తెచ్చి కేటీఆర్ రూ.130 కోట్ల నుంచి రూ.135 కోట్లు తీసుకున్నడు. ఇప్పుడేమో రేడార్ స్టేషన్ ఏర్పాటుతో నష్టమని అంటున్నడు. ఎంత అబద్ధమో చూడండి.. దీనిపై చర్చ జరగాలి' అంటూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ మాట్లాడుతూ.. హైడ్రాతో పాటు మూసీ నది ప్రక్షాళన గత ప్రభుత్వ ఆలోచనే అని అన్నారు. దాన్ని ప్రస్తుత ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై గ్రామాల్లో చర్చ జరగాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ధ్వంసం చేసిందని.. వారు చేసిన అప్పులకు రూ.7 వేల కోట్ల మిత్తి చెల్లిస్తున్నామని చెప్పారు. ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ సర్కారు ఏమాత్రం నెరవేర్చిందో అందరికీ తెలిసిందేనని ఎద్దేవా చేశారు. గతంలో జిల్లా నుంచి ముఖ్యమంత్రి, స్పీకర్ ఉన్నారని చెప్పే వారని.. ఇప్పుడు శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తోడయ్యారన్నారు. ముగ్గురం కలిసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని వ్యాఖ్యానించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


మన విశ్వం చిత్రాన్ని చూసి ఆనందించి రోజు రోజుకు కలెక్షన్లు పెంచుతూ,
అఖండ విజయాన్ని సమకూరుస్తూ, అండగా నిలబడిన తెలుగు ప్రేక్షకుల
కుటుంబాలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ... మీ విశ్వం
BLOCKBUSTER
people MEDIA FACTORY
CHITRALAYAM
DONEPUDI CHAKRAPANI PRESENTS
2ND WEEK
SRI TIRUMALA TIRUPATI VENKATESWARA FILMS
ENTERTAINER
MACHO STAR
GOPICHAND
IN
A SREENU VAITLA FILM
విశ్వం
T G VISHWA PRASAD
VENU DONEPUDI
VIVEK KUCHIBHOTLA
KONDAL JINNA
KRITHI PRASAD
K.V. GUHAN
CHAITAN BHARADWAJ
GOPI MOHAN
BHANU - NANDU
PRAVEEN VARMA
AMAR REDDY KUDUMULA
KIRAN KUMAR MANNE
RAVI VERMA
KOLLI SUJITH KUMAR
ADITYA CHEMBOLU
KONGARAPI RAMBABU
VAMSI SHEKAR
TIPS TELUGU